

13_4_1988 చైత్ర బహుళ ద్వాదశీ బుధవారం

కళాప్రపూర్ణ, దేశోద్ధారక శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారి

120 వ జయంతి.

భారతి

మాసపత్రిక

*

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

*

ఏప్రిల్ 1988

సంపుటము : 65 సంచిక : 4

విడిపత్రిక వెల ఐదు రూపాయలు

విషయానుక్రమణిక

ఏప్రిల్ - 1988

“ఏమండీ. ఆ భరించలేని నొప్పి ఏమైంది?”





మేలుపరచబడిన అమృతాంజన్ వాడడంతో.

కోమలమైన అమృతాంజన్‌ను చాలా సులభంగా రాసుకోవచ్చు.

మృదువైన అమృతాంజన్‌తో చాలా సులభంగా 'మర్దనా' చేయవచ్చు.

తలనొప్పులను, వొళ్ళు నొప్పులను, కీళ్ళ నొప్పులను, కండరాల నొప్పులను మరియు బెణుకులను మేలుపరచబడిన అమృతాంజన్ మునపటికంటే అతి త్వరితంగా వుపశమింపజేయగలదు !

మేలుపరచబడిన
అమృతాంజన్

మీ మోముపై చిరునగవులను శీఘ్రంగా- తిరిగి వికసింపజేయగలదు!

Amrutanjan Limited

OBM 149 TG R

స్వవిషయం

భారతిలో ఎటువంటి రచనలు ఎక్కువగా పడితే బాగా ఉంటుందో సూచిస్తూ కొందరు రాస్తూనే ఉంటారు. వారందరికీ కృతజ్ఞులము! భారతి మొదలుపెట్టి ఇప్పటికి అరవయినాలుగు సంవత్సరాలు దాటింది. మొదటినుంచీ కూడా భారతిలో అన్నిరకాల రచనలకీ అవకాశం ఉంటూనే వచ్చింది; కవిత్వం, నాటకాలు, విమర్శ, చరిత్ర పరిశోధన, విజ్ఞానశాస్త్రాలు, కథలు, నవలలు, రాజకీయాలు - ఒకటేమిటి అన్నిరకాల రచనలనీ ప్రచురిస్తూనే వచ్చాము! అయితే, ఇతర పత్రికలలో సాధారణంగా కనిపించని రచనలు భారతిలో తరచు పడడం కూడా సహజమే. శాసనాలు, వ్యాకరణం, చరిత్ర వంటివాటికి సంబంధించిన వ్యాసాలు భారతిలో కొంచెం విపులంగా ప్రచురించబడటంలో ఆశ్చర్యంలేదు కాని ఎప్పుడూ కూడా భారతి తెలుగువారి సంస్కృతికి ప్రతిబింబంగా ఉండే వివిధ రచనలకి చోటు కల్పిస్తూనే ఉన్నది. వర్తమానకాలంలో తెలుగువారి చైతన్యాలలో కలిగే మార్పుల ఫలితంగా వచ్చే రచనలకి భారతిలో ఎప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుంది. ఈ వాస్తవం భారతికి రాసేవారికి కాని, భారతిని చదివేవారికి కాని తెలియదని కాదు; వీలయినప్పుడల్లా దానిని గుర్తు చెయ్యటంలో తప్పులేదని మాత్రమే ఇక్కడ దానిని గురించి మరొకసారి చెబుతున్నాము!

ఈ నెల సంచికలో విప్లవోద్యమ కవిత మీద శ్రీ వేణుగోపాల్‌గారు రాసిన వ్యాసం మొదటిభాగం పడుతోంది. ఆంధ్రలో చెలరేగిన ఒక ముఖ్యమయిన ఉద్యమం వలన ప్రభావితులయిన కవుల కవిత్వాన్ని పరిశీలించే ఈ వ్యాసం భారతి పఠితలందరినీ ఆలోచింప చెయ్యగలదని ఆశిస్తున్నాము...

తెలుగువారి చరిత్రలో వేంగికి అతి ముఖ్యమయిన స్థానం ఉన్నదని అందరూ ఒప్పుకుంటారు. సుప్రసిద్ధ పురావస్తు శాస్త్రవేత్త డా॥ ఇంగువ కార్తికేయశర్మగారు పెద్దవేగిలో జరిపిన తవ్వకాల ఫలితాలని సంక్షిప్తంగా వర్ణించే ఆయన వ్యాసం ఈ నెల భారతిలో చోటు చేసుకోవటం ఒక విశేషం! తీరాంధ్ర దేశంలో మరిన్ని తవ్వకాలు జరిగి మరింతగా చారిత్రకావశేషాలు బయటపడగలవని ఆశించనివారు ఉండరు!

విశ్వనాథ సత్యనారాయణగారి నవలలలో సాంఘిక దృక్పథాన్ని గురించి ఆలోచించినవారు ఎందరయినా ఉంటారు. ఎందరో ఇంకా ఆలోచిస్తూనే ఉంటారు. డా॥ శివలెంక ప్రకాశరావుగారి వ్యాసం కొత్త ఆలోచనలని రేకెత్తింప చెయ్యవచ్చు...

తెలుగువారు ఏ విధంగా చూసినా భారతీయులే. సుప్రసిద్ధ కన్నడ రచయిత డా॥ అనంతమూర్తిగారి "కవిపూర్ణిమ" కథ ఇతర భారతీయ భాషలలో కథారచన ఎలాగ ఉందో తెలుసుకునేందుకు అవకాశం కల్పించగలదు. అనువాదకులు శ్రీ శంకరగంటి రంగాచార్యులుగారు కూడా భారతి చదివేవారికి సుపరిచితులే. భారతిలో అప్పుడప్పుడు ఇతర భాషల కథల అనువాదాలు వెయ్యటానికి ప్రయత్నిస్తూనే ఉంటాము...

దివాన్ సి. వి. రంగాచార్యులు

శ్రీ డి. రామలింగం

పంథొమ్మిదవ శతాబ్ది ఉత్తరార్థ భాగంలో ఒక ఆంధ్రుడు మైసూరు రాజ్యానికి దివాన్‌గా ఉన్నాడు. ఈయన పేరు చెట్టిపాణ్యం వీరవల్లి రంగాచార్యులు (1831-1888). బ్రిటీషువారు 1881లో మైసూరు రాజ్యాన్ని దానికి హక్కుదారులైన హిందూ రాజకుటుంబానికి తిరిగి అప్పగింత పెట్టిన తరువాత ఆ సంస్థానానికి మొదటి దివానుగా ఈయన పదవి నధిష్టించాడు. ఈయన పరిపాలనా విషయాలలో దిట్ట. రాజ్య ఖజానాను చక్కదిద్ది, అనేక అభివృద్ధి కార్యాలను చేపట్టి, సంస్థానాన్ని అభ్యుదయ పథంలోకి తెచ్చాడు.

ఈయనకు ప్రజాస్వామ్య వ్యవస్థలపై ఎంతో విశ్వాసం ఉండేది. భారత జాతీయ కాంగ్రెసు పుట్టడానికి నాలుగేళ్ళు పూర్వమే 1881 లో మైసూరుకు ఈయన ప్రతినిధుల సభను (రిప్రజెంటేటివ్ అసెంబ్లీ) ఏర్పాటు చేశాడంటే రాజరికాల యుగంలో ఈయన చేసిన సాహసం ఎటువంటిదో మనం గమనించవచ్చు. ప్రతిజిల్లానుంచి వ్యవసాయ వాణిజ్య రంగానికి చెందిన ప్రముఖులను ప్రతినిధులుగా నియమించి, మైసూరు దసరా ఉత్సవాల సందర్భంలో ప్రతినిధుల సభను సమావేశ పరిచేవాడు. అందులో ప్రభుత్వం గడచిన సంవత్సరంలో చేసిన పనులను నివేదించి ఇక చేపట్టబోయే పనులను వివరించి వారి సలహాలను కోరేవాడు. ప్రతినిధులు వార సూచనలను, ఫిర్యాదులను సభాముఖంగా చేయవచ్చు. ప్రభుత్వ కార్యనిర్వాహణలో ఏవైనా లోపాలుంటే వాటిని విమర్శించవచ్చు. అభిజ్ఞులైన వారు కొత్త ప్రతిపాదనలు చేయవచ్చు. ఈ విధంగా ప్రభుత్వానికీ ప్రజాప్రతినిధులకూ మధ్య సంధానము కలిగించాడు.

ఆ కాలంలో దేశీయ సంస్థానాలలో చలా గొప్ప వ్యక్తులు దివానులుగా పనిచేశారు. రాజా సర్ టి. మాధవరావు తిరువాన్కూరు ఇండోరు, బరోడా సంస్థానాలకూ, సర్ సాలార్‌జంగ్ 30 ఏళ్ళపాటు హైదరాబాదుకూ, సర్ దినకర్‌రావు గ్వాలియర్‌కూ, సర్ శేషయశాస్త్రి తిరువాన్కూరు పుదుక్కోటలకూ, రామయ్యంగార్ తిరువాన్కూరుకూ దివానులుగా, ప్రధాన మంత్రులుగా పనిచేసి రాజకీయ రంగంలో ప్రసిద్ధులైనారు. విఖ్యాత సంస్కృత విద్వాంసుడు సర్ మోనియర్ విలియమ్స్ సర్ టి. మాధవరావు, సర్ సాలార్ జంగ్‌లను గూర్చి వ్రాస్తూ "ఇటువంటి ఇద్దరు వ్యక్తులు భారతదేశంలో రెండు మూడు శతాబ్దాల కాలంలో ఒక్కమారు మాత్రమే జన్మిస్తారు" అన్నాడు.



దివాన్ సి. వి. రంగాచార్యులు

రంగాచార్యులు మద్రాసు ప్రెసిడెన్సీలో చెంగల్పట్టు జిల్లాలోని చెట్టి పాణ్యం గ్రామంలో ఒక బ్రాహ్మణ వైష్ణవ కుటుంబంలో 1831 లో జన్మించాడు. తండ్రి రాఘవాచార్యులు చెంగల్పట్టు జిల్లా కలెక్టర్ ఆఫీసులో గుమాస్తా. ఆయనకు సంతానం ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె లక్ష్మమ్మ. రంగాచార్యులు రెండవ కుమారుడు. రంగాచార్యులు గారి తాతగారైన నరసింహాచార్యులుగారి హయాంలో ఈ కుటుంబం మచిలీపట్నం సమీపంలో ఉన్న వీరవల్లి గ్రామంనుంచి చెంగల్పట్టు జిల్లాకు వలసవెళ్ళి పరిస్థితుల ననుసరించి అక్కడే స్థిరపడ్డారు. ఆ కుటుంబంలో మగవారి కందరికీ చివర 'చార్లు' అని

ఉండడంచేత వీరు ఆంధ్ర వైష్ణవులని స్థానికులు సులభంగా గుర్తుపట్ట గలిగేవారు. వీరిది చాలా పేదకుటుంబమే. అయినా విద్యా బుద్ధులలో శ్రేష్ఠులు. తిరువాన్కూరు దివానుగా పనిచేసిన వెంబాకం రామయ్యంగార్, మద్రాసులో మేటి న్యాయవాదిగా పేర్వడసిన సర్ టి. భాష్యం అయ్యంగార్ గారిలు రంగాచార్లుగారికి దగ్గర బంధువులే.

రంగాచార్లు మొదట మద్రాసులోని పచ్చయప్ప పాఠశాలలోనూ, ఆ తర్వాత మద్రాసు హైస్కూలులోనూ విద్యాభ్యాసం చేశాడు ఈ మద్రాసు హైస్కూలే తరువాత ప్రెసిడెన్సీ కాలేజీగా వృద్ధి చెందింది. ఇందులో రంగాచార్లు 1849 వరకూ చదివి అన్ని పాఠ్య విషయాలలో ఉత్తమశ్రేణిలో ఉత్తీర్ణుడై, దక్షిణ భారతదేశంలో ఇంగ్లీషు చదువులకు పథనిర్దేశకుడైన మద్రాసు హైస్కూలు ప్రిన్సిపాల్ ఇ.బి. పొవెల్ ప్రశంసలకు కూడా పాత్రుడైనాడు. ఈ స్కూలులో చదివిన కొందరు విద్యార్థులు దివానులుగా, న్యాయమూర్తులుగా ఉన్నత స్థితికి వచ్చారు.

రంగాచార్యులు ప్రొఫిషియంట్ పరీక్షలో ప్రథమశ్రేణిలో సర్వ ప్రథముడుగా ఉత్తీర్ణుడై పేదరికం వల్ల అపైన చదవడానికి వీలులేక 19వ ఏటనే మద్రాసు కలెక్టర్ ఆఫీసులో హుజూరు డిప్యూటీ అకౌంటెంట్‌గా చేరి, పబ్లిక్ సర్వీసు టెస్ట్‌లో ఉత్తీర్ణుడై, చెంగల్పట్టు కలెక్టర్ ఆఫీసులో అసిస్టెంట్ మున్షీగా శాశ్వతమైన ఉద్యోగం సంపాదించాడు. జీతం నెలకు రూ. 14/-లు ఈయనకు 14వ ఏటనే అలమేలమ్మతో వివాహం జరిగింది. అలా ఉద్యోగంలో పైకివస్తూ డిప్యూటీ కలెక్టర్ అయ్యాడు.

1868లో మైసూరు మహారాజా మూడవ కృష్ణరాజ ఒడెయర్ మరణించగా, బ్రిటిషువారు రాజప్రాసాదాన్ని ఆక్రమించుకొని, దానికి సీళ్ళువేసి, మహారాజావారి ఆస్తుల పూర్తిపట్టికను తయారు చేయించడానికై సైన్యాధికారి మేజర్ ఇలియట్‌కు తోడ్పడటానికి అప్పట్లో సమర్థుడైన రెవిన్యూ అధికారిగా పేరు పొందిన రంగాచార్యులు గారి సేవలను మద్రాసు ప్రభుత్వంనుంచి ఎరవు తీసుకున్నారు. ఆ విధంగా 1868లో మైసూరు సంస్థాన సర్వీసుకు బదిలీ అయిన రంగాచార్యులు తన శేష జీవితమంతా అక్కడే గడపి, మెట్టు మెట్టుగా ఉన్నతోద్యోగాలు చేస్తూ, చివరకు మూడవ కృష్ణరాజ ఒడెయర్‌కు దత్తపుత్రుడైన మహారాజా శ్రీ చామరాజేంద్ర ఒడెయర్‌కు 1881లో బ్రిటిషువారు తిరిగి మైసూరు సంస్థానాన్ని అప్పగింత పెట్టగా (వైస్రాయి లార్డు రిపన్ హయాంలో ఇది జరిగింది) అదే సంవత్సరం రంగాచార్యులు మైసూరు సంస్థానానికి దివాన్ అయ్యాడు.

మైసూరు సంస్థానానికి 14వ శతాబ్ది ఉత్తరార్థ భాగంనుంచీ ఒడెయర్లే పాలకులు. కన్నడ భాషలో ఒడెయర్ అనగా ప్రభువు లేక యజమాని అని అర్థం. ఆ తరువాత హైదరలీ బలవంతుడై, రాజకుటుంబీకులను నామమాత్రులను చేసి, తానే రాజ్యపాలన సాగించాడు. హైదరలీ కుమారుడైన టిప్పూ సుల్తాన్ 1782లో తండ్రి స్థానంలో అధికారానికి వచ్చి తానే మైసూరు రాజునని ప్రకటించుకున్నాడు. బ్రిటిషువారు నాల్గవ మైసూరు యుద్ధంలో శ్రీరంగపట్నం ముట్టడిలో టిప్పూను వధించి మైసూరు రాజ్యాన్ని స్వాధీన పరచుకొని తిరిగి దానిని ఒడెయర్ వంశం వారికే అప్పగించవలెనని నిశ్చయించి, మహారాజా చామరాజేంద్ర ఒడెయర్‌కు 1881 మార్చి 25 తేదీన జరిగిన ప్రత్యేక దర్బారులో అప్పగింత పెట్టారు. సంస్థానానికి రంగాచార్యులు చేసిన సేవను ప్రస్తుతిస్తూ మహారాజా ఆదేరోజు ఆయనను దివానుగా నియమించారు.

రంగాచార్యులు పుట్టేనాటికి బ్రిటిషువారు మైసూరును స్వాధీన పరచుకొని 32 ఏండ్లు దాటాయి. 1857 సిపాయీల తిరుగుబాటు సమయంలో ఆయన వయస్సు 26. అప్పట్లో ఒక భారతీయుడు ఆ పదవికి రావడం అల్పమైన విషయం కాదు. బ్రిటిషువారు తలచుకుంటే ఒక ఆంగ్లేయుడినే ఆ పదవిలో నియమించేవారు. ఆయన రెండేళ్ళు మాత్రమే పదవిలోఉండి నిర్భయంగా వ్యవహరిస్తూ సచ్చీలుడన్న పేరు తెచ్చుకొని, రాజమహలులో దుష్టశక్తులను అణచివేసి, సంస్థానాన్ని ఒక కొత్త శకంలోకి ప్రవేశపెట్టాడు. ఆ పునాదిపైననే తక్కిన వారు దానిని అభివృద్ధి పరిచారు. ఆయన తెలుగు, తమిళ, కన్నడ భాషలలో ప్రజలతో అధికారులతో మాట్లాడేవాడు. కోపం వస్తే ఈమూడు భాషలూ ఉపయోగించి అధికార్లపై కేకలు వేసేవాడు. కన్నడంలో ప్రావీణ్యం సంపాదించాలను కున్నాడు కాని, అతి త్వరగా పదవులు మారుతూ రేయింబగళ్ళు ప్రభుత్వ కార్యాలలో నిమగ్నుడై ఉండడం చేత అది వీలుపడలేదు. కాని కన్నడ భాషా సాహిత్యాల వికాసానికి ఎంతో కృషి చేశాడు.

రంగాచార్యులు అప్పటి రాజకీయ, సాంఘిక పరిస్థితులచే గాఢంగా ప్రభావితుడైన వ్యక్తి. రాజా రామమోహనరాయ్ 1828లో బ్రహ్మ సమాజాన్ని స్థాపించాడు. ఈశ్వరచంద్ర విద్యాసాగర్ వంటి మహనీయులు సంఘసంస్కరణకు పాటు పడగా, ద్వారకానాథ

మిత్తర్, కాశీనాథ త్ర్యంబక్ తెలాంగ్, సర్ ముత్తుస్వామి, మహాదేవ గోవిందరనడే, తయబ్జీ ప్రభృతులు న్యాయశాస్త్ర కోవిదులై న్యాయ మూర్తులైనారు. ఉమేశ్‌చంద్రబెనర్జీ, దాదాభాయి నౌరోజీ, దిన్షా వాచా, దేశంలో రాజకీయయోద్యమానికి నాయకులైనారు.

రంగాచార్యులుగారిపై మరొక ఆంధ్రప్రముఖుని ప్రభావం విశేషంగా ఉండడం గమనార్హమైన అంశం. ఆయన గాజుల లక్ష్మీ నరుసు చెట్టి (1806-1868) ఆయన మద్రాసు నగర వాస్తవ్యుడు. వణిక్ప్రముఖుడు. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో అంతర్యుద్ధం సంభవించినప్పుడు చెట్టి తెలివితేటలతో ఆ అవకాశాన్ని వినియోగించు కొని ప్రత్తి వ్యాపారంలో కోట్లు గడించి, గొప్ప శ్రీమంతుడై ఆ పిమ్మట ప్రజాహిత కార్యాలకు పూనుకొని, మద్రాసు ప్రెసిడెన్సీలో రాజకీయోద్యమానికి నాయకత్వం వహించాడు. ఆ రోజులలో క్రైస్తవ మిషనరీలు బ్రిటిషు అధికార్ల మద్దతుతో హిందువులను క్రైస్తవ మతంలో చేర్చుకొంటూ ఉంటే దానిని అరికట్టడానికై చెట్టి 1844 లో 'క్రిసెంట్' అనే పత్రికను ప్రారంభించాడు. క్రైస్తవ మతం పుచ్చు కున్న హిందువులకు కుటుంబ ఆస్తిపై వారిహక్కులను కాపాడేందుకై మద్రాసు ప్రభుత్వం ఒక చట్టంచేయ తలపెట్టగా చెట్టి ఆ బిల్లుకు వ్యతిరేకంగా లండనులో బ్రిటిషు ప్రభుత్వానికి ఒక పిటీషన్ సమ ర్పించాడు. బిల్లులోని అభ్యంతరకరమైన నిబంధనలను ప్రభుత్వం ఉపసంహరించుకోక తప్పలేదు. క్రైస్తవ మిషనరీలు బైబిల్‌లోని భాగాలను పాఠ్యాంశాలుగా నిర్ణయించవలెనని పట్టుబట్టగా చెట్టి ఈస్టిండియా కంపెనీ కోర్టు ఆఫ్ డైరెక్టర్స్‌కు ఒక మహజరు సమర్పించాడు. ఈ ఆందోళనలో జార్జి నార్టన్, జాన్ బ్రూస్ నార్టన్ ఆయనను సమర్థించారు. 1852 లో బ్రిటిషు పార్లమెంటు సభ్యుడు డాన్బీశేమూర్ మద్రాసువచ్చి చెట్టిగారికి అతిథిగా ఉండగా, ఆయన ప్రభుత్వం విపరీతమైన భూమిశిస్తు రేట్లను రైతులపై విధించి. వాటిని వారు చెల్లించకపోతే అమానుషంగా వారిని ఎట్లా దండిస్తున్నదీ పార్లమెంటు సభ్యుని దృష్టికి తెచ్చారు. ఈ విషయంపై లండన్‌లో 1856 లో కామన్స్ సభలో చర్చ జరిగి, టార్చర్ కమీషన్‌ను విచారణకు నియ మించారు. హింసాపూరితమైన దండనను పార్లమెంటు ఖండించింది. గాజుల లక్ష్మీనరుసు చెట్టి 1852 లోనే మద్రాసు నేటివ్ అసోసి యేషన్ స్థాపించి, ప్రజల ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తేవడం మొదలు పెట్టాడు. అతిగా ఉండే పన్నులు, కంపెనీ న్యాయస్థానాలలో జరిగే జాప్యం ప్రజా ధనవ్యయం, రోడ్లు వంతెనలు లేక ప్రజలుపడే అవస్థలు, సాగునీటి వనరులులేక రైతులుపడే కష్టాలు విద్యాసౌకర్యాలు లేక నిరక్షరాస్యత ప్రబలడం, ప్రభుత్వ వ్యవస్థపై అతివ్యయం-ఇవి అప్పటి ప్రజల ఇబ్బందులు. చెట్టిగారు మద్రాసు ప్రెసిడెన్సీ ప్రజా వ్యవహారాలలోనే కాక, మైసూరు రాజ్య వ్యవహారాలలో కూడా శ్రద్ధ తీసుకొని, మైసూరు స్వయంగా వెళ్ళి మహారాజా ముమ్మడి కృష్ణరాజ ఒడెయర్‌ను దర్శించి, ఒక కుమారుని దత్తు తీసుకొని, రాజవంశపు హక్కుల పరిగణకై పోరాటం సల్పవలసిందిగా ఆయనకు సలహా చెప్పాడు. చెట్టి 1868లో దివంగతుడైనాడు. మద్రాసు నేటివ్ అసోసి యేషన్ మూలపడింది. ప్రభుత్వ దమననీతి ప్రబలం కాగా 1884 లో మద్రాసు ప్రముఖులు మద్రాసు మహాజనసభను స్థాపించారు. చెట్టి గారికి ప్రజావ్యవహారాలలో సరియైన వారసుడన దగ్గవాడు సేలం రామస్వామి మొదలియార్. ఈయన లండనువెళ్ళి అక్కడి బహిరంగ సభలలో ఉపన్యాసాలిచ్చి భారతీయుల కష్టనష్టాలను బ్రిటిషు ప్రజల దృష్టికి తెచ్చాడు. 1886 లో ఇండియా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సర్వీసు కమీషన్‌లో సభ్యుడుగా మొదలియార్‌ను నామినేట్ చేశారు. ఈయన భారత జాతీయ కాంగ్రెసు సమావేశాలలో కూడా ఉత్సా హంతో పాల్గొన్నాడు. ముఖ్యంగా చెట్టిగారి కృషి రంగాచార్యులను ఆకర్షించింది.

19వ శతాబ్ది ఉత్తరార్థభాగంలో దేశంలో కలిగిన ఇటువంటి రాజకీయ, సాంఘిక సంచలనంచే గాఢంగా ప్రభావితుడై అత్యంతము ప్రేరితుడై, అరకమైన ప్రజల ఇబ్బందులను తొలగించి, నవీన ఆదర్శాలకు అనుగుణంగా పరిపాలనను నిర్వహించ సమకట్టిన మహా నీయుడు దివాన్ రంగాచార్యులు. ఈ ఆదర్శజీవి 1883 జనవరి 20 తేదీన కాలధర్మం చెందాడు.

మిత్తి కోఅల క్రింద...

డా॥ తంగిరాల వెంకట సుబ్బారావు

జ్ఞానంతో చేవదేరిన
నల్లని ఎత్తైన తుమ్మచెట్టు
గాలివాన నోట్లోపడి
కరకర లాడింది....
మిత్తి కోఅలక్రింద
మెత్తగా నలిగింది....
తెలుగు భాషా సారస్వతాల జరీకండువా
చితిలోపడి భగ్గున వెలిగింది....

ఆకలి లోంచి
దారిద్ర్యం పూరిపాకలోంచి
వారాల తరవాణీ చద్దన్నంలోంచి
కష్టపడి బయటపడిన బొబ్బలెక్కిన కాళ్లు
మేడల్లో మిద్దెల్లో సంచరించే పసిడి పావుకోళ్ళు
కాశ్మీరు దుశ్శాలువాల భుజాలు
మకర కుండలాల గండస్థలాలు
సింహ తలాటాల ముంజేతులు
రాజధానిలో పాతుకున్న ఆచార్య పీఠం!
"ఇంతింతై, వటుడింతయై...."కి
రుజువైన బ్రతుకు పాఠం!!

తరగతిలో
అరటిపండు వొలిచి
శిష్యుల చేతిలో పెట్టే గురుడు
నిత్యం ప్రాచీన కవిత్వ జ్యోత్స్నా వర్షాలు
కురిపించిన రజనీ కరుడు!
గుడిలో అయినా
బడిలో అయినా
ఊరి రచ్చకట్టముందైనా
పురపాలక భవనంలో అయినా
పండిత గోష్ఠిలో అయినా
పామరుల గుంపులో అయినా
సమానంగా ప్రవహించే
సాహిత్యోపన్యాస గంగాప్రవాహం!
రసపారవశ్యంలో ఉక్కిరి బిక్కిరయ్యే
శ్రోతల ఆనందోత్సాహం!!

కొందరి దృష్టిలో—
"చిత్తం! చిత్తం!" తో
మెత్తగా చాపక్రింద చేరేసీరు....
చెమటోడ్చి, కడుపుమాడ్చి,
పైసాపైసాగా కూర్చున్న
బంగారు తేరు....
ధర్మరాజు వేషంలో చాణక్యుడు!
"వెలనాటి లౌక్యుడు"
(ఇది అసంబద్ధ సమాసం, లేదా ప్రలాపం)
నమ్మకూడని వీనీల భూసురుడు
గొడ్డలి ప్రయోగించని పరశురాముడు
(ఆయన దగ్గర దానాలు పట్టిన
ఎందరో కశ్యపులలో నే నొకణ్ణి!)
నా కంటికి—
నేటి కపటలోకాన్ని మార్చలేక
దాని కనుగుణంగా
తన్ను తాను మలచుకున్న
సాటిలేని మేటి మనిషి!

పైకి ప్రశాంతంగా ఉండే
మొసళ్ళు నిండిన లోతైన సరస్సు!
ఎందరు ఏమనుకున్నా
అందరిమీదా
అందంగా ఉదయించిన
ఉషస్సు....!!

(ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారి మరణవార్త విని ...)

డా॥ యస్. యల్. యస్. ఆచార్య

కాకతీయుల శాసనాలు: వాక్య నిర్మాణం

మన ప్రాచీన వ్యాకర్తలు వాక్యము, వాక్యనిర్మాణ పద్ధతుల గురించి ప్రత్యేకంగా చర్చించి వివరించినట్లు కన్పడదు. పాణిని తన అష్టాధ్యాయిలో "సుప్తిఙన్తం పదమ్" అని పదాన్ని నిర్వచించినట్లు వాక్యాన్ని నిర్వచించలేదు. కాని తార్కికులైన అన్నంభట్టు, విశ్వనాథ పంచాననభట్టు మొదలైనవారు తమ తర్కసంగ్రహం,[2] సిద్ధాంత ముక్తావళి[3] మొదలైన తర్కగ్రంథాల్లోను మరియు ఆలంకారికులైన మమ్మట, విశ్వనాథులు తమ కావ్యప్రకాశ[4] సాహిత్యదర్పణాలలో[5] వాక్యాన్ని నిర్వచించారు. కాని వారి నిర్వచన వివరణాదులు వ్యాక్యార్థాన్ని గురించే కాని వాక్యనిర్మాణాన్ని గురించికాదు. వారినే తెలుగు వ్యాకరణకర్తలలో అర్వాచీనుడైన ప్రౌఢ వ్యాకరణకారుడు అనుసరించినాడు. కాని పైవారిలో సాహిత్యదర్పణకారుడు మాత్రం పదోచ్చయం వాక్యమని వాక్యాన్ని నిర్వచించాడు. ఇంకా వాక్యాన్ని నిర్వచించినవారిలో మిక్కిలి ప్రాచీనుడు అమరసింహుడు. ఈతని ననుసరించి గురుబాలప్రబోధికాకర్తయైన లింగయసూరి సంస్కృతం లోని వివిధ వాక్యాలను వివరించినాడు.[7]

ప్రత్యేకంగా వాక్యాన్ని, వాక్యభేదాలను వాక్యంలోని పద క్రమాన్ని వివరించి తెల్పినవారు ఆంగ్లవ్యాకరణ నిర్మాతలు.[8] ఆంగ్ల వ్యాకరణ సంప్రదాయాన్ననుసరించి తెలుగుభాషలో బహుజనపల్లి సీతారామాచార్యులువంటి వ్యాకరణకర్తలచే, చేకూరు రామారావుగారి వంటి ఆధునికభాషా శాస్త్రజ్ఞులచే తెలుగు వాక్యం ప్రత్యేకంగా వివరించబడింది. చిన్నయసూరి, కేతనవంటి ఆంధ్రవ్యాకరణకర్తలచే తమ వ్యాకరణాలలో ప్రత్యేకించి చెప్పకున్నప్పటికీ అక్కడక్కడ తెలుగు వాక్యరీతులు వివరించబడ్డాయి.

కాకతీయుల శాసనాలను పరిశీలిస్తే నాటి శాసనాలు కొన్ని చిన్న చిన్న వాక్యాలలో విషయాన్నంతా తెల్పుతూంటే, మరికొన్ని శాసనాలు దీర్ఘ వాక్యంతో కన్పిస్తాయి. మరికొన్ని శాసనాలలోని విషయం దీర్ఘంగా ఉన్నా వాక్యం క్రియాపదంతో పరిసమాప్తం కాక అసమాపక క్రియతో ముగిస్తున్నది. కొన్ని శాసనాలలోని వాక్యాలు కలగా పులగంగా ఉన్నాయి. సాధారణంగా నాటి శాసనాలలో ప్రధాన విషయమంతా సంక్షేపంగానో విపులగానో ఒకే వాక్యంలో కన్పిస్తుంది. దానప్రశంస, శాపోక్తులు మాత్రం భిన్న భిన్న వాక్యాలలో కన్పిస్తాయి.

కాకతీయుల శాసనాలలో విషయం సంక్షిప్తంగా ఏకవాక్యంలో కన్పించే శాసనాలలో ఒకటి :-

> "శ్రీ మన్మహామండలేశ్వర కందుకూరి గోంకణ్ణ
> దేవచోడ మహారాజులు శ్రీ యేలేశ్వర దేవరకు
> అంగ్గ రంగ్గభోగాలకు ధూపదీపనైవేద్యము
> లకును బెటకోడూరు ఆ చంద్రార్క
> స్థాయిగా నిచ్చిరి."
>
> — ఏలేశ్వరశాసనం కార్పస్ 4-44 పు 87.

ఈ విధంగా విషయాన్నంతా ఏక వాక్యంలో మిక్కిలి సంక్షేపంగా చెప్పిన శాసనాలు పరిమితంగానే కన్పిస్తాయి. కాని విషయ విస్తృతి లేకున్నా అనేక విశేషణాలతో శాసనాన్ని పెంచి ఒకే వాక్యంతో ఉండే దీర్ఘ శాసనాలు చాలా కన్పిస్తున్నాయి.

"...... సర్వగుణ .... పన్నుండును విస్తర కీర్తి .... సుండును మనుమార్గ చరితుండును రనారీసోదరుండును దురిత (వి)దురుం(డును) కాకత గణపతిదేవ మహారాజ దివ్యశ్రీ ... ధకుం డును సకలం (ద్విపసాదకుండు)- రిపర వనజవన కోలాహల మాత్త-డు-డును శరణాగత వజ్ర పంజరుండు.... త్సప సమ తుండును సత్యామర ....డును రాయగరుడడును రాయమండ...డును (-) కర కరతేజుండును అ(ం) మనెగొ (వీర)గండండును సలలిత రూప సుభగుండును మల్యాల పురవరాధీశ్వరుడునకో (....) వ్రతు-డును కాటయామాత్య-వరపుత్రుండును మయిలిమాంబికా మనోనయన వల్లభుండునైన శ్రీమతు చవుంద్రెడి (ం) దనకు ఆయురారోగ్య ఐశ్వర్యాభివిద్ధియుం గుల ప్రవృద్ధియు రాజ్యాభివిద్ధియు సంతాన సమిద్ధియు ఇష్టార్థ సిద్ధియుంగా దన్నే (-) న సకల లోకారాధ్యం డును అకళంక చరిత్రుడును లక్ష్మీకుచ కలశ కుంకుమ పంకాంకిత వ(క్ష) స్థలుండును రాక్షసకుల సంహరుండును సురముని గణవందితుం

దునుంనైన శ్రీమతు వెలిగందుల శ్రీ నరసింహదేవరకు నిత్యభోగ రాగంబులకు నియమించి చిన్నచెట్టు సర్వ యుశుద్ధింగారుణ్యము సేసిన ప్రకో(వ)(రు) న్యూనతిరిక్తముగాకుండా బాయక (సంగ)(టి) తము సేసి పాత్ర పవళయ (కనడప) ... ఆచంద్రార్కముగసన శకవరుషంబులు ౧౧౨౪ నెంటి దుందుభి సంవత్సర చైత్ర బహుళ (౧౫ సో) విషువు సంక్రాంతినాడు ధారా పూర్వకము సేసి ఇచ్చె మంగళ మహా శ్రీ శ్రీ వెలిగందుల శ్రీ కరణ (....)సి వ్రాసి మ లోజన మగ బసవోజ... "

—వెలిగందల శాసనం (అప్రకటితం)

ఇటువంటిదే పొందలూరు శాసనం.[9] ఇట్టి శాసనాలనేకం నాడు కన్పిస్తున్నాయి.

కొన్ని శాసనాలలో రెండు మూడు వాక్యాలున్నా ప్రధాన శాసనభాగం బిరుదులతో విపులమై ఏక వాక్యంలో ఉన్న శాసనాలనేకంగా ఉన్నాయి. వాటిలో ఒకటి —

"స్వస్తి సమధిగత పంచమహాశబ్ద మహామండలేశ్వర అనుమకొండ పురవరేశ్వర పరమమాహేశ్వర పతిహిత చరిత వినయ విభూషణ శ్రీ స్వయంభు దేవదివ్య శ్రీ పాదపద్మారాధక పరబల సాధక నామాది సమస్త ప్రశస్తి సహితం శ్రీ మన్మహామండలేశ్వర కాకతీయ గణపతిదేవ మహారాజులు ఓరుంగల్లు మొదలి పట్టణంబుగా సుఖసంకథా వినోదంబునం బ్రిథ్వి రాజ్యంబు సేయుచుండంగాం దత్పాదపద్మారాధకుండునుం జతుర్థ కులశేఖరుండును నరిగండ భైరవుండును నైన (గో)న- బుద్ధారెడ్డి కొడుకు గణపయ్య నిజస్వామి కారుణ్యంబు- నం గంధురునాండు బడసి వర్ధన్ మానపురంబునందు సుఖసంకథా వినోదంబున రాజ్యంబు సేయుచుండంగాం దదీయ రాజ్యసముద్ధరుండును విప్ర(కు)లైక భూషణుండును శ్రీ కరణాగ్రగణ్యుండనంబరగు భీమదేవ ప్రెగ్గడ తంనేలిన స్వామి పేరను స్వస్తి శ్రీమతు శకవర్షములు ౧౧౭౩ అగు స్వభాను సంవత్సర మాఘ శు ౧౦ లు గురువారమునాండు బుద్ధేశ్వరంబును॥ సహస్రలింగ గణపతీశ్వరంబునుం దమ తంద్రులపేర శ్రీలక్ష్మీనరసింహనారాయణ దేవరయును ఏకవింశతి లింగంబులును ప్రసంన భైరవుండును ఇంత వట్టు ప్రతిష్ఠలు సేయించి గు- గట్టించి శ్రీ మద్బుద్ధేశ్వర దేవర అం

ద్వితీయముఖం

గభోగ రంగ్గభోగ ధూపదీపనైవేద్యములకూ వ్యయ సంవత్సర చైత్ర బహుల (౧) ం మంగలవారాన విషు సంక్రా(ం) తి కాలమున చంద్ర సూర్య్యులూ భూదేవి (చరాచర) కూర్మ్మ అంతరాత్మ సాక్షిగాను గణపయ్య ధారాపూర్వ్వము సేసి సర్వ్వ నమస్యముగా నిచ్చిన గ్రామము పెద్దపల్లి...."

—వర్ధమానపుర శాసనం కార్పస్3 ఎమ్ ఎన్. 46 పి. 95

ఈ విధంగా నాటి అనేక శాసనాలలో ప్రధాన విషయం ఇంచుమించుగా ఒకే ఒక వాక్యంలో తెల్పబడింది. ఇట్లు సుదీర్ఘమైన విషయాన్ని ఒకే ఒక వాక్యంలో తెల్పుటకు శాసనకర్తలు ప్రయత్నించుటచే కొన్నిచోట్ల అన్వయ కాఠిన్య మేర్పడింది.

పల్నాడు తాలూకాలోని దుర్గిశాసనంలో దుర్గిగ్రామంలో నామదేవపండితులు చేసిన వంకేశ్వర దేవప్రతిష్ఠ, అప్పటికి గణపతిదేవ చక్రవర్తి వచ్చుట, నామదేవుడు గణపతిదేవుని సంభావించుట, విన్నపము చేయుట. గణపతిదేవుడు వంకేశ్వరుని అంగరంగభోగాలకు చేసిన దానము ఇవన్నీ ఒకే వాక్యంలో ఉన్నందువల్ల, వాక్యచిహ్నాదులేవీ కనిపించనందువల్ల అర్థం చేసికొనుటలో ఇబ్బంది కలుగుచున్నది.

"....శ్రీ నామదేవపండితులు పల్లినాంటిలోని దుగ్యపట్టినమునందు దమ తండ్రి వాయిపండితుల పేరను వంకేశ్వరదేవరం బ్రతిష్ఠ సేసి గణపతిదేవమహారాజుంగాంచి (గాంచి?) కారుణ్యము వడసి మూఱు రాయజగదాళపడగాను ఛలమెత్తుగండ బిరుదూం దెచ్చిన సకల సన్నాహమూ మెఱసి ఎద్రువచ్చి కానిపించుకొని పడగా పరుదూర్చిన జేకొని సంతోషించియున్న యవసరంబున దేవర కారుణ్యమున దుగ్యను వంకేశ్వరదేవరం బ్రతిష్ఠ సేస్తినని విన్నపము సేసినను ఆ దేవరకు నమస్కరించి స్వస్తిశ్రీ శకవర్ష బులు ౧౧౭౩ యగు నేంటి విరోధికృత్సంవత్సర ఆశ్వయుజ శుద్ధ ౧౩ శుక్రవారమునాండు వంకేశ్వర దేవర కంగరంగ భోగనైవేద్యముల కుంగ్రిష్ణవేణీ సమీపంబున నాగార్జునని కోట తూపున్న నెయ్యూరి చెఱ్వు సహితముగాను ధారాపూర్వ కంబుసేసి ఆ చంద్రార్క్క స్థాయిగా నిచ్చె"

—ద-హిం-శా 10 334 పు 172.

అదే విధంగా గణపతిదేవ చక్రవర్తి కాలానికే చెందిన పమ్మి శాసనం[10]లో పమ్మి అనే గ్రామంలో దేవన్నప్రగడ చేయించిన ప్రసన్న వల్లభుని ప్రతిష్ఠ, అక్కడకు మహాసామంత విర్యాలనాగ సానమ్మగారు వచ్చుట; దేవన్నప్రగడతో సంభాషించుట వారు భగవంతుని అంగరంగభోగాదులకు చేసిన దానధర్మాలు తర్వాత కొన్ని సంవత్సరాలకు చేసిన దానధర్మాలు మొదలైనవి ఇంచుమించు ఒకే వాక్యంలో కన్పిస్తున్నందువల్ల అర్థక్లిష్టత ఏర్పడుచున్నది. సమాపక క్రియలులేక అనేక సంవత్సరాల తర్వాత చేసిన దానాన్ని కూడ మొదటి దానవిషయంతోపాటు చెప్పినందువల్ల ఈ అర్థక్లేశ మేర్పడింది.

ఈ విధంగా కొన్ని శాసనాలలో వాక్య విరామాలు కాని వాక్యాన్వయం కాని తేలికగా గుర్తించుటకు వీలులేదు. గుంటూరు జిల్లాలోని వేల్పూరు శాసనంకూడ ఇదే విధంగా అన్వయ క్లిష్టతకు

లోనైంది. అచ్చట దానకర్త తన తల్లిదండ్రుల వంశాలను వివరిస్తూ తన దానాన్నికూడ ఒకే వాక్యంలో వివరించాడు.

"స్వస్తిశ్రీ శకవర్షంబులు ౧౧౨౦ యగు నేంటి కీలక సంవత్సర మాఘ ఋ ౧౪ శు। వేల్పునూరి శ్రీ రామేశ్వర మహాదేవరకు దన్నవాడ అమరేశ్వర స్థానము ప్రవిత్తిమంతుడైన కడియ(మ) నాహినికి దాయమసానికి సుపుత్రుండైన ఎఱ్ఱమ నాహినికి వేల్పూరి వృత్తిమంతులైన కూచెమనాహినికి బసెట్టికి సుపుత్రియైన అమరసానికి ఎఱ్ఱమ నాహినికి సుపుత్రుకుల దీపకులాలైన లోకసానికి మహాదేవనికి సుపుత్రుండైన సూరపనాహిందు తమ తలిదండ్రులకుం గట్టికొలగుండి నాహినికి దమకు ధర్మార్థముగా నా చంద్రార్కమఖండవర్తి దీపమునకిచ్చిన మోదాలు 25"

—ద-హిం-శా 10 321 పు 166

కాని ఈ విధంగా అన్వయ క్లిష్టతగల శాసనాల సంఖ్య మిక్కిలి తక్కువగా ఉన్నది. నాటి శాసనాలలో విషయమంతా ఒకే వాక్యంలో వర్ణితమైనను అన్వయ క్లిష్టతగాని అర్థకాఠిన్యముగాని లేని శాసనాలే ఎక్కువగా కన్పిస్తున్నాయి.

పద్యశాసనాల్లోని వాక్యాలు

నాటి పద్యశాసనాలలో ఇంచుమించు అన్ని పద్యాలు సమాపక క్రియతోనుండి ఏ పద్యమునకా పద్యము ఒక్కొక్క చిన్న వాక్యము వలె కన్పించును. కాని పై పద్యముతోనో లేక పద్యములతోనో అన్వయించి ఏక వాక్యత నొందే పద్యాలు రెండు మూడు చోట్లమాత్రమే కన్పించును. అందు 11వ శతాబ్ది ఉత్తరార్థమునకు చెందిన పుత్తూరు శాసనం మొదటిది. అందు మొదటి పద్యంలో ప్రారంభమైన దాత వర్ణన రెండవ పద్యంలోనూ సాగి అతడు చేసిన దానంతో అంత మౌతున్నది.

రెండవది 12వ శతాబ్ది ఉత్తరార్థానికి చెందిన రుద్రదేవ చక్రవర్తి మంత్రియైన గంగాధరుని కరీంనగర్ శాసనం.[12] ఈ శాసనంలో రచయిత పుట్టింపు మొదలు పెరిగి పెద్దదియై అధికారం సంపాదించుకొని తాను చేసిన దేవాలయ ప్రతిష్ఠాది సత్కార్యాలు 6వ పద్యంనుండి 17వ పద్యం వరకు 12 పద్యాలలో దీర్ఘంగా ఒకే వాక్యంలో వివరించబడింది. అట్లే కాకతీయ చక్రవర్తి రుద్రదేవుని వర్ణన నాల్గు పద్యాలలో క్రియారహితంగా ఆ శాసనంలోనే కన్పిస్తున్నది.

ఈ విధంగా పద్యాలలో మిక్కిలి దీర్ఘమైన వాక్యాలు చాలా తక్కువగా కన్పిస్తాయి.

కొన్ని వచనాలలో క్రియ లేనప్పటికీ ఆ పైనుండే పద్యాలలో క్రియ ఉన్నందువల్ల వాక్యం పరిసమాప్తమౌతున్నది.

రుద్రదేవునికాలంనాటి బెక్కల్లు శాసనంలోని[13] సుదీర్ఘ వచనంలో సమాపకక్రియ లేనప్పటికీ, ఆ తర్వాతనే ఉన్న "అమరంగ శైవవైష్ణవ నిజారుహ" అనే పద్యంలో "మల్లిరెడ్డి యత్యమిత గుణాఢ్యుండియతులి తాయ తనంబులు నిల్పెంప్రీతితోన్" అని వాక్యం పూర్తియౌతున్నది. అట్లే ఉప్పరపల్లి శాసనంలోని రేచెర్ల రుద్రుని అతని ప్రధానియైన రాజనాయకుని, అతని పుత్రుడైన కాటపెద్దిని వర్ణించు వచనములు మూడుకూడ ఆ తర్వాతనున్న పద్యాలతో పూర్తియౌతున్నవి. మొత్తముపై నాటి శాసనాలలోని పద్యాలలో దీర్ఘ వాక్యాల కంటె చిన్న చిన్న వాక్యాలే అధికంగా ఉన్నాయి.

సంగ్రహ వాక్యం

ఒక విషయాన్ని మొదట సంగ్రహంగా చెప్పి ఆ తర్వాత దానిని వివరించే పద్ధతి నన్నయ భారతం నాటికే ప్రసిద్ధి గాంచింది. వాక్యరూపంలో ఉన్న దీనిని సంగ్రహ వాక్యంగా బహు జనపల్లి వారు పేర్కొన్నారు. 14 ఎ ఒకే పదం లేక చిన్న వాక్యరూపంలో ఉన్న దీనిని నేడు శీర్షికగా వ్యవహరిస్తున్నాము.

కాకతీయుల శాసనాలలో సంగ్రహవాక్యములన దగ్గవి చాలా చోట్ల కన్పిస్తాయి. ప్రధానంగా దానశాసనాలలో ఇవి ఎక్కువగా కన్పిస్తాయి. తగవును పరిష్కరించిన ఒక శాసనంలో కూడ ఈ సంగ్రహ వాక్యం కన్పడుచున్నది. ప్రౌఢ వ్యాకరణంలో పేర్కొన్నట్లు ఈ సంగ్రహవాక్యముల తర్వాత విషయ వివరణ కన్పిస్తున్నది. కాని కొన్ని శాసనాలలో మాత్రం విషయవివరణ తొలుత నుండగా చివర విషయాన్ని సంక్షిప్తంగా తెలిపిన సంగ్రహవాక్యం కన్పిస్తున్నది.

వరంగల్లు జిల్లాలోని ఆకునూరు శాసనంలో[15] "....రుద్రదేవ మహారాజులు....ఆ దేవరకు అంగరంగ భోగాన కిచ్చిన ఆయం" అని సంగ్రహంగా తెలిపి ఆ తర్వాత

> 'రాట్నాల బొరగాళ మాడలు తోంట రాట్నాల రాజ్ఞా (ట్నా?) న మూండు సిన్నాలు....'

అని ఈ విధంగా వివరించబడింది. ఇటువంటిదే బెక్కల్లు శాసనం.[16]

> "పూజాపునస్కార సహిత మౌచుంన దే (వకా) యాన్ నకెల్లా నిచ్చిన వ్రిత్తి"

అని సంక్షేపించి తర్వాత

> "నల్ల చెఱువెన్క నాగులకుంటలోన నిరోహరి యనక ఇరువుంబండ మత్తులు 3 ఎఱుమ గెఱువెన్క మత్తులున నిరోహరియనక ఇరువుంబండ...."

అని వివరించబడింది. ఇట్లు దాన శాసనాలలో పెక్కుచోట్ల ఈ పద్ధతి కన్పిస్తూ ఉన్నది. ఇతర శాసనాలలో

"దుగ్గితేలపూండి.... ఇసని దుగ్గముపూండి
మొరమపూండి పొలిమెర సమ్మంధము "

—దుగ్గిరాల శాసనం-ద-హిం-శా-10 261 పు 196

పై గ్రామాల పొలిమెరల తగవుకు సంబంధించిన ఈ శాసనాన్ని రచయిత పై విధంగా సంక్షిపించినాడు. ఆ తర్వాత పొలిమెర తగవున పరిష్కరించిన పద్ధతి వివరంగా చెప్పబడింది. ఇట్లే మహబూబ్‌నగర్ మండలంలోని పాలెం శాసనంలో [16]ఎ "సీమా నిర్ణయః క్రియతే" అని సంస్కృతంలో వాక్యసంగ్రహం కన్పిస్తుంది. తరువాతి వివరణమాత్రం తెలుగులోనే ఉంది.

ఈ విధంగా నాటి పెక్కు శాసనాలలో వాక్య సంగ్రహం వాక్య వ్యాసం కన్న ముందు కన్పిస్తూఉంటే కొన్ని శాసనాలలో దాన వివరణ తర్వాత సంగ్రహ వాక్యం కన్పిస్తున్నది. వరంగల్లు జిల్లాలోని ఉప్పరపల్లి శాసనంలో రేచెర్లరుద్రుని ప్రధానిఅయిన కాటి నాయకుని పుత్రుడైన కాటయ చేసిన దేవ బ్రాహ్మణ వృత్తులను వివరంగా తెలిపి తర్వాత

"ఇంతవట్టు కాట్న్యాయుండు దేవడ్లకు అంగభోగరంగ
భోగ ధూప దీప నైవేద్య తాంబూలాలకు సూర్య్య-
చంద్రుల కలంతగాలము ఇచ్చిన ఈవి"

అని సంక్షేపంగా చెప్పబడింది.

ఇక ఆధునిక భాషావేత్తలు వాక్యాలను సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలుగా విభజించుచున్నారు. తెలుగు వాక్యాలను మరల క్రియారహితములు, క్రియా సహితములు అని విభజించుచున్నారు.[18] నామాఖ్యాతం, క్రియాఖ్యాతం అనే పద్ధతి వైదిక వాఙ్మయ కాలమందే కన్పడుచున్నది.

పై పద్ధతిననుసరించి కాకతీయ శాసనములలోని వాక్యాలను పరిశీలించుదాం:

క్రియారహిత వాక్యాలు

తెలుగునాట వ్యవహారంలో క్రియారహిత వాక్యాలే హెచ్చుగా కన్పిస్తాయి. సౌలభ్యాపేక్షగల మానవుడు తన అభిప్రాయాలను సాధ్యమైనంత త్వరగా తక్కువ యక్షరాలతో వ్యక్తం చేయుటకు ప్రయత్నిస్తాడు. కావున క్రియారహిత వాక్యాలు అన్ని భాషలలోను చోటుచేసుకొన్నాయి, వాక్యాలలో క్రియ తప్పక కన్పించే ఆంగ్లభాషలో సైతం క్రియారహిత వాక్యాలు వ్యవహారంలో కన్పిస్తున్నాయి.[19] తెలుగులో చాళుక్యయుగంలోని శాసనాలలో సమాపక క్రియాంతములైన వాక్యాలు చాలా తక్కువగానున్నట్లు శ్రీ కుల శేఖరరావుగారు తమ సిద్ధాంత వ్యాసంలో తెల్పినారు.[20] ఇదే విషయాన్ని బూదరాజు రాధాకృష్ణగారు ధృవపరుస్తూ ప్రాచీనాంధ్రంలో మొట్టమొదట నామాఖ్యాతమే కాని క్రియాఖ్యాతం లేనేలేదను గంటి జోగిసోమయాజిగారి అభిప్రాయాన్ని వ్యతిరేకిస్తూ అట్టి క్రియాశూన్యత లేదని నిరూపించారు.[21] అట్లే తెలుగుభాష సుస్థిరరూపాన్ని పొందిన కాకతీయ యుగంలో కూడ శాసనాలలో క్రియారహిత వాక్యాలు అధికంగానే కన్పిస్తున్నాయి. నాటి వ్యవహారంలో ఉన్న భాషను ప్రతిబింబించు నాటి శాసనాలలో క్రియారహిత వాక్యాలధికంగా కన్పించుటలో ఆశ్చర్యపడవలసిన పనిలేదు.

నామవాచకాంత వాక్యాలు

కొన్ని క్రియారహిత వాక్యాలు నాడు నామవాచకాంతాలుగా కన్పడుతున్నాయి. ఈ వాక్యాలలో విధేయం నామవాచకంగా ఉంటుంది.

"....నారాయణదేవర పొలము మండసప్పరసంకస బ్రాలు"

—కార్పస్ వరంగల్ 12 పు 143.

"ఈ చెరువు పేరు లోక సముద్రము"

—సెలెక్టెడ్ ఎ. పి. గ్రాఫ్స్ 26, పు 74.

"ఈ స్థానమునకు స్థానపత్తి భీమేశ్వర పండితుల పుత్రుడు శ్రీ భీమేశ్వర పండితులు"

—కార్పస్ 2, 43 పు 134.

క్రియాజన్య విశేషణంతో ఉన్న నామవాచకాంత వాక్యాలు

నాటి శాసనాలలోని క్రియారహిత వాక్యాలలో భూతకాల క్రియ లేక తద్ధర్మార్థక క్రియాజన్య విశేషణాలతోనున్న నామవాచకాంత పదాలు వాక్యాలుగా కన్పడుతున్నాయి.

"ఆ దేవరకు అంగిరంగభోగాన కిచ్చిన ఆయం"

— ఇన్. ఎ. పి. వరంగల్ 37 పు 101.

"చతుస్సీమ సహితమై ఆచంద్రార్కస్థాయిగాన్నిచ్చినదత్తి"

—శాసన సంపుటి పు 228.

"పిల్లలమఱ్ఱి బేతి(ర)డ్డి కొడుకు లోకి రెడ్డి కట్టించిన చెఱువు"

—సెల్ ఎ. పి. ఎ. పి. 26 పు 74.

క్రియాజన్య విశేషణాలతోనున్న తచ్ఛబ్దాంత వాక్యాలు

నాటి శాసనాలలో అధిక భాగం క్రియాజన్య విశేషణంతో ఉన్న తచ్ఛబ్దంతో వాక్యాలు ముగుస్తున్నాయి. ఈ క్రియాజన్య విశేష

వాలు భూతకాలానికి తద్ధర్మార్థానికి సంబంధించినవి. ఈ శతృప్రత్యయాంత పదాలే తర్వాతి కాలంలో క్రియలుగా మారినాయి నన్నయ భారతంలో క్రియలు శతృప్రత్యయాంతాలుగానే కన్పిస్తున్నాయి.[22] వీటిని సంశ్లిష్ట రూపాలుగా కందప్ప చెట్టిగారు పేర్కొన్నారు. ఇంకా వారు "చారిత్రకంగా ఇట్టి సంశ్లిష్ట సమాపకరూపాలు మొదట విధేయ విశేషణంగా ఉండినట్లు చెప్పవచ్చు. తరువాత ఇది సామాన్య సమాపక క్రియలాగానే ప్రయోగంలోకి వచ్చినట్లు తెలుస్తుంది. ఈ రూపం ఎప్పటిదాక విధేయ విశేషణంగాఉండి ఎప్పటినుండి సమాపక క్రియగా మారింది చెప్పటం? చాలా కష్టం." అని పేర్కొన్నారు.[23]

"యి దతి శ్రీపతి పడిసినది"

కార్పస్ 2. 33. పు 97.

"ఇవని బొ్రడాజు కొడుకు సూరపరాజు పొలమేరి నడపించి నడచినవాండు"

ద-హిం-శా. 10. 261. పు 135.

"వీనిచేకొని మెలుంగు మారెబోని కొడుకు కాచెబోండు బిడ్డ బిడ్డతరము నిత్యమానెండు నెయ నడుపువాండు."

ద-హిం-శా 10. 323. పు 167.

క్రియనధ్యాహారం చేయదగ్గ వాక్యాలు

1. కాకతీయులనాటి కొన్ని తొలి శాసనాలలో క్రియ తప్పక ఉండాల్సి ఉన్నప్పటికీ క్రియ కన్పించని కొన్ని శాసనాలు ఉన్నాయి. ఈ శాసన వాక్యాలలో ఊహించుకోవాల్సిన క్రియ "ఇచ్చెను లేక ఇచ్చిరి" అనేవి. ఈ క్రియను సందర్భాన్ననుసరించి ఊహించు కొనుటకు వీలుగానున్నందువల్ల శాసనరచయిత పాఠకునకు వదిలి వేసినట్లు తోస్తుంది. ఇది శాసన రచయిత లేక లేఖకుని దోషమని చెప్పుటకు వీలుపడదు. కాని ఇట్టి శాసనాల సంఖ్య బహుస్వల్పం. ఇట్టి వాక్యాలు నాటి శాసనాలలో తొలి కాకతీయుల కాలంలోనే అనగా 12వ శతాబ్ది ప్రథమార్థం వరకు మాత్రమే కన్పిస్తున్నాయి.

కాకతి బేతరాజు హనుమకొండ శాసనంలో

"......శ్రీ సబ్బనె రచ్చిసెట్టి(కషన)య్య.....నీరనేలయుం బదిమఱుతుఱు వెలిజేనునుం దన యిల్లునుగానుగు సర్వ్వ బాధ పరిహారము దణ్డుగు వెలి॥"

ఇచ్చట భూమి మొదలైనవాటిని సర్వబాధా పరిహారంగా దండుగ వెలిగా దానమిచ్చినట్లు ఊహించుకొనవలెను. అదేవిధంగా క్రీ.శ. 1124 నాటి మాచేడు శాసనంలో క్రియ ఏ వాక్యంలోనూ కన్పించదు.

"......సీ స్థానపతి గేర(ప) టియ్యులదు హూటరు మయిత్తు నివేద్యమునరు మఱులు ౧ దివియకు మఱులు ౧"

"శేరప టియ్యలదు పలిపొలము ఖ ౪ ॥ మేడఘట్ల వెలిపొలము ఖ ౪ వినాయకు ఖ ౧"

కార్పస్ 3 కరిం 12 పు. 25.

అని వాక్యాలు పూర్తియౌతున్నాయి. ఇచట "ఇచ్చెను" అనే క్రియ ఉంటే అర్థము సుగమమయ్యేడిది.

నాటి శాసనములలోని కొన్ని వాక్యాలకు "అగును కలుగును" మొదలగు క్రియల నధ్యాహారం చేసికొనవలెను. కొన్ని నామవాచకాంత వాక్యాలకు క్రియల నధ్యాహారము చేసికొన్నచో సులభంగా అర్థ మగును. అట్లే తచ్ఛబ్దాను ప్రయుక్త తద్ధర్మార్థక క్రియాజన్య విశేషణాలు, భూతకాల క్రియాజన్య విశేషణాలున్న కొన్ని వాక్యాలకు అర్థవైశద్యమునకై క్రియనధ్యాహారము చేసికొనవలెను.

"దిని చెఱిచిన పరికి గంగ్గ కఱుత కవిల చెఱిసిన పాపము"

కార్పస్ 2-33 పు. 97.

"వానికి అనేక బ్రహ్మకల్పాలు పాయకనరకములు"

తె-శా.1 కా-శాస.16 పు.41.

"పూర్వ్వ దత్తమైన దేవ బ్రాహ్మణ క్షేత్రములు వారికే"

కార్పస్ 2-16 పు.69.

కొన్ని సమాంతర వాక్యాలలో కూడ అర్థవైశద్యమునకై "అగును" అను క్రియ నధ్యాహారము చేయవలెను.

"ఈ ధర్మ్మువు ప్రతిపాలింపనివారు గంగకఱుత గవిలల వధియించినవారు"

కార్పస్ 3, కరీంనగర్. 12. పు. 25

"దీని ఎవడేని ఈనివాడు గంగ కఱుత కవిల పొడిచిన పండు"

కార్పస్ 3 కరీం 4. పు. 2.

సామాన్య వాక్యాలు

నాటి శాసనాలలో సామాన్యవాక్యాలు చాలా శాసనాలలో కన్పించును. కొన్ని శాసనాలలో వర్ణనలు అధికంగా ఉన్నప్పటికీ అందలి వాక్యాలు సామాన్య వాక్యాలే. అదేవిధంగా చిన్న చిన్న వాక్యాలలో సామాన్యవాక్యాలు గల శాసనాలు అధికంగానే కన్పిస్తు న్నాయి.

సామాన్యవాక్యాలలో క్రియాసహితమైన వాక్యాలు భూత భవిష్యద్వర్తమాన క్రియలతో కన్పిస్తాయి.

భూతకాల క్రియా వాక్యాలు

నాటి శాసనాలలో ప్రధాన విషయం నాటి రాజులు మొదలైన వారు చేసిన దానధర్మాలనో లేక ఆనాటికి జరిగిన విషయాలను వర్ణించుటగానున్నది. అందువల్ల నాటి శాసనాలలో మిగిలిన కాలములోనున్న వాక్యాలకంటె భూతకాలక్రియలకు చెందిన వాక్యాలే ఎక్కువగా కన్పిస్తున్నాయి. ప్రాఙ్నన్నయ యుగమందలి భాషకంటె నాటి భాష మిక్కిలి పరిణామమంది యుండుటవల్ల అన్నివిధాలైన వాక్యాలు ఈ యుగంలో కన్పిస్తున్నాయి.

"సంకదేవనికి (యేన్ద్దు) ము పట్టు వెలివాలమును నాతని క్రొప్పించిన జెరువును నిచ్చె ఉత్తరేశ్వదేవరకుంబందుము పట్టిచ్చె"

సెల్-ఎపి ఎ.పి. 23 పు. 70.

'......పాండవోత్తములు దాత్తమతులు మును భీమనాథ గేహంబు మొదలంబెక్కు దివిజాలయములు సృజియించిరి"

ఇన్స్. ఎ. పి. కరీం 25 పు. 65.

ఉత్తమ పురుష

"ఏను భక్తింబుషోత్తమును హరిం బ్రతిష్ఠితుం జేసితి వాని సన్నిధిని"

— అదే శాసనము —

"ఇందు దేవర యోగిరానకు దీపానకు మూండు మత్తుఱారు మానవతను బెట్టితిమి" కార్పస్ 3. కరీం 1. పు 3.

ఇవికాక నాడు తచ్ఛబ్దాను ప్రయుక్త భూతకాల క్రియాజన్య విశేషణం కూడ భూతకాల క్రియవలె వ్యవహారంలో ఉండి ఉంది. కొన్ని వాక్యాలలో ఇది కర్తృ విశేషణంవలె కన్పించినా మరికొన్ని వాక్యాలలో క్రియాస్థానాన్ని ఆక్రమించింది.

"యి దతి శ్రీపతి పడసినది" కార్పస్ 2-33 పు. 97.

"శ్రీ మహాదేవవారు తారణ వత్సరమందు ఇచ్చినవారు"

కార్పస్ 3. వరంగల్ 21. పు. 172.

భవిష్యత్కాల క్రియా వాక్యాలు

ఆంధ్ర శబ్ద చింతామణి వసతి రనుబంధకం, డుజాది ప్రత్యయాంతమైన క్రియను భవిష్యత్కాలవాచిగా పేర్కొన్నది.[24] తద్ధర్మార్థక క్రియ కూడ భవిష్యదర్థంలో ఉన్నట్లు అదే తెల్పుతున్నది. అదే విధంగా ఆంధ్ర భాషా భూషణం "పలుకును పలుకుదురు" మొదలగునవి భవిష్యదర్థ సంసూచక క్రియలని పేర్కొంటున్నది.[25] కాని నాటి శాసనాలలో భవిష్యత్కాలమున వసతి రనుబంధకమైన తచ్ఛబ్దార్థక క్రియలు, తద్ధర్మార్థక క్రియలు వాడబడ్డాయి. కొన్నిచోట్ల భవిష్యదర్థంలో భూతకాల క్రియలు కూడ కన్పిస్తాయి. కాని వీటి సంఖ్య చాలా తక్కువ. తచ్ఛబ్దముతో వసతిరనుబంధకమైన క్రియలను సంశ్లిష్ట సమాపక క్రియలని కందప్పచెట్టిగారు పేర్కొంటూ "ఎడ-ఎడి/ఎడు" వర్తమాన భవిష్యత్ప్రత్యయాలని వారే తెల్పినారు.[26]

కాకతీయులనాటి శాసనాలలో వసతి రనుబంధకమైన తచ్ఛబ్దాంత క్రియలతోనున్న భవిష్యత్కాల క్రియావాక్యాలే అధికంగా ఉన్నాయి. ఇట్టి క్రియలు కోస్తా ప్రాంతమందున్న శాసనాలలో అధికంగా కన్పిస్తాయి.

"చంద్రసేకరు కొడుకు త్రిపురజియ నడుపంగలవాండు"

—తేరాల (గుంటూరు జిల్లా) కార్పస్ 4-44 పు. 91.

"......జక్కసాని కాలెబోయ్ని కొడుకు అన్నెబోయుండు దనపుత్రామ పౌత్రికము నిత్యమానెండు నెఱవోయంగలవాండు

—వేల్పూరు (గుంటూరు జిల్లా) ద-హిం-శా 10. 321.

"......వృత్తికాత్తె (కాఱు) కుడువంగలవారు"

—పానుగల్లు (నల్లగొండ జిల్లా) కార్పస్ 2. 36. పు. 105

"......బీయ మీంగలవారు"

—పేరూరు (నల్లగొండ జిల్లా) కార్పస్ 4. 41. పు. 87.

తద్ధర్మార్థక క్రియ నాటి కాలంలో ఎక్కువగా భవిష్యదర్థంలోనే ఉపయోగించబడేది. ఈ తద్ధర్మార్థక-క్రియ ఎడిగా గమముతో కూడ కన్పిస్తుంది. అదే విధంగా ఈ క్రియలు నన్నయ భారత భాషవలె తచ్ఛబ్దాంతంగా కన్పిస్తున్నాయి. దువర్ణకాంతాలు కూడ అచ్చటచ్చట కన్పిస్తున్నాయి.

"దీని నడుపువారు దేవరకాపై సుఖం బుణ్డు వాణ్డు"

కార్పస్ 2-6 పు 25.

"..........నకరేశ్వర దేవరకు విష్ణు విష్ణుదేవరకుం దెలుంగు నకరేశ్వర దేవరకు నివేద్యములకు మూణ్డు దేవరలకును మూండు సట్టిగముఱ పరిబీయము నడుపువారు"

—కార్పస్ 4-41. పు. 87.

"ఈ యూరిక దొల్లిలేని చొప్పు అన్యాయము కొత్త సేసిన వారు ఆఱు నెల్లలోం జెడుదురు"

—ఇన్స్ ఎ.పి. వరంగల్ 37 పు. 101.

"ఈ వ్రిత్తికి యుపద్రవంబు సేసినవారు బ్రహ్మహత్యాది దోషులగుదురు."

—కార్పస్ 3. వరంగల్ 14 పు 147.

అట్లే భవిష్యదర్థంలో భూతకాల క్రియలు వాడుచుండినట్లు నాటి శాసనాలను గమనిస్తే విశదం కాగలదు. కాని ఇట్టి శాసనాలలో నా దృష్టికి వచ్చిందొకటిమాత్రమే. ఇది నల్గగొండ జిల్లాలోని "ఇంద్రియాల" గ్రామానికి చెందింది. పోతన కూడ తన భాగవతంలో భవిష్యదర్థంలో భూతకాల క్రియను ప్రయోగించినాడు. కాని ఇది త్వరిత భవిష్యదర్థంలో కన్పిస్తున్నది.[27] ఇది నాటి ప్రాంతీయ వ్యవహారమందలి ఒక భేదము కాబోలు

" ఈ ధర్మ్మమ్ము ఎవ్వరు ప్రతిపాలించిరి వారి శ్రీపాదధూళి మా శిరస్సుది."

"ఈ ధమ్మ్మమ్ము ఎవ్వరు నిగ్రహము సేసిరి వారి ఏకవింశతి పితాడ్లూను అధోగతిం బడుదురు."

—భారతి జనవరి 1978 పు. 40.

ప్రార్థనార్థక వాక్యాలు

సంప్రార్థనాశీరర్థములు కల వాక్యాలు నాటి శాసనాలందు కన్పడుతున్నాయి. ఈ అర్థము లందున్న వాక్యాలలో నాడు క్రియలకు "త, తము, ఎడమ" మొదలైన ప్రత్యయాలే కాక తద్ధర్మార్థక క్రియలు కూడ వాడుతున్నట్లు తెలుస్తున్నది. కాని కేతన తన ఆంధ్ర భాషా భూషణంలో ఆశీరర్థంలో "ఎడమ, కాత, కావుత, అనే ప్రత్యయాలను క్రియలకు చేర్చినాడు. అట్లే ప్రార్థనార్థంలో ఏత్వాన్ని విధించినాడు.[28] ఆంధ్ర శబ్ద చింతామణి కర్త 'ము, డుజ్జు'లను ప్రత్యయాలను విధించి "సంప్రార్థనార్థకాదీత్" అని ఈ త్వమును కూడ చేర్చినాడు.[29] కాని నన్నయ భారతం ప్రాచీన ప్రతులలో సంప్రార్థనార్థంలో 'ఎడమ' అనే పదం కనిపిస్తున్నట్లు త్రిలింగ రజతోత్సవ సంచికలో గిడుగు వెంకట సీతాపతిగారు తెల్పినట్లు, మరియు ముద్రిత ప్రతులలో ద్రుతాంతమైన 'ఎడు, త' ప్రత్యయాలు కన్పిస్తున్నట్లు, ఎడు వర్ణకాంతమైన తద్ధర్మక్రియా రూపాలు, తద్ధర్మార్థక ప్రథమ పురుషైక వచన రూపాలకు 'కాక' చేరిన ఆశీరర్థక వాక్యము లున్నట్లు కీ॥శే॥ దివాకర్ల వెంకటావధానిగారు తమ సిద్ధాంత వ్యాసంలో వివరించినారు.[30] కాకతీయుల నాటి శాసనాలలో నన్నయ భారత వ్రాత ప్రతులలో, ఆంధ్ర భాషా భూషణంలో ఉన్నట్లు "ఎడమ" ప్రత్యయం, ఆంధ్ర శబ్ద చింతామణిలో చెప్పబడ్డ "డుజ్ ఈత్వము కాక ఇత్వము, ఇంకా "త, తము" ప్రత్యయాలతో వాక్యాలు కన్పిస్తున్నాయి.

ఎడమ ప్రత్యయాంత వాక్యాలు

"ఇష్టార్థ సిద్ధియు నైయ్యెడమ"

—కార్పస్ 3 డబ్ల్యుజి 14. పి. 147.

త, తము ప్రత్యయాంత వాక్యాలు

"భాషారామాధిపుండు.... ....కారుణ్యంబున మాకు సివుళసదా కాలంబు కామ్యార్థమ్ముల్"

—ఇన్‌స్ ఎ. పి. కెఎన్. ఒటి 25 పి. 65.

"గణేశుండు.... ....కాటయ కీవు త మిష్టసంపదల్"
హరి గాటయ కీవుతము దయామతి శుభముల్"

అదే 80 పి. 89

తద్ధర్మార్థక క్రియ కన్పించు వాక్యాలు

"సత్కరుణాన్విత దుగ్గి వరము గాటయ కొసగున్"
భాస్కరుండు దయం గాచు చుండెడుం

—పై శాసనం.

హ్రస్వేత్వం గల డుజ్ ప్రత్యయము

"ప్రగిద మాకు మహా సంతోషం సేస్తిరి చేయుడి విచ్చేయుడి"

—పమ్మి కార్పస్ 3 కె ఎమ్ 16, పి. 32.

"ఈ దత్తి.......ప్రతిపాలించిన వారెల్లాను ఇహలోకంబు నందు అనంత సుఖంములు భోగింతురు (1) నం. ముడి (1)

—మణుగూరు కార్పస్ 2. 53. పి. 162

సంప్రార్థనంలో ఇత్వం వచ్చిన వాక్యాలు మధ్యమ పురుష బహువచనంపై మాత్రం నాటి శాసనాలలో కన్పడుతున్నాయి.

విధ్యర్థక వాక్యాలు

నాటి శాసనాలలో విధ్యర్థక వాక్యాలు చాలా విరళంగా ఉన్నాయి. నాటి శాసనాలలో అధిక భాగం దాన శాసనాలగుటచేత విధ్యర్థానికి అవకాశ ముండదు. ఐనా గ్రామ సీమా నిర్ణయం చేస్తున్న శాసనాలలో, కొన్ని దాన శాసనాలలోను విధివాక్యాలు కన్పిస్తున్నాయి.

"వాకు మహాజనాల నడచి కొండనిరి"

—ద-హిం-శా 10. 261. పు. 135.

"ఇ దేవర ప్రియం మాసగడనే పెట్టింపుము"

—కార్పస్ 3 కె ఎమ్. 16. పి. 36.

"ఇ త్రిపురాం(త్ర)కము పెఱుక యెద్దకు సుంకము పెట్టుము"

—ద-హిం-శా 10-304, పి. 158.

ప్రశ్నార్థక వాక్యాలు

కాకతీయుల శాసనాలలో పదానికి 'ఎవ్వరు ఎట్టిది' అనే పదాలను కలుపుటవల్ల ప్రశ్నార్థక వాక్యాలు ఏర్పడుతున్నాయి. కాని ఆంధ్ర భాషా భూషణంలో చెప్పినట్లు క్రియకు ఏకత్వం కాని [31] ఆంధ్ర శబ్ద చింతామణిలో తెల్పినట్లు పదముపై ఏకారాకారాలు గాని [32] వ్యవహారంలో కన్పిస్తున్న 'ఏమి' మొదలైన పదాలు గాని కన్పించవు.

"కాలిరెడ్డికి ధర్మ్మపత్నియైన బొల్లసానికి వంశవర్ద్ధనులైన కొడుకులం బడసె వారెవ్వరనిన"

—కార్పస్ 3. డబ్ల్యుజి 14, పి. 147.

విష్టకులంబది యెట్టిది —కార్పస్ 4-59; పి. 109.

తత్ప్రారంభిం బెట్టిది కార్పస్ 2-52, పి. 154.

ఈ విధంగా నాటి శాసనాలలోని సామాన్య వాక్యా లనేక విధంగా కన్పిస్తున్నాయి.

సంశ్లిష్ట వాక్యాలు

ఒక ప్రధాన వాక్యానికి అనుబంధంగా ఒకటి, లేక అంతకు మించిన ఉపవాక్యాలు చేరితే ఆ వాక్యాన్ని సంశ్లిష్ట వాక్యంగా వ్యవహరిస్తున్నాము. ఆంగ్ల వ్యాకర్తలు కూడ ఇంచుమించు ఇదే అభిప్రాయాన్ని వెల్లడించిరి. జార్జి-ఓ కుర్మె తన "ఇంగ్లీషు గ్రామర్"లో "ఎ కాంప్లెక్స్ సెంటెన్స్ కంటెయిన్స్ వన్ ఇండిపెండెంట్ ప్రిపోసిషన్ ఎండ్ వన్ ఆర్ మోర్ సబార్టినేటెడ్ క్లాసెస్" అని సంశ్లిష్ట వాక్యాన్ని గూర్చి నిర్వచించినాడు. [33] కాని ఆంగ్లభాషలో ఉపవాక్యాలన్నీ సమాపక క్రియలతోనే ఉండగా తెలుగులో ఉపవాక్యాలు సాధారణంగా అసమాపక క్రియలతో కన్పిస్తాయి. "అని," ప్రయోగించు ప్రత్యక్ష పరోక్షానుకృతులలో, పరోక్ష ప్రశ్నలో, ఉపవాక్యాలలో సమాపక క్రియ కన్పిస్తుంది.

కాకతీయులనాటి శాసనాలలోని వాక్యాలలో సామాన్య వాక్యాలు సంయుక్త వాక్యాలకంటె సంశ్లిష్ట వాక్యాలే అధికంగా కన్పిస్తున్నాయి. కొన్ని సంశ్లిష్ట వాక్యాలలోని ప్రధానవాక్యం సమాపకక్రియారహితంగానే కన్పిస్తుంది. చేదర్థక క్రియలు, శత్రర్థకాలు, తుమున్నర్థకాలు తర్వాతి స్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. అనుకరణవాక్యాలుకూడ సంశ్లిష్టవాక్యాలే.

నాటి శాసనాలలో కన్పించే సంశ్లిష్ట వాక్యాలు:-

క్త్వార్థక క్రియలున్న వాక్యాలు

క్త్వార్థకక్రియ ప్రధాన క్రియకంటె ముందు జరిగిన వ్యాపారాన్ని తెల్పుతుంది చిన్నయసూరి "సమానాశ్రయంబులం బూర్వకాలంబుసంబంధివర్థకంబగు (క్రియా 38) అనే సూత్రంలో ఈ విషయాన్నే తెలిపినాడు. అనేక క్త్వార్థక క్రియలున్నచోట ఆ క్త్వార్థక క్రియలలో క్రమం కన్పిస్తుంది.

"....శ్రీకంటు మల్లేశ నచ్చిణాతుంగావించి నివేద్య సార్థకముగా చెల్వొందనిన్మత్తురుప్వీణ తలంబిచ్చెను"

—సెల్ ఎపి ఎ. పి. 23 పి 70.

ఉత్తరా సంక్రాన్తింగాడ్లు గడిగి ధారాపూర్వ్వకము సేసి ఇచ్చిరి"

—కార్పస్ 2; 82, పి. 96.

అనేక క్త్వార్థకక్రియలుగల సంశ్లిష్టవాక్యం

"శ్రీ రమణీయుండు దారుండు ధీరుండు దారిద్రవైరియను పేరనెగడి కాకతిరాజులంజేకొని దాయల నిర్జించి రాజ్యంబు నిలిపి వారి చేంబ్రతిపత్తులం తాంబ్రశాసనములు నూర్లు (–) పేర్లును నొప్పబడసి కడు రూఢిమంతు(ం) డై కడిమిమెయిబరదేసములు సూరగొని జగద్వలయమ్మిదువ

మన్యదేవండనం గీర్తిణ మహిమదనరి మనిన........"

—కార్పస్ 3 డబ్ల్యు. జి. 12 పి. 143.

మాతాపితృవర్గమునం
ప్రీతింజదివించి మంచి పెంచి లసద్వి
ద్యాతిశయకుశలుంజేసి వి
భూతింబరిణయము సేసి పోషింపగాను"

— ఇన్స్ ఎ. పి. కెఎన్‌డిట్ 25; పి. 65.

కొన్నిచోట్ల క్త్వార్థక క్రియ హేత్వర్థమందును కన్పడుతున్నది. మహాభారతాదులందు హేత్వర్థంలో క్త్వార్థకక్రియ కన్పిస్తున్నందువల్ల ప్రౌఢవ్యాకరణకర్త "ఒక్కొక్కచో భూతార్థకాసమాపకక్రియ హేత్వర్థకంబునగు" (క్రియా-15) అని సూత్రీకరించినాడు. హేత్వర్థంలో ఉన్న భూతార్థకాసమాపకక్రియ నాటి పద్యశాసనాలలోను వచన శాసనాలలోను కన్పిస్తున్నది.

వరంగల్లు జిల్లాలోని మాటేడు శాసనంలోను కన్పిస్తుంది.

వరంగల్లు జిల్లాలోని మాటేడు శాసనంలో "జడి సన్నబేతభూపతి నిజరాజ్యవర్ద్ధనుండు బాహుబలంబున జేసి భూమి సంతతమునుం గప్పములు గొని బుధప్రియుడై...."

—కార్పస్ 3; డబ్ల్యు. జి. 12; పి. 143

అదే జిల్లాలోఉన్న మొరిపిరాల శాసనంలో

"భాగీరథి సమానంబుగా భావి మప్పించె యిందు స్నా(నము) సేసి పాపవిముక్తులగుదురు"

—కార్పస్ డబ్ల్యు జి. 14 పి. 147.

చేదర్థక వాక్యాలు

నాటి శాసనాలలో చేదర్థక వాక్యాలు శాపోక్తులందు ఎక్కువగా కన్పిస్తాయి. చేదర్థంలో 'ఏని' అనే ప్రత్యయం కన్పిస్తుంది.

"తనపేర నెక్కటీలు గట్టించితేని మెచ్చి ఊరంబడిన...."

—ఇన్స్. ఎపి డబ్ల్యు.జి డిటి 37. పి. 101.

దేవదత్తి గొనిరేనిం దనమల మూత్రాదుల దాన భక్షించినవాండు

—కార్పస్ 2-49. పి. 138.

పై చేదర్థకాలు క్త్వార్థకాలే కాక శత్రర్థక వాక్యాలు, అప్యర్థక వాక్యాలు కూడ కన్పిస్తున్నాయి. ఇవి ప్రత్యేకంగా కాక సందర్భాన్ననుసరించి రెండు మూడు కలిసి సంశ్లిష్ట వాక్యాలుగా కన్పిస్తున్నాయి. అందువల్లనే మన ప్రాచీన వ్యాకర్తలు క్రియా పరిచ్ఛేదంలో పీటిన్నన్నిటిని వివరించినారు.

యత్తదర్థక వాక్యాలు

సంస్కృత భాషా సాహిత్యంలో మిక్కిలి ప్రసిద్ధమై తత్ప్రభావంతో తెలుగులోకి ప్రవేశించిన యత్తదర్థక వాక్యం సంశ్లిష్ట వాక్యంలోకే చేరుతుంది. శాసనాలలో సాధారణంగా ఈ యత్తదర్థక వాక్యాలు శాపోక్తులలో కన్పిస్తాయి. ప్రాఙ్నన్నయ యుగంనాటి శాసనాలలోను తర్వాతి శాసనాలలోను కాకతీయులనాటి శాసనాలలోను శాపోక్తులయందు యత్తదర్థకాలు కన్పిస్తున్నాయి. కాని సంస్కృతంలో ఉన్నట్లు యచ్ఛబ్దంతో తచ్ఛబ్దం విధిగా అన్ని వాక్యాలలో కన్పించదు. కొన్ని వాక్యాలలో తచ్ఛబ్దాన్ని ఊహించుకొనవలసిందే.

"దాని ఫలంబు లెవ్వరు దిన్నా గోగోమాంశంబు దిన్నవారు"

—కార్పస్ 3 డబ్ల్యు.జి. 14. పి. 147.

"ఈ దత్తి ఎవ్వడు సెఱిచినాను గంగ కఱుత గంగి మోదవు వధ చేసిన పాపమునం బోవువాడు"

—కార్పస్ 3 డబ్ల్యు.జి. 21. పి. 172.

ఇ ధమ్మ్రణ ఎవ్వరేని ఇట్లు ప్రతిపాలింప వారికి అనేక దమ్మాణాలు సేసిన ఫలము

శాసన సంపుటి-పు. 248.

సంవాద వాక్యాలు

కొన్ని శాసనాలలో ప్రత్యక్ష సంభాషణ, పరోక్ష సంభాషణ కన్పిస్తున్నది. నేటి రాతలలో ఉన్నట్లు పదచిహ్నాలు నాడు కన్పించక పోవుటచే ప్రత్యక్ష సంభాషణలో ఉన్న వాక్యాలను సందర్భాన్ననుసిరించి ఊహించవలసి ఉంది. పరోక్షాను కృతిని 'అను' అనే పదం తెలుపుతుంది. ఈ పరోక్షాను కృతిలో ఒకనాటి శ్రోత ప్రస్తుతం వక్త కావచ్చు.

పరోక్షాను కృతి వాక్యాలు

"......దుగ్గమ పూండికి మొఱమ పూండికి పొలమెర వివాదమై రెండుమేరల వారును పెగ్గడ్డం గానం బోయినవారు మహాజనాల నడచి కొండనిరి.

ద-హిం-శా-10. 261 పు. 135.

"సురరాజ గురుండు మతి ప్రభాతి గంగాధరుం డిద్ధరిత్రి
నసంగా నుదియించి (చె?) శుభోదయంబునను"

—ఇన్స్. ఎపి. కెఎన్ డిటి 25. పి. 65

"....వ్రోలజనపాలుండు ఘోరతరాజి లోలుండత్య-
కుటిల చిత్తుం డితండని యాదరికం బిలిపించి పంపగాన్"

—పై శాసనం

ఆంగ్ల భాషా వ్యాకరణ ప్రభావం వల్ల నేటి వ్రాతలలో "అని అనగా" లకు ముందు ఈ రకం గుర్తులు (" ") కన్పిస్తాయి. వ్యవహారంలో సందర్భాన్ననుసరించి 'అని'కి ముందున్న పద సముదాయాన్ని పరోక్షాను కరణంగా విభాస్తున్నాం. మన ప్రాచీన వ్రాత ప్రతులలోను ఇదేవిధంగా సందర్భాన్ననుసరించి ఊహించుకోవల్సిందే. శాసనాలలోనూ ఇదే పద్ధతి పాటించబడింది.

ప్రత్యక్షాను కృతి వాక్యాలు

కొన్ని శాసనాలలో దాతలే స్వయంగా తాము చేసిన దాన ధర్మాదులను ఇతరులకు తెలిపినట్లున్నందువల్ల సంభాషణ రీతిలో కన్పించే ఈ వాక్యాలు ప్రత్యక్షాను కృతివాక్యాలుగా భావించుకొనవచ్చు. ఇటువంటి శాసనాలు నాడు అధికంగానే కన్పిస్తాయి. కరీంనగర్ శాసనంలో గంగాధరమంత్రి హనుమకొండలో తాను ప్రతిష్ఠించిన దేవాలయాలు నిర్మించిన సరోవరాదుల గురించి ఉత్తమ పురుషలో మనోహరమైన పద్యాలలో తెలుపుకున్నాడు. ఇచ్చట దాత స్వయంగా విషయాన్ని పరోక్షంలో ఉన్న వ్యక్తుల నుద్దేశించి చెప్పినట్లనిపిస్తుంది.

దాత స్వయంగా తన ఎదుటనున్నవారితో సంభాషిస్తూ దానం చేసినట్లు నందలూరు శాసనంలో కన్పిస్తుంది.

"స్వస్తి శ్రీమన్మహా మండలేశ్వర కాకతియ్య ప్రతాపరుద్ర దేవ మహారాజులు నెలందలూరి మహాజనాల(కు) నానతిత్తు(తురు?) మి (మీ?) నెలందనూరూను గ్రామ గ్రాసపు పల్లి(న్ని?) లు... అవ

నాయాలూను క్రితమున ఏలినవారు కొందరని విద్వాంసులు మాకుం జెప్పిరి వారుం గొంట అన్యాయము గాన మే (ము॥) మీకు సుంక మూసాదమూ ... సర్వజ్ఞ మాన్యములుగా నిస్తిమి"

—ద-హిం-శా. 10 496. పు. 267.

ఇచ్చట కాకతి ప్రతాపరుద్ర చక్రవర్తి విద్వాంసులతో చేసిన పరోక్ష సంభాషణతోపాటు నెలందలూరి మహాజనులతో అతడు చేసిన ప్రత్యక్ష సంభాషణ స్పష్టంగా తెలుస్తుంది.

దుగ్గి శాసనంలోనూ ఇట్టి ప్రత్యక్ష సంభాషణ కన్పిస్తుంది.

"శ్రీనామదేవ పండితులు.... ....దేవర కారుణ్యంబున దుగ్గను వంకేశ్వర దేవరం బ్రతిష్ఠ సేస్తిననని విన్నపము సేసినను.... ...."

—ద-హిం-శా-10-10. 324. పు 172.

ఇటువంటిదే ఖమ్మం జిల్లాలోని పమ్మి-శాసనం.

"స్వస్తి శ్రీమన్మహా సామంత నియ్యాంకాల నాగసానమ్మం గారు అమ్మలాఖాను ముమ్మడి రాజును రేంటి త్తిణ నుండి పమ్మికి వచ్చి ఆ దేవరకు దండం పెట్టి ప్రెగడ మాకు మహా సంతోషం జేస్తిరి చేయుడి ఏచ్చేయుడి.

—కార్పస్ 3 కెఎమ్ 6. పు. 32.

ఇచ్చట నాగసానమ్మ మొదలైనవారు దేవన పెగ్గడతో చేసిన సంభాషణ స్పష్టంగా తెలుస్తున్నది. ఈ శాసనంలో "ప్రెగడ" సంబోధ నాంత పదం - తర్వాతిది సంభాషణలోని భాగం.

ఈ విధంగా నాటి శాసనాలలో సంశ్లిష్టవాక్యాలు అనేక రకాలుగా కన్పిస్తాయి.

సంయుక్త వాక్యాలు

ఆంగ్లము, మరియు హిందీ భాషలలో సంయుక్త వాక్యా లెక్కువగా కన్పిస్తాయి. రెండువాక్యాల సంయోగాన్ని సూచించటానికి ఇంగ్లీషులో 'ఎండ్ ఆర్ బట్' వంటి పదాలు, హిందీ భాషలో ఔర్ థా మగర్ మొదలైన పదాలు కన్పిస్తాయి. తెలుగు భాషలో సంకలన బంధాన్ని, వికల్ప సంబంధాన్ని, వైరుధ్యాన్ని సూచించే పదాలు ఇంగ్లీషు హిందీభాషలలో ఉన్నట్లు అంతటా కనిపించవని చేకూరి రామారావు గారు తెలిపినారు.[34] కాని తెలుగునాట వ్యవహారంలో సంకలన బంధాన్ని సూచించే "ఇంకను మరియు" వైరుధ్యాన్ని సూచించే 'కాని' హేతువును తెలిపే 'కావున'వంటి పదాలు కనిపిస్తూనే ఉన్నాయి.

శాసన భాషలో కూడ సంయుక్తవాక్యాలు అక్కడక్కడ కన్పిస్తున్నాయి. కాకతీయులనాటి శాసనాలలో "మఱి", కాని, కావున" అనే వాక్యసంబంధ బోధకపదాలు కన్పిస్తున్నాయి. కొన్ని కొన్ని శాసనాలలో రెండు వాక్యాలకు సంబంధాన్ని తెలిపే పైపదా లను సమయోచితంగా ఊహించుకోవాలి.

నల్లగొండ జిల్లాలోని దుప్పల్లి శాసనంలో "ఈ మేరకు యవ్వరు. విఘ్నము సేసినాను వారు గంగకఱుతం గవిలం బొడిచిన దోషానం బోవువారు మఱిన్ని దేవద్రోహాన సమయద్రోహానను పడువారు"

—ఎ. పి. ఆంధ్రా 4 14 పు. 128.

కొన్ని శాసనాలలో ఈ ఉభయవాక్య సంధాయకమైన "మరియు" అనే పదాన్ని ఊహించుకోవాలి.

"యీ వ్రిత్తికి యుపద్రవంబు సేసినవారు బ్రహ్మహత్యాది దోషులగుదురు శివద్రోహులగుదురు శ్వామి ద్రోహులగుదురు"

—కార్పస్ 4 డబ్లు. జి. పు. 147.

"దీని ఎవడేని ఈనివాడు గంగ కఱుత కవిలి పొడిచినవడు వాడు సమయానకువెలి సివాద్రోహుడు

—కార్పస్ 2-10 పు. 50

వ్యవహారంలో "మరియు" అనే పదం లేకపోయినా ఉచ్చారణా నైపుణ్యంవల్ల, కొంత విలంబితంగా ఉచ్చరించుటవల్ల ఆ యర్థం స్ఫురిస్తున్నది. వ్యవహారబలిమి. శాసనరచనలోనూ నాడు ప్రవేశించినట్లుంది.

"కాని" అనే పదం అనుసంధానపదంగా కన్పించే సంయుక్త వాక్యాలు నాటి శాసనాలలో కన్పిస్తున్నాయి.

"బ్రాహ్మణవృత్తి చే(గ)డ వడిక దేవరాయం
దు (దు)న్నిన రాంపేండి పెట్టడి (పెట్టేదిః) గాని
ఆ వ్రిత్తి కాని మీందంగూడ గానలేదు"

—కార్పస 3 కె. ఎమ్. 6 పు. 16.

అదే విధంగా వాక్యాలమధ్య "కాని" అనే పదాన్ని ఊహించు కోవాల్సిన వాక్యాలు కూడా నాటి శాసనాలలో కన్పిస్తున్నాయి.

"....మహాలింగ్గ స్థానాల వ్రిత్తులకెల్లాను దేవరాయము తరి మడి దున్నినాలేదు కాంపు దున్నినాలేదు గోపినాథని వ్రిత్తులకెల్లా(ను) నంబులు దున్నినాలేదు కాంపు దున్నినం బెట్టేది

—పై శాసనం—

ఇచ్చట దేవరాయం నంబులు దున్నినలేదు కాని కాపు దున్నినం బెట్టేది అని ఉంటే అర్థవైశద్య మేర్పడేది.

ఇదే విధంగా నాటి శాసనాలలో సంయుక్త వాక్యాలమధ్య "కాన" అనే పదం కన్పిస్తుంది. ఉత్తరవాక్యానికి పూర్వవాక్యం హేతు వైనప్పుడీపదం చేర్చబడుతుంది.

"యీశ్వర సమీపంబు గాన చ (గౌ)తమి సమానంబుగాం దలంచి దోషవిముక్తులగుదురు."

"యీ వ్రిత్తికి యుపద్రవంబు సేసినవారు బ్రహ్మహత్యాది దోషులగుదురు గాన వీరి సంగతి బోవగాదు"


—కార్పస్ 8 డబ్లు. జి. 14 పు. 147.

"వారు గొంట అన్యాయము గాన మే(ము॥) మీకు సుంకమూ సాదమూ అవనాయాలూ....ఇస్తిమి"

— ద-హిం-శా-10. 496, పు. 267.

ఈ విధంగా నాటి శాసనాలలో సంయుక్తవాక్యాలు "మఱి, కాని, కాన," అనే పదాలతో కన్పిస్తున్నాయి, వైరుధ్యాన్ని సూచించే "లేక" అనే పదమున్న సంయుక్త వాక్యాలు నాటి శాసనాలలో కన్పించవు.

(ఇంకా వుంది)


మొటిమలు ?
బైద్యనాథ్ సురక్తా స్ట్రాంగ్
Baidyanath
SURAKTA
STRONG.
మొటిమలు, చర్మవ్యాధులకు కారణమైన అపరిశుద్ధ రక్తమునకు కారణము
అంత్రములు ఉదరము సరిగా పనిచేయకపోవటమే
సురక్తా జీర్ణక్రియ సరిగా జరుగుటకు సహాయపడి
చర్మమును మృదువుగాను, సుందరముగాను
చేయును.
సురక్తాస్ట్రాంగ్ మలిన రక్తమునుండి
చర్మరోగములనుండి మిమ్ములను కాపాడును.
బైద్యనాథ్ సురక్తా స్ట్రాంగ్
మొటిమలు మొదలగువాటి నివారణకు సురక్షితమైన
విశ్వసనీయమైన ఆయుర్వేద ఔషధము

SKT 67 T SVR

కవి పూర్ణిమ

కన్నడమూలం : **డా॥ యు. ఆర్. అనంతమూర్తి**

తెనిగింపు : **శ్రీ శంకరగంటి రంగాచార్యులు**

నిండు చూలాలు వదినమ్మ కాంతి పుంజాల లాంటి చూపులు కుట్టుదారంతోపాటు ఏమో కలలల్లు తున్నాయి. అన్నయ్యచూపు కిటికీ బయటగా ఎక్కడోగల శూన్యాన్ని తడుమాడుతోంది. గదిలో తొణికిస లాడుతూన్న వెలుగు. వదినమ్మ కొప్పునుంచీ మెల్లమెల్లగా తేలిపస్తూన్న గుమగుమలాడే విరజాజుల పరిమళం. కిటికీ చువ్వల సందులగుండా కనుకొలకుల్లోకి దిగుతూన్న గగనపు అపార శుభ్ర నీలిమ.

నిండు బదుకు-తొణికిసలాడు వెలుగు- గుమగుమలాడు పరిమళం- రెక్కలల్లార్చే కలలు- అనంత గగనం- నడుమచావు. అన్నింటి అనిత్యతనూ చాటేచావు.

ఆనందుని హృదయం బాధతోతల్లడిల్లింది. లేయెండలో జుమ్మని తుమ్మెద ఒకటి పడక ప్రక్కన తిరుగాడి అతడిని సౌందర్య సందేశంతో బాధించింది. అనంతత నడుమ ఈ మర్త్యత ... మన్ను! మన్ను ! చివరికంతా పిడికెడు మన్ను !

దగ్గు ఎడదను చీల్చుకొని వచ్చింది. చైతన్యాన్ని కూడగట్టుకుని చుట్టూ బెదరిన వానిలా చూశాడు. లేతయెండ కిరణాలు వదినమ్మ కనుకొలకుల్లోనూ, ముక్కర మీదనూ మిలమిల మెరుస్తున్నాయి.

సుఖస్వప్నం ఆమె కళ్ళనుంచీ జారింది. చేతిలోని కుట్టుపని యాంత్రికంగా నిలిచిపోయింది. ఏమోమరచి పోవాలని యత్నిస్తూన్నలా అన్నయ్య గదివదలి వెళ్ళాడు. వదినమ్మ కనుచూపు కళ వళ పడుతోంది.

ఈ ఇరవైఐదు ఏళ్ళనిండు బ్రదుకు కూడాచావుకు కవళమా?

బదుకు పిండం కడుపులో - చావును గూర్చిన యోచన ఆమె కళ్ళలో.

తన బాధ మూలాన ఈ చిన్న సంసారంలో అలుముకున్న దుఃఖాన్ని కప్పి పుచ్చేందుకు ప్రయత్నిస్తూ ఆనందుడు చిరునవ్వు నవ్వాడు. అతడి కళ్ళలో నవ్వు మెరసినపుడు పెదవులు బిగిసి వాతావరణంలోని చావుకూడా బెదురుకుంది - ఎట్టి నిమిషమది !

"వదినమ్మా, బిడ్డకేం పేరు పెడతావ్ ?"

శిశువుమాట చెవిలో పడినంతనే వదినమ్మ మొగ్గలాంటి ముఖం వికసించింది.

"నీ పేరు : మగాడైతే ఆనందుడు, ఆడదైతే ఆనంది."

పలికి చిలిపిగా నవ్వింది. ఆనందుడు కళ్ళుమూసుకుని, చెడు తలపుల్ని మరచిపోయేందుకు ప్రయత్నించి అన్నాడు.

"వాడు నిండు బ్రదుకు బదకనీ - ఈ నాపేరెందుకు ?

వదినమ్మ గుండె పిండినట్లైంది. జీవపిండాన్ని తనగర్భంలో రూపొందిస్తూన్న తల్లికి ఆనందుని చావు సమీపంలోనే వుందని స్మరించడం అసాధ్యంగా వుంది. చచ్చిన వాళ్ళు శాశ్వతంగా ఈ లోకంనుంచీ దూరమవుతారా ? ఇంతటి ప్రేమ ఈ బదుకును కౌగలించుకుని వున్నప్పుడదెలా సాధ్యం? ఏమి వెలుగునిండింది ఈలోకంలో! లేదు- ఆనందుడు పోలేదు - పోయినా వస్తాడు. తప్పక వస్తాడు- అయితే, ఏ రూపంలోనో ? వచ్చినా కూడా, వెనకటి జ్ఞాపకాలెక్కడ మిగిలివుంటాయి ? ఇట నుంచీ పోయినవాడు, మొగిళ్లుచేరి, తారయై స్వర్గసుఖాల్ని అనుభవిస్తాడు... ముగిసిన తరువాత నేలమీద తనవాళ్ళ తలపు ఎదను సోకుతుంది... నీల దిగంతం నుంచీ మళ్ళీ ప్రియబాంధవుల కడుపులో పుట్టడానికి పయనం కడతాడు. అయితే గత జన్మకు చెందిన సమస్త స్మృతులు ఆ కాంతి కరగిన కొద్దీ మాయమౌతాయి... పునరపి జననం పునరపి మరణం । పునరపి జననీ జఠరే శయనం... ఏనాడో విన్నకథ. అయితే స్మృతులు మిగలకుంటే వస్తేనేం ? రాకుండేనేం ? అంతా -, అంతా ఒకటే.

—వదినమ్మ కన్నీళ్లు తుడుచుకుని కిటికీవైపు చూసింది...

ఆనందుడు సానునయధ్వనితో వదినమ్మలో చైతన్యం నించడానికి చెప్పాడు.

"అలానే పిలువు, వదినమ్మా... నేనపుడు నిన్ను 'అమ్మా' అంటూ పిలుస్తాను... పిల్లాటల్లో అన్నింటినీ ఎక్కడ మరచిపోయి వుంటానో? అపుడు నీవు కోపించుకోకుండా అంతాజ్ఞాపకం చేసిపెట్టు- అవునా ?"

వదినమ్మమాత్రం ముగ్ధలాగా తలాడించి, ఆనందుడికి తాగడానికేమైనా తెచ్చి ఇద్దామని లోనికి వెళ్ళింది...

ఆనందుడు మళ్ళీ పుడతాడు. ఈ సంసారంలో పెరుగుతాడు- నాటకమంతా ప్రారంభం నుంచీ ప్రారంభమవుతుంది. . .ముద్దుమాటలు తప్పటడుగులు... ప్రేమా... మమతా...

—సుఖమయమైన ఆలోచన, మరణ సాన్నిధ్యంలో !

x x x

కలలమధ్యదూరివచ్చి హృదయాన్ని పిండురాయి ఆ స్మృతులు.

వ్యాధి తీవ్రస్థితికి చేరుకునే చిహ్నాలున్నాయని తెలియవచ్చి నపుడు ఆనందుడు సుశీకి తెలియనట్టు వెళ్ళిపోవచ్చేశాడు... అమలంగా మరిచిపోగలడా ?

ఆ వెన్నెలరేయి. సుతిక్కిన చకోరపక్షి అరూత, చేతిలో చేయివేసి పెదిమను పెదిమచేర్చి గడిపిన అమృతక్షణాలు ! మరచి పోగలడా ?

తల్లి బడ అల్లుతున్నపుడు తను పలికిన తీయటి మాటనుతలచి, సిగ్గుపడి, నవ్వుతూండడం తల్లికి అర్థంకాక, కూతురుకు పిచ్చిపట్టిందని గాబుక్కుంటూండడాన్ని మరచిపోగలడా ? సుశీల మరచిపో గలదా ?...

బయట ఎక్కడో వాద్యాలధ్వని. ఎవరిదో పెళ్ళి. ఈ రోజు తనదీ కావలిసి ఉండేది. అలాగే సుశీ వాళ్ళనిశ్చయమూ అయివుంది. అయితే ఇపుడేమైపోయింది ?

ప్రణయప్రథమోన్మాదంలో, కిటికీ చువ్వలసందుల్లో దొంగగా ఆడుకున్నమాటలూ, అదృష్టి ప్రసారాలూ, ఆ ప్రేమలేఖలూ, అమరత్వాన్ని చవిచూసిన ఆ ఘడియలూ... ఎన్నెన్ని నడిచిపోయాయి? ఏ దేవుని ప్రీతికోసం నడిచాయి ? ;

మళ్ళీ తన మస్తిష్కంలో తలపులు ఎదలోమెదిలి నపుడు కలిగిన బాధ తారల్లా ఎల్లప్పుడూ బ్రతకాలి, అమె శ్వాసోచ్ఛ్వాసచ్ఛందానికి హితంగా తూగాడే, మృదుహృదయం మీద ఒరిగి, ఆమత్తులో మధ్య మధ్య కలిగే తీయని మెలకువలలో సుఖస్వప్నాలల్లాలని ఆశించిన ఆ రోజులు... అంతా, అంతా ఏమైనాయి ?

సుశీ మరువగలదా ? బదుకు పిలుపు మరపించక వుంటుందా?

మళ్ళీ స్మృతులు-ఆమహాదర్శపు స్మృతులు. జనతకు వాణి కావాలని, దేశపు కవితావాలని తను పెట్టుకున్న ఆశలు... ఆ రచనోన్మాదం....వ్రాసినదాన్ని స్నేహితుల మధ్య చదువుతూన్నపుడు తను అనుభవించిన ఆ రసక్షణాలు....తనకు ప్రియమైనవాళ్ళ తనలో ఒక మహాకవి శక్తిని దర్శించడం. ఆ మహాహ్వానాన్ని పురస్కరించుకునే ఇన్ని రోజులు బ్రతకడము....అంతా! అంతా ఎవరికోసం ? మన్ను ! మన్ను ! పిడికెడు మన్ను ఈ బదుకు !!

గగన నీలిమలో, మేఘసంకేతంలో, భగవంతుడు రచించిన ప్రకృతి అనబడే అమరకావ్యాన్ని గుర్తించేదాకా కూడా బదుకు మిగుల లేదు.

ఇపుడు మిగిలిందొకటే, గగనాంచలాన్ని తదేకంగాచూస్తూ, దృష్టి శూన్యమయ్యేవరకూ చూస్తూ....గౌరవము, ప్రేమా, మహోత్సాహమూ-అన్నీ శూన్యతమస్సులో కరిగిపోయే వరకూ చూస్తూ.... అలాగే....

విశ్వనాథుడు ఆనందుని పక్కలో కూచున్నాడు. మిత్రుని వేసరికను పోగొట్టటానికి ఏదైనా చదివి చెప్పటం అతని అలవాటు....

"ఏమన్నా చదివేదా ?"

ఆనందుడు వద్దని తల ఆడించాడు. పక్క తలగడక్రిందవున్న ఒకసీసా చేతిలోకి తీసుకున్నాడు. ఎదలోని సహించరాని బాధను సంహరించుకోవడానికి ఎవరికీ తెలియకుండా వుండేటట్లు అందులోని మాత్రలను మింగి నిద్రపోవడం ఆనందుని ఇప్పటిప్పటి అలవాటుగా వుండేది. విశ్వనాథుడు మిత్రుడి చేతిలోని సీసాను గుంజుకోని దానిని చేయిటంచాడు. అయితే ఆనందుడు మాట్లాడిన మాటలు అతనికి ఆశ్చర్యాన్ని కలిగించాయి.

"ఎదలో ఎంతటి తీవ్రమైన బాధ కలిగినా, ఇకనీటిని తీసను- విశ్వం"

విశ్వనాథుడు ఏదో బరువు తగ్గినవానిలా నిట్టూర్చాడు. ఆనందుడికి కొంత గుణము కలిగి వుండవచ్చా ?

"బాధను విస్మరించాల్సిన అవసరం ఇకలేదు. ఎక్కడైనా దాన్ని పారవేసిరా"

విశ్వానికి అర్థంకాలేదు.

"మరణం రానీ - సంతోషం. నిర్లిప్తుడిగా చివరిని ఎదుర్కొంటాను"

ఏమో చెప్పాలని నోరువిప్పాడు విశ్వం. ఆనందుని గంభీర ముఖముద్రను చూసి మౌనం వహించాడు. నిమిషాలు నిదానంగా కదులుతున్నాయి. ఏ భావాతిరేకానికి చోటివ్వక దృఢమైన, క్షీణ స్వరంతో ఆనందుడన్నాడు.

"సుశీ నా చావుని విని దుఃఖించడం వద్దు. అంతా మరచిపోనీ, నేను వ్రాసిన జాబులన్నిటినీ కాల్చి బూడిద చేయనీ, ఆమెకు తగిన వాడిని వరించి పెళ్ళిచేసుకోనీ, ఇదే నా తుదికోర్కె- తప్పక తెల్పడం నీక ర్తవ్యం....నెరవేర్చు..."

ఉద్వేగంగా విశ్వం వూపిరి పీల్చుతూ వున్నాడు. అయితే ఆనందుడు మామిడిచెట్టు చిగురుటాకుల శ్రీమంత సౌందర్యాన్ని తదేకంగా చూస్తూ నెమ్మదిగా చెప్పుతుంటూ పోయాడు.

"దుఃఖించడానికి కారణంలేదు- ఈ మరణంతో బహుశా నాకు అంతమేర్పడదు. పుట్టినవాళ్ళకందరికీ చావు తథ్యం. అయితే ఆనందుడు బదుకుతాడు. దేశపు కవుల నడుమ భవిష్యత్తులో నా పేరు కూడా చేరవచ్చు. అయితే విధిమాత్రం నా పేరు నీళ్ళమీద రాశాడు.

పిల్లగాలి వీస్తోంది. ఎండుటాకులు రాలుతున్నాయి. చివురుటాకులు ఎగుర్లాడుతున్నాయి. ఇద్దరూ చాలాసేపు మౌనంగావున్నారు. లోపల వదినమ్మ పగటి కలలు కంటూ మనస్సులోనే జోల పాట పాడుతోంది. ఇక మిగిలిన ఘడియలను గణిస్తూన్న ఆనందుడు క్షీణ స్వరంలో చెప్పాడు :

"విశ్వం-ఏదీ, ఆ గీతాశ్లోకాన్ని మరొకసారి చదువు"

విశ్వనాథుడు శ్రావ్యమూ, గంభీరమూ అయిన గొంతుతో పఠించడం మొదలు పెట్టాడు :

"నైనం ఛిందంతి శస్త్రాణి, నైనం దహతి పావకః।
నచైనం క్లేదయంత్యాపో, న శోషయతి మారుతః"॥

-కలలల్లుతూన్న వదినమ్మ శ్లోకం గంభీరధ్వనిని విని,వాకిట్లోకి వచ్చి నిలబడింది.

X X X X

ఆదినం కడిచింది. మరునటిరోజు పొద్దు పొడిచింది. ఇదే తన పాలిటికి మిగిలిన చివరిరోజని ఆనందుడు నిశ్చయించుకున్నాడు. విశ్వనాథుని రహస్యంగా పిలిచి చెప్పాడు :

"నా పరిస్థితి పూర్తి అపాయకరంగా ఉంది. ఎక్కడికీ వెళ్ళకు..."

పొద్దుననుంచీ వదినమ్మ ఈవైపు తిరిగి చూడలేదు. ప్రసవ వేదన ప్రారంభమై వుండాలి. ఈ పరిస్థితిలో ఇంట్లోవాళ్ళకు ఎలాటి తొందరా కలగరాదని ఆనందుని ఆశ, విశ్వనాథునికి హెచ్చరిక మాటలు చెప్పాడు.

"అన్నయ్యకూ, వదినమ్మకూ నా విషయమేమీ తెలియకుండా వుండేటట్లు చూసుకో. నే నేనాడూ తీర్చలేని మహోపకారం చేసినట్ల వుతుంది. నావల్ల వాళ్ళకు ఈ రోజు బాధకలుగ రాదు. ఈ ఇంటికిది శుభ ముహూర్తం. మా కులం వర్ధిల్లేదినం."

పరీక్ష చేసిపోవడానికి దినమూ వచ్చినట్లే వైద్యులు వచ్చారు ఆనందుని ముఖంలో ఏదో దీప్తి, కళ్ళలో ఏదో తీక్ష్ణత, మాటల్లో నిండి నిబిడీకృతమైన ఆత్మీయత, వైద్యులుకూడా మోస పోయారు. ఆరిపోయే దీపానికి ఎక్కడలేని ఔజ్వల్యమూ ఉంటుందని ఎవరికి మాత్రం తెలుస్తుంది ?

వదినమ్మనూ వైద్యులు పరీక్షించారు. ప్రసవం అర్థరాత్రికి కావచ్చునని అందరి అంచనా. తొలిచూలు. బాధ కొంచెం ఎక్కువగా వుండొచ్చు. అయినా ఏమీ భయం లేదని వైద్యులు సెలవిచ్చారు.

ఆనందునికి ఏవేవో యోచనలు. తనకు మిగిలిన చివరిదినాన్ని ఎలా వినియోగించుకోవాలో అర్థంకాలేదు. పక్కగదిలో నుండి వదినమ్మ మూలుగు తాలూకు క్షీణస్వరం. తల్లికి అది సుమధుర యాతన. కులవర్ధనుడు నేడు ఈ ఇంటికి వస్తాడు. అన్నయ్య ఇంతింతని చెప్ప రాని తొందరలో అటునుంచి ఇటూ, ఇటునుంచి అటకూ తిరుగాడు తున్నాడు. కొత్తబదుకుకు స్వాగతం పలకడానికి ఏమేమో సన్నాహాలు జరగాలి. దీనికి తోడు ఆనందుడు రాబోయే చావుకూ సన్నాహాలు చేసుకోవాలి.

ఇలా ఘడియలు జనన మరణాల నడుమ ఉయ్యాలలాడుతూ గడచిపోతున్నాయి - నిదానంగా.

విపరీతమైన బాధ విద్యుత్ప్రవాహంలా నరనరాన్నీ పిండుతోంది. ఆనందుడు కిమ్మనకుండా సహించుకుంటున్నాడు. వదినమ్మ వేదనలా ఇదీ వేదనే. అయితే తల్లిది సుమధుర యాతన. కొత్తపుట్టక కోసం ఆ బాధ. అయితే, యిది ?....

ఎప్పటిలాగే ఈ రోజూ గదినిండా వెలుగు నిండింది. ఇంట్లో అందరిలోను ఉత్సాహం ఉప్పొంగుతూంది. మామిడి చెట్టు కొమ్మలు ఉయ్యాలలూగుతున్నాయి. ఆనందునికి ఒక్కటే యోచన : భగవంతుని దయవల్ల తను శిశు జననమయ్యేవరకూ నైనా బదకితేచాలు. అది కాక చివరిదిగా ఒక ఆశ మిగిలివుంది. ఈ రాత్రి వెన్నెలుంటుంది. ఆ వెన్నెలను తిలకించి. పులకించి చావాల. ఇరవై అయిదేళ్ళ క్రితం ఒక వెన్నెలరేయిలో తను పుట్టాడు. అదే వేళకు అంతం సమీపిస్తే ఎంత అదృష్టం ! కవి ప్రాణానికి అంతకన్నా అధికమైన సుఖందొరక గలదా ? ఒకరోజు తాలుకు సౌందర్యాన్నంతా ఆరాధించి మరణించ డానికన్నా ఎక్కువ పుణ్యం మర్త్యులకెక్కడ దొరకుతుంది ?

ఇక ఆనందునికి గడచిన దినాలను జ్ఞాపకం చేసుకోవడమే మిగిలింది చూపుని సారిస్తే గోచరించే మూలమూలలోనూ వందల వందల జ్ఞాపకాల నిధులు. ఇపుడు తను పడుకున్న చోటే తనకు తల్లి జన్మనిచ్చింది. ఆ మామిడిచెట్టు కిందేకూచుని నూర్నార్లు కల లల్లడం జరిగింది. అక్కడే తిరుగుతూ కుమార వ్యాసభారతాన్ని చదివాడు. ఆ గడపను శిశువుగా దాటినప్పుడు చాలాపెద్దపండుగ జరిగిందట... ఈ నేల మీదంతా ఎన్నిరోజులు దోగాడాడో... దూరంనుంచీ తుంగానది జోల పాటకు చెవియొగ్గి పడుకుని ఎన్ని రోజులు నిద్రించాడో. ఈసమస్త స్మృతులకు ఆకరమైన ఈ ప్రాణం ఇక కొంతసేపట్లో ఎక్కడికి ఎగిరిపోతుందో ! బదుకంతా ఒక పోరాటం. మృత్యువు నల్లని నీడనూ సుశీతోపాటు ఆనందమయుడుగా ఉన్నపుడు-చూచినప్పటినుండి ఒకటే విధంగా హృదయంలో విషాదం... ఈ ఆశలకూ, ఈ ప్రేమకూ, ఈ జీవునికి ఇదే అంతమా ? మిగులుతాయా ? స్మృతులు మిగులు తాయా ? ఒకసారి తరలిపోయిన తరువాత మళ్ళీ ఎక్కడ వస్తాము ? ఎంత అల్పమైన, మర్త్యమైన సుఖం !...

ఆనందుడు తటాలున లేచాడు. విశ్వం మృదుమధురంగా మిత్రుడి నొప్పి తేలిక పడునుగాక అని అంటున్నాడు——

"నైనం ఛిందంతి శస్త్రాణి - నైనం దహతి పావకః"

X X X X

దినం మెల్లమెల్లగా కరగి సందెవేళ వచ్చింది. ఆనందుడు కొద్ది ఘడియల బదుకు కోసం మరణాన్ని బహుకష్టంగా ముందుకు నెట్టుతూ పండుకుని వున్నాడు. విశ్వం దిగ్భ్రమచెంది కూర్చుని వున్నాడు. చలి

ఎక్కువవుతూందని కిటికీ తలుపును మూసివచ్చాడు. ఆనందుడు తన పాలిటి చివరిసందెకు చెందిన శాంతిననుభవిస్తూ ఏమో ధ్యానించాడు. అన్నయ్య తిరుగాడడం ఇపుడు ఎక్కువైంది. వదినమ్మ వేదనకూడా ఎక్కువైవుండాలి. ఇంకా నాలుగైదు గంటలు కావలిసొస్తుందో ఏమో! తరువాత ఆనందుడు పుడతాడు. ఇక్కడంతా దోగాడుతాడు. గడప దాటుతాడు. మళ్ళీ పెద్ద పండుగ జరుగుతుంది.... నాటకమంతా మళ్ళీ మొదలవుతుంది... అనంతమైన జీవన నాటకం !....

గత సంవత్సరం ఇదే దినం... చైత్రమాసపు ఒక వెన్నెల రేయి...దేహంలో ఇంకనూ కొంచెం ఎక్కువ శక్తిఉంది. అయితే మనస్సులో మాత్రం నిరంతర పోరాటం. సౌందర్య ప్రేమతో ఆరాధనలో నిమగ్నమైన జీవనంలో క్షయ తొంగిచూసింది. అది మనోజ్ఞ రాత్రి... జగన్మోహిని రూపం ధరించి విష్ణుదేవుడు మర్త్యులకు అమృతాన్ని పడ్డిస్తూన్నాడేమో అనిపించేటంతటి నిర్మలమైన వెన్నెల : నీలినింగినెక్కి నిగనిగలాడుతూన్న నిండుజాబిల్లి... అయితే మనస్సు మాత్రం బదుకుకు సంబంధించిన నశ్వరతను గూర్చి చింతిస్తూవుంది.. మధ్య తటాలున ఒక కోకిల పాడింది- తను కూర్చున్నగది పక్కన గల మామిడిచెట్టు నెత్తిమీదనుంచి... ఒళ్లు గగుర్పొడిచింది... అమరత్వపు సందేశం నాదమయమై వెన్నెలలో తేలివచ్చి తన్ను కరుణించింది.

"కుహూ . . . కుహూ"....

మళ్ళీ ఈ సాయంత్రం కూడా కోయిల పాడుతూవుంది. రోమహర్షం కలిగించే అనుభవం....మరణం తుది కడికై ఎదలో చేయి పెట్టినపుడుకూడా అమరత్వపు సందేశం కిటికీగుండా దూరి వస్తోంది.

"కుహూ . . . కుహూ . . . కుహూ"

అమర సందేశం సన్నగిల్లి, సన్నగిల్లి దూరంగా ఎక్కడో మాయమైంది . . . అవయవాలన్నీ చెమర్చాయి. ఎంత భరింపరాని బాధ ఎదలో !....

మళ్ళీ మళ్ళీ వచ్చి చూస్తూన్న అన్నయ్య కర్థమే కాలేదు. ఆనందుడు ఎనలేని శ్రమవహించి బాధను దాచిపెట్టుకున్నాడు. సందె కెంపు సన్నగిల్లిపోతూన్న కొలదీ విశ్వం ఆనందుని అభీష్టం మేరకు సోక్రటీసు మరణవృత్తాంతాన్ని మెల్లగా చదివిచెప్పాడు. హెమ్లాకును నిర్వికారంగా తాగిన సోక్రటీసు భవ్యచిత్రం ఆనందుని ఎదుట మెదలాడి అతడిని సంతృప్తి పరచింది.

సోక్రటీస్....ఎంతటి అచంచల విశ్వాసం!....చావును కూడా స్వాగతించే టప్పుడు !

"నైనం ఛిందంతి శస్త్రాణి । నైనం దహతి పావకః"

X X X X

సందె కడచింది. పక్షులన్నీ గూళ్ళు చేరాయి. పూర్ణచంద్రుని రాజ్యమింక ప్రారంభం. . .

వదినమ్మ బాధ ఎక్కువవుతూండాలి. తీవ్రమైన మూలుగులు వినవస్తున్నాయి. ఇంక కొంచెం సేపట్లో జననం కావచ్చు. తన మధుర యాతనకూడా తుదముట్టవచ్చు. ఏకొత్త పుట్టుక కోసమో !

ఘడియలు మెల్లగా జారుతున్నాయి....బయట చరచర తిరుగాడుతున్నారు.... ఆనందుడు ధ్యానమగ్నుడై కళ్ళుమూస్తాడు. . . బదుకులో ఎన్నోవిధాలుగా తనకైన వాళ్ళను గురించి ఇక జ్ఞాపకం చేసుకోవాలి. వాళ్ళందరికీ అంతిమ వందనాలర్పించాలి. మిగిలిన కర్తవ్యమిదే.

....జన్మనిచ్చిన తలిదండ్రులు....ప్రేమామృతాన్ని ప్రసాదించిన సుశీల, ఎన్నోరసనిమిషాలకు కారణభూతులైన మిత్రులు, బదుకుకు ఒకమహదాదర్శం అనుగ్రహించిన కవిపుంగవులు, అన్నయ్య వదినమ్మ, ఎంతమంది, ఉహ్ ఎంతమంది తన బదుకుకైన వాళ్ళు.... ఎంతటి పుణ్యవంతులు—వాళ్ళందరి ఋణమూ ఎలాగ తీర్చుకోవడం?

హృదయం ఉప్పొంగి పొరలింది. మెల్లగా పక్కన కూచున్న విశ్వం వెన్ను నిమిరి ప్రశాంత స్వరంలో ఇలా అన్నాడు :

"విశ్వం వెళ్ళొస్తాను. దుఃఖించవద్దు. నీ ఋణం ఈ జన్మలో ఇక తీర్చలేను. అయితే ఇది తుదికాదు. . . ఇక మీదట నిత్యమైన ప్రారంభం. . ."

తన తుదిమాటను ముగించి విశ్వానికి తలుపులు తెరవాలని సైగచేశాడు. మిక్కిలి కష్టంతో ఏడ్పును అదిమి పట్టుకుని విశ్వనాథుడు అన్ని తలుపుల్నీ తెరచి, ఆనందుని పక్కలో వచ్చి కూచున్నాడు.

ఆనందుడు కష్టంతో కుడిపక్కకు పొర్లి చూశాడు- ఎలాంటి అమృత క్షణమిది !

దూరంగా తళతళలాడు ఆ సైకత రాశి ఈవెన్నెల్లో పులకించిపోతూ అక్కడక్కడా ధ్యానమగ్నంగా నిలిచివున్న చెట్లు. ఏదో మాయాజాలంతో రెండు చిన్నకళ్ళనూ చేరగలిగిన అపారశుభ్ర నీలగగనం. సతతశ్రవణంచేత మనోగతమైన మౌన సుసంపన్నతనూమీరి, వైకుంఠపు సందేశం మోసుకొస్తూన్న ఈ తుంగానది గంభీరధ్వని. శ్రీకృష్ణుడు రాసక్రీడ ఆడినవేళ.

ఎంతటి మాయ.

పిచ్చెక్కి చకోరమొకటి అరిచింది. అహ్! అరుస్తూ, అరుస్తూ పైకెగిరింది- పైకెగురుతూ ఎగురుతూ అరిచింది. ప్రాణం వదలికోకిల 'కుహూ— కుహూ' అంది.

ఏ అమరావతి ఇంద్రజాలమిది! అబ్బ ఒక్క క్షణంలో ఎలాంటి దర్శనం !

ఆనందుడు టక్కని లేచికూచున్నాడు. ఏమో శక్తిసంచలనం జరిగింది నరం నరంలోనూ ఏదో మధురయాతన మథించింది హృదయాన్ని. చకోరంతోపాటు అరవాలనిపించింది- 'ప్రాణహంస'కు....

ఒళ్ళు వణికింది. ఒకే క్షణంలో విద్యుల్లతలా ఒకమహద్దర్శనం ప్రాణాన్ని అల్లాడించి ఎగిరిపోయింది.

"ఈ చకోరం నేను. ఈ చంద్రికనేను. ఈ అనంతనీల గగనం నేను. లేదు— నాకు చావులేదు— నాకు చావులేదు..."

"నైనం ఛిందంతి శస్త్రాణి, నైనం దహతి పావకః।
నచైనం క్లేదయంత్యాపో, నశోషయతి మారుతః॥"

విశ్వనాథుడు గంభీరధ్వనితో చదువుతూన్నాడు. ఆనందుని శరీరం మెల్లగా అతని శరీరం మీదకి ఒరిగింది. ..

విశ్వసౌందర్యానికి పౌరోహిత్యం చేసిన కవి పంచేంద్రియాలూ నిదానంగా తమ చైతన్యాన్ని పోగొట్టుకున్నాయి. .. దీర్ఘనిశ్వాస మొకటి వెలికి వచ్చింది. ఆనందుడి తెరచిన కళ్ళను మూసి, ఒకతెల్లటి వస్త్రాన్ని కప్పి, విశ్వం చేతులు మోడ్చాడు—

లోపలి నుండి శిశువు రోదన ధ్వని వినిపించింది.

మగబుద్ధి

శ్రీ సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి

తరణి తరుణ కిరణ సరణి తెమ్మెరదేలి
వచ్చి తనువుదాక వణకి భీతి
దండమిడెదు కలువ రెండుచేతులుమోడ్చి
ఎంత వెట్టి నీకు? యినుడు ప్రభువె?

బెదరి పదరి యదరి భీతిల్లి కుంచించు
కొనెదు తనువు నెత్తికొనవదేమి
భూమిగన్న దలను యామిహిరుడురాగ
పోషితుండె? భర్తె? పూజ్యమేల ?

ఎంత్రమంతుల మీ తనువెల్ల గాల్చి
కొల్లగొట్టిన సౌందర్యమెల్ల గూర్చి
తన సతులకిచ్చునటుగదా తరణి యట్టి
ధూర్తునకు దండమిడెదేల లేగలతాంగి ?

అతడు హితుడో ? అహితుడౌనో ? ధూర్తహృదియె ?
సత్ హృదియె ? ప్రభువేను యీ సమయమునకు
వందన మిడుటు మాబోంట్ల వర్తనమ్ము
కాదనెదె? యనుభవశూన్య! కవికుమార

గురు విభూతి వెలుగు పరపురుషులగన
నుచితమే కులకాంతకు? నువిద దలను
పంచ శుభమౌనెగాని దుష్పల మదెద్ది?
అడ్డుపడువాడు యేడి? యేదైన జరుగ;

ఒక్క భాస్కరుడేమి? యీ యుర్వి పురుష
వర్గమెల్లను....నీవౌ....నీవొక్కరుడవు
మంచివాడవె? మాతనూ మహిత విభవ
మెల్ల కొల్లలాడెదు నందొకింత నబ్బ.

డా॥ ఇంగువ కార్తికేయశర్మ

పెద్దవేగిలో లభించిన శైవ ప్రతిమలు

ఏలూరు పట్టణమునకు 12-కిలో మీటర్లదూరమున ఉత్తర మున పాడుపడియున్న గ్రామము పెద్దవేగి. చారిత్రకంగా యీ స్థలము ఆంధ్రావనికి ముఖ్య నగరమై వేంగీపురముగా ఖ్యాతి చెంది నది. ఇటీవల కేంద్రప్రభుత్వ పురాతత్వపర్యవేక్షణ పనుపున నేను గావించిన పరిశోధనల ఫలితముగా కొన్ని యపురూప శైవమూర్తులు లభించినవి. ఈ శిల్పములు క్రీస్తబ్దము 4-6 శతాబ్దాల నాటివిగా తీసుకొననగును.

ఇవిగాక తూర్పు చాళుక్యుల కాలమునకు చెందిన ఆలయ శిల్పములు, ప్రతిష్ఠామూర్తులు చాల లభించినవి ఇందులో ముఖ్యమైన వాటిని వివరింతును.

1. సోమాయ ఫలకము (ఛాయాచిత్రము-1)

ఈ ఫలకము దాచేపల్లి తెల్లరాయికృతము దీర్ఘ చతురస్రము 12 సెం.మీ. పొడవ 9 సెం.మీ. యెత్తు మరియు 2 సెం.మీ. మందము కల్గియున్నది. పార్వతీ పరమేశ్వరులు నొకొ రుంచక యధిష్ఠానముపై సుఖాసీనులై యున్నారు.

సుఖాసీనం సహోమాయ: శివుని జటములు చక్కగా బంధింపబడినవి. త్రినేత్రమున్నది. యజ్ఞోపవీతము మూడు పాయలదిగా కానవచ్చుచున్నది. అర్ధపర్యంకాసనమున అమ్మవారు శివుని వామ భాగమున తొడపై కూర్చొనియున్నది. మహేశుడు యెడమచేయితో అమ్మవారిని దగ్గరగా తీసుకొనియున్నాడు ఇరువురు నూతనదంపతులు. విలక్షణమైన ముఖవర్చస్సుతో నీ ఆదిదంపతులు వేంగీపుర వాసునికి అర్చన దేవతలైరి. చిన్నఫలకము గాన ఇదియొక శివభక్తుని పూజామందిరమున క్రీస్తబ్దము 4-5వ శతాబ్ది భక్త్యోపచారముల బొందెడిది. ఈ సోమాయఫలకము అత్యంత ప్రాచీనమైనది. తరువాత పాలించిన పల్లవులు- విష్ణుకుండిన ప్రభువుల కాలమున దేవాలయము లందున ఫలకముల శివ-పార్వతి రూపముల స్కందుడు (చిన్నపిల్లవాడుగా), వినాయకుడు చేరియుండుట గమనింపవలసిన విషయము. శివునితో పార్వతి మాత్రము కల్గిన యీ అర్చఫలకము యిదివరలో లభ్యమైన పెద్ద మడియము వాటికన్న పూర్వము మరియు తదితర దేవతను కానము.

2. పంచలింగఫలకము (ఛాయాచిత్రము-2)

మరియొక ముఖ్యమైన రాతిఫలకము శివలింగమున్నది లభించెను. ఈ ఫలకము 7 × 7 సెం.మీ. 2 సెం.మీ. మందము గల్గియున్నది. చక్కగా అర్థశిల్పమున పంచలింగముల నొకే యధిష్ఠానముపై ప్రతిష్ఠించినట్లు శిల్పింపబడెను ఈ యధిష్ఠానము పద్మబంధము గల్గినది. ఈ తీరున పంచలింగముల నొకే వరుస క్రమముగా చిత్రింపబడిన శిల్పము నాకు తెలిసి యెక్కడను లభ్యము కాలేదు. ఈ పంచలింగములు రుద్రుని లేక మహా సదాశివుని పంచభూత లేక వక్త్రముల నుద్దేశించిన సంకేతరూపములుగా నెరుగవలయును. ఈ ఫలకము శుద్ధవైదీకమతానుయాయి పూజలో నుంచుకొన్నట్లు యెరుగ వీలగుచున్నది. శివుని పంచశరునిగా (బాణ) పంచ ఆననునిగా పలు ఆగమ గ్రంథములు తెలుపుచున్నవి గదా ! ఈ ఫలకము కూడ క్రీస్తబ్దము 5వ శతాబ్ది నాటిదే !

3. నాగదేవత (ఛాయాచిత్రము-3)

పెద్ద వేగి త్రవ్వకముల నొక కాల్చిన మృత్తికా ఫలకము లభించినది. ఈ ఫలకము అండాకారముగ 11 × 9 × 2 సె.మీ.



చిత్రము-1
పెద్దవేగి, సోమాయ క్రీస్తబ్దము 4వ శతాబ్ది


మందము గల్గియున్నది. ఒక విచిత్రమైన స్త్రీ రూపమును చూపుచున్నది. ఈమె సింహాక్షి, సింహముఖి, లంబస్తని. సన్నని నడుము, చక్కని నాభిస్థానము కల్గియున్నది. పూర్ణవక్షోజము లున్నవి. సర్పశిరముపై (పడిగ), యోని నుంచి మోకాళ్ళపైవంగి కూర్చున్నది ఇక సర్పములే భూషణములు, సర్పకుండలములు, కంఠమాల, కేయూరములు, మేఖల, శిరోజములు అన్నియు సర్పములే! రెండు చేతుల ముకుళిత కమలముల కాండముల నెత్తిపట్టుకొనియున్నది. ఈ దేవత కుమారియని తెలియుటకిదొక నిదర్శనము. ఈ నాగభూషిత యే సాంప్రదాయమునకు చెందినదో చెప్పజాలకున్నాను. కాని బహుశ అదితి లేక పృథివీదేవతగా నెరుగవచ్చును.



ఛాయాచిత్రము – 3
పెద్దవేగి: నాగదేవత క్రీ. శ. 4వ శతాబ్ది

4. ఏకాదశ ముఖరుద్రుడు : (ఛాయా చిత్రములు) (4, 4ఎ, 4బి)

ఈ మూర్తి శిల్పము పెద్దవేగి చేరువగా లభించు, యెరుపు ఇసుకరాయి కృతము. పదకొండు తలలు, 24– చేతులున్న ఈ రూపము 1.05–మీటర్ల యెత్తు, 65–సెం. మీ. వెడల్పు, 32–సెం. మీ మందము గల్గిన రాతిపై పూర్తిగా శిల్పింపబడెను. క్రిందను కానవచ్చు బుడుపును బట్టి ఈ విగ్రహము ప్రతిష్ఠింపబడినదిగా నెరుగవచ్చును దేవాలయ మెక్కడనుండెనో చెప్పజాలము. కాని వూరికి మధ్యలోనున్న పరమేశ్వరాలయమునకు చేరువగానుండి నటుల భావింపనగును. శిల్పించిన తీరు, భగవత్స్వరూపము యావత్ భారతీయ మూర్తి కళాచరిత్రలోనే కానరాము. అసామాన్యమైన ఈ శిల్పరాజమును శ్రీ రాళ్ళబండి సుబ్బారావుగారు 1-3-1947లో ప్రత్యేక సంచికలో మరికొన్ని శిల్పములతోబాటు పేర్కొనిరి. వీరు మొదట్లో రావణునిగా, మరొకచోట యేకాదశ కంఠునిగా 1961లో ప్రచురించిరి గూడ[3] శ్రీ బ్రిజేన్ద్రనాథ్ శర్మయను రచయిత నీమూర్తి శిల్పమును గ్రానైటు రాతితో చేసినటుల, పది తలలు, యిరువది చేతుల స్థానక మూర్తిగాను, మహాసదాశివునిగా తమ రచనలో పేర్కొనిరి.[4] ఈ శిల్పమును కాకతీయశైలి గలదిగా నెరిగి క్రీస్తుబ్దము 13వ శతాబ్ది కృతముగా వీరు పేర్కొనిరి. పై రచనలన్నియు ఈ శిల్పమును నిశితముగా పరిశీలించి వ్రాసినవిగావు. మెత్తగానున్న పలక లేక సుద్ద రాయి యెరుపురంగు గల్గినది చేకొని ఈ మూర్తిని చెక్కుట భగవంతుని స్వరూపము, రంగు నుద్దేశించి చేసినదిగా గ్రహింపవలెను. రుద్రుని, అరుణాయ, తామ్రాయ, యని పేర్కొనిరిగదా! పదకొండు తలలు, 24 చేతులు సుస్పష్టముగా తెలియుచున్నది. మహా సదాశివుని లక్షణములీ మూర్తిశిల్పమున కానము. అసలు శివరూపము కాదనియే నాయభిమతము. ఈ మూర్తి శిల్పమును నిశితముగా పరిశీలింతును. మధ్యగానున్న రూపము సంపూర్ణ మానవస్వరూపము. అభంగములో



చిత్రము – 2 : పెద్దవేగి,
పంచలింగఫలకము: క్రీ. శ. 5వ శతాబ్ది



చిత్రము - 4
పెద్దవేగి. యేకాదశ రుద్ర, క్రీ. శ. 6వ శతాబ్ది

నిల్చొనియున్నాడు. కుడివైపుకు కొంచెము వంగియున్నటుల యెత్తుగా నున్న పిరుదను బట్టి గ్రహింపనగును. జటములు తురాయివలె నిటారుగానున్నను ముఖాగ్రమున మకుటమున్నది. ఈ మకుటముపై రత్న ఖచితమగు వైదికి నిష్కములున్నవి. ఫాలమున నిటారుగా త్రినేత్ర మున్నది. నాసిక, పెదిమలు కొంతవరకు ఛిద్రములైనవి. కంఠమున త్రిరేఖలున్నవి కంఠహారములు మూడును దళసరిగా ముక్తములతోను, రత్నములతోనుపొగిపియున్నవి. ఛాతిమధ్యగా మాలలన్నింటినికూర్పుగా చేసిన ఆభరణము - తాబేలు లేక సాలీడును బోలియుండుట మిక్కిలి జుగుప్సాకరమైన లక్షణముగా చూడనగును. రుద్రునికి ప్రీతికరమయినది మర్కటకము. శివునికచ్ఛపేశ్వరునిగా కూడనెరుగుదుము. యజ్ఞోపవీతము, ఉదరబంధములు పూర్ణఘట ఖచితమైన మణులతో పొదగపడియున్నవి. చెవులయందు కుడియెడమల మకరవ్యాఘ్రకుండలములు భుజస్కంధముపైపడియున్నవి. పైన వస్త్రములేదు. కుడిచేయిపై కెత్తి వితర్కముద్రలో రుద్రాక్షమాల నిడుకొన్నట్లు కనుపించుచున్నవి. యెడమచేయి కటిపైనున్నది. చేతుల నాగభుజకీర్తులు, వలయకంకణములున్నవి. అట్లే పాదముల సర్పనూపురములు, క్రిందుగా గజ్జెల పట్టెడ గొలుసులున్నవి. ధోవతి బదులు చర్మములను (గజేంద్ర చర్మవాస సహః) ధరించినాడు. పుట్టికలు రెండు పైకి లాగముక్త రత్న మేఖల హారముల బంధింపబడియున్నవి. మేఖలము (మొలత్రాడు)నకు చిన్న గంటలున్నవి. ఈ స్వరూపము పూర్తిగా నిల్చున్న రుద్రపురుషుని మనోహరంగా చూపుచున్నవి. శతరుద్రీయమున ని రూపము- "నమో రుద్రేభ్యో యే పృథివ్యాం యే అంతరిక్షే యేదివి" యని జపించి మోకరిల్లుచున్నాము. ఋగ్వేదమున 2, 33, 5 ఋద్రుడు- "ఋదూ దరః సుహవో బభ్రుః శశ్రిపో" యని వర్ణింపబడెను. ఈ రూపమును స్థిరే భిరంగైః పురు రూప ఉగ్రో బభ్రుః శుక్రేభిః పిపిశేహిరణ్యైః". (2, 33, 9). ఈ పెద్దవేగి ఋద్ర శివుడిట్లే విశాలభుజస్కంధములు, బాహువులు, యెరుపువర్ణముతో అగ్ని రుద్రుని బోలె భాసించుచున్నాడు.

ఈ మహాదేవుడు విశ్వరూపమును చూపుచున్నట్లున్నాడు. ఇరుప్రక్కల ఐదు తలలు అనగా వక్త్రములు మాత్రమే ఒకదాని వెనుక నొకటి యుద్భవించినవి. ప్రతి శిరస్సున ఒకే రకమైన జటాబంధములు-యిట్లు పది తలల పైని జటములన్నియు మధ్య పురుషుని శిరోజములతో చేర్చబడి శిఖరాగ్రమున ఒకేచోట బంధింపబడినవి. జటాబంధోపేతః. ప్రతిముఖము విలక్షణమైనది. విశాలమైన కను



చిత్రము - 4ఎ
పెద్దవేగి రుద్ర, కుడి భాగము క్రీ. శ. 6-7వ శతాబ్ది




చిత్రము - 4బి
పెద్దవేగి రుద్ర వామభాగము. క్రీ.శ. 6-7 వ శతాబ్ది

దోయి, వెడల్పుగానున్న మందమైన పెదవులు, నాసిక, ఫాలభాగము చూడనగును. త్రినేత్రములేదు. ఈ శిరోగ్రముపై అగోచరమైన, ఆరూపియైన ఈశానునిగా తీసుకొనుట సమంజసము. యేలనను 24-చేతులున్నవి. ఈశానుని "సర్వభూతానాం ఈశ్వరః సర్వ విద్యానాం ఈశ్వరః" ధ్యానించుచున్నాముకదా! ఇక మధ్య పురుషుని రెండు చేతులుగాక ఇరుప్రక్కల 11-భుజముల చొప్పున 22- భుజములు ముంజేతి నుంచి ఉద్భవించియున్నవి. భుజతరు అనగా చేతుల వృక్ష మన్నమాట. ముంజేతులవలయ కంకణములున్నవి. ఈ చేతులన్నింటిను ఆయుధములుండుట విశేషమైన లక్షణము అందువలననే ఈ స్వామి రూపమును ఋద్రునిగా నెరుగుచున్నాము. హస్తములు, ఆయుధములు చాలవరకు విరిగియున్నందున నిర్ధారణగా చెప్పజాలక పోయినను వున్నవాటిని దృష్టిలో నుంచుకొని మిగిలిన ఆయుధముల నూహింపవీలగుచున్నది. (రేఖాచిత్రము-1)

కుడిచేతుల ఆయుధములు (క్రింద నుండి పైకి వరుసగా)	వామ హస్తముల ఆయుధములు (పైనుండి క్రిందకు వరుసగా)
1. వితర్క లేక అభయహస్తము	13. డిండిమము
2 త్రిశూల దండము	14 ఖట్వాంగము
3. ఛురిక (లేకకృపాణ)	15. ఖడ్గము
4. అక్షమాల	16. చంద్రబింబము
5. నిషంగము	17. వజ్రము
6. పాశ	18. మూసల
7. ఖడ్గము	19. టంకము
8. కమండలము	20. ధనస్సు
9. సూర్యబింబము	21 శక్తి
10. ఢక్క	22. ఖేటకము
11. కుఠరము	23. నాగదండము
12. జ్వాల (?)	24. కటిహస్తము

ఇక అధోవస్త్రము ధరించిన తీరు గమనార్హము, చర్మమని పైని పేర్కొంటిని గదా! ఈ చర్మ వస్త్రము మోకాళ్ళవరకేయున్నది, పట్టికలతో బంధిపబడి మేఖలతో ముడివేసియున్నవి. మధ్యగా రెండు కాళ్ళ నడుమ వ్రేలాడుచున్నది ఋద్రుని మేఢ్రము. ఈ అధో



ఏకాదశ ముఖరుద్రుడు

రేతము స్ఖలనమైన రుద్రుని సూచించుచున్నది. ఈతడు శిశ్న దేవుడు, (శిశ్నైః దివ్యంతీతి శిశ్న దేవః) గుడిమల్లము లింగముపైని రుద్రుని రూపమున యిట్లే అధోరేతమును చూపియుండుట గమనార్హము. ఆ రూపముగూడ రుద్రియజమానునిగా నిర్ధారణయైనది గదా! అంశుమత భేదాగమమున ఏకాదశ రుద్రుల ప్రస్తావనగలదు మధ్యపురుషుని మహాదేవునిగా, తక్కిన రూపములను శివ, శంకర నీలలోహిత, ఈశాన, విజయ, భీమ, దేవదేవ. భవోద్భవ, రుద్ర మరియొక పాలిశలుగా చెప్పబడినవి. ఇవన్నియు వేరు వేరు మూర్తులుగా వర్ణితములు. శ్రీశివరామమూర్తి మధురలో (ఉత్తరప్రదేశ్) నొక యేకాదశ రుద్రశిల్పము క్రీస్తుశకము నాల్గవ శతాబ్దినాటిది పేర్కొనియున్నారు. ఈ శిల్పమున రుద్రరూపములు వరుసగా ఒకదాని ప్రక్క నొకటి నాభిస్థానమువరకు మాత్రము విడివిడిగా చూపబడిన అర్థశిల్పమున కానవచ్చుచున్నవి. కాని పెద్దవేగి రుద్రరూపమున ఒకే మూర్తిలో కుదింపుచేసి వేరువేరు శీర్షికల భుజములద్వారానే రుద్రరూపముల చూపబడుట గమనార్హము. ఈ మూర్తి శిల్పము, పైన వివరించిన పంచలింగ ఫలకము నిష్ణాతులైన వైదిక రుద్ర భక్తులు క్రమబద్ధమై పరంపరగా సంక్రమించిన శాస్త్రవిద్యా, వైదికాచారముల పాటించుచు నీ మూల చీరమును ప్రతిష్ఠించి ఆరాధించుచుండిరని విస్పష్టముగా తెలియుచున్నది. ఈ శిల్పమును క్రీస్తుశకము 6-7 శతాబ్దిగా తీసుకొనవచ్చును. తరువాత శాలంకాయనులు- పూర్వ చాళుక్య నృపులు వేంగీపురమున వైదికాచారమును, చతుర్వేద బ్రాహ్మణులను గౌరవించినటుల శాసనములున్నవి. యిట్టి విశిష్ట రుద్ర రూపమును మరెక్కడను కానరాము.

5. కాలభైరవుడు- (ఛాయాచిత్రము-5)

పెద్ద వేగినిచుట్టుతూ షుమారు ఒక చదరపు కిలోమీటరు వేంగీపురమును సంరక్షించునట్టి కోటగోడలున్నవి ఈ వేంగీనగరము యొక్క స్థాపన శాలంకాయన రాజవంశమువారు చేసిరి. ఈ నగరమున కధిదేవత దుర్గ లేక అంబ.[6] ఈ దేవతామూర్తియే గాక ఈ కోటను సంరక్షించు నధిదేవతగా క్షేత్రపతిగా కాలభైరవులను ప్రతిష్ఠించినట్లు యిచ్చట లభ్యమైన శిల్పములను బట్టి చెప్పవీలగుచున్నది. ఇచ్చట రెండు కాలభైరవ ప్రతిమల నివసించుతును మొదటిది కోట ఈశాన్య భాగమున, రెండవది పశ్చిమద్వారమున లభించెను ఇచ్చట బహుశ చిన్న ఆలయముకూడ నుండెను కాబోలు ప్రస్తుతము కానరాదు. ఈ



ఛాయా చిత్రము - 5

పెద్దవేగి కాలభైరవుడు. క్రీ. శ. 8-9వ శతాబ్ది

భైరవ దేవత నాల్గు చేతులు గల్గియున్నాడు. విరబోసిన జటలతో కుడిచేతిని త్రిశూలదండము నెత్తుకొనియున్నాడు. క్రింద హస్తము కటిపైయున్నది. వామహస్తమున కపాలము, ఛురిక పట్టుకొని యున్నాడు. మూర్తి 1.07మీ. యెత్తు 70 సెం. మీ. వెడల్పు-18 సెం. మీ. మందము భుజములకు, కాళ్ళకు సర్పాలంకారములున్నవి. భైరవుడు క్షేత్రపతి.(క్షేత్రానాంపతయేనమః)ఇచ్చట ఛురికాయుక్తుడు మరియు ఖడ్గయుక్తుడు. ఆదిశంకరులవారు(క్రీస్తుశకము720) మహానగర పైనవాశికాష్టకమునకు కాలభైరవుని ఈశునిగా పేర్కొని కాలభైరవాష్టకమును స్మరించెను. శాలంకాయన తూర్పు చాళుక్య నృపులు యించుమించు ఈ కాలమున తమ రాజధాని నగరమైన వేంగీపురమున కాలభైరవుని క్షేత్రపాలునిగా ప్రతిష్ఠించి ఆరాధించిరి.

అధోజ్ఞాపికలు

1. డా॥ కార్తికేయశర్మ, "న్యూలైట్ ఆన్ వేంగీపుర" ఎక్స్కవేషన్స్ ఆట్ ది ఏన్షియంట్ హిస్టారికల్ సిటీ ఆఫ్ ఆంధ్రదేశ పురాతత్వ, (న్యూఢిల్లీ, 1987) పుటలు 15_22.

2. వేంగీసంచిక, డిపార్టుమెంట్ ఆఫ్ ఆర్కియాలజీ మరియు మ్యూజియమ్స్, ఆంధ్రప్రభుత్వము హైదరాబాదు (1974) పుట–9

3. రాళ్ళబండి సుబ్బారావు (సం) మ్యూజియమ్ కాటలాగు ఆంధ్ర రిసెర్చిసొసైటి, (రాజమండ్రి) జూన్ 4. 1961) పుట 69.

4. బ్రిజేన్ద్రనాథశర్మ, ఐకనాగ్రఫీ ఆఫ సదాశివ (న్యూఢిల్లీ, 1976) పుటలు 30 24 మరియు ఈ రచయిత డా. కె కృష్ణమూర్తి వ్యాసముపై నాధారపడి వ్రాసినారు. చూడుడు. జర్నల్ ఆఫ్ ఓరియంటల్ రిసెర్చి, (మద్రాసు 1966-67) సంపుటి 36 నంబరు 1-4. పుటలు 1-2; ఎ. వి. నరసింహమూర్తి మరియు గురురాజారావు (సం), రంగినల్లి. (న్యూఢిల్లీ, 1988) పుటలు 268_269.

5. సి. శివరామమూర్తి, శతరుద్రీయము, విభూతి ఆఫ్ శివాస్ ఐకోనాగ్రఫి; న్యూఢిల్లీ, 1976 పుటలు 5, 10, 106 మరియు 122, చిత్రము-67.

6. డా॥ కార్తికేయశర్మ, "ఏకార్నిలియన్ ఇంటాగ్లియో ఫ్రామ్ వేంగిపుర" డా॥ అజయమిత్రశాస్త్రి ఫెలిసిటేషన్ వాల్యూమ్, (న్యూఢిల్లీ, 1988)

కలలు + కల్పనలు

తమిళమూలం :

విరారా

తెలుగుసేత :

డా॥ గాలి గుణశేఖర్

1

నిన్ను ఆహ్వానిస్తున్నాను
మరలా నాచేత పాడించాలన్న
కోరికతో వచ్చావు.
నేనొక వీణను.
మృదుమధురమైన నీ స్పర్శతో
నాలో అనంతకోటి రాగాలు
జనిస్తాయి.
నీవల్ల నాజీవితం సఫలమౌతుంది.
అందుకే....
నిన్ను ఆహ్వానిస్తున్నాను.

2

నువ్వింత కాలం ఎక్కడున్నావు?
పదిహేను కార్తీకాలకు పిదప
చంద్రగృహం నుంచి
క్షాళనం చేయబడి
తీసుకొచ్చిన మధువులా.
పన్నెండు చైత్రాలకు తర్వాత
కపటంలేని హృదయంలో
పిండమై మసలి
అలంకారాలతో రూపం దాల్చిన
మహాకావ్యంలా,

పజ్ఘెనిమిది వసంతాలకు తదుపరి
చిన్న ద్వీపంలో నుంచి
ముత్యాల బస్తాలో
కడలి తీరానికి వచ్చిన
స్వదేశపు నావలా,
నువ్వు నన్ను ఆకర్షిస్తున్నావు.
నీరాకతో....
సంతోష శిఖరాన్ని
మనసులో కాక
చేతితో తాకగల్గుతున్నాను.
కాని, ఇంతకాలం
నిన్ను చూడక వ్యర్థమయ్యిందని
అనుకుంటే - దుఃఖపు లోయలోని
అట్టడుగుకు జారిపోతున్నాను.

3

నువ్వునాకు దాహాన్ని కల్గించావు
ఆ తర్వాతే - నా హృదయం
బీటలువారిన నేలలా వున్నదన్న
సంగతి తెలిసింది.
నువ్వునాకు ఆకలిని కల్గించావు.
అపిదపే - నా ఆత్మ ఎండిన కడుపై
వున్నదని తెలిసింది.
నీవల్ల - ఈ దాహం, ఆకలి
పూర్తిగా నశిస్తుంది.
ఎందుకంటే
నువ్వు ఆకాశ గంగవు
అమృత కలశానివి.

4

న్యూటను
భూమ్యాకర్షణ శక్తిని కనుగొన్నాడు
నేను
నా ప్రాణాకర్షణ శక్తిని కనుగొన్నాను
నా ప్రాణమా!
నువ్వు వర్ధిల్లాలి.

5

సాహిత్య ప్రపంచంలోని
విమర్శాజలధిలో తెడ్డువేస్తున్న
నా మిత్రుడొకడు
ప్రేమన్నది నిజమా? అబద్ధమా?
అని అడిగాడు
అంతకుముందే నీతో పరిచయమైంది
లేకపోతే
నా సమాధానం.
తప్పై వుండేది.

6

చాలాకాలం నీటిలోవున్నా పాషాణం కరగదు
వేలకొలది కళ్ళజంటల కాంతిలో
ఇంతకుముందు నేను చిక్కుకున్నాను
కాని, నా మనస్సు చలించలేదు.
ఈరోజు....ఇదేమి?
ఒక్కక్షణంలో
చెమగిల్లిన నీ చూపులతో
నా హృదయం తటాకమయింది.

7

విప్లవ గీతాలను చదివి
కొంతనేలను ఆక్రమించుకున్నాను
అందుకు నన్ను ఖైదు చేశారు.
విప్లవం నిండిన
నా మనసును
అపహరించుకు పోతున్నావు
ఈ దేశ శాసనం
నీకు సహకరిస్తున్నదే!

ఈ మాసం - మీ నక్షత్రఫలం

ఏప్రిల్ - 1988

మేషము (అశ్విని, భరణి, కృత్తిక 1పా).

అశ్విని వారికి ఈనెలంతా మంచి. రాజయోగంతో గడుచును. ఆరోగ్య వృద్ధి, కార్యవిజయం, ధనలాభం, వ్యవహార విజయం కలుగును. శుభ కార్య ప్రయత్నాలు జరుగును. అవసరములకు తగినధనం సమకూడును. విద్యార్థులకు పరీక్షలలో అనుకూలత, ఉద్యోగ, వ్యాపార, కార్మిక, కర్షక, శ్రామిక వర్గాలకు, అన్ని వర్గాలవారికి అన్నివిధాల అభివృద్ధి, లాభము కలుగును. అయినా 1, 2వారాలు మానసికంగా కొంతక్లేశం, శ్రమాతప్పదు. ధరలత్యధికంగా ఉండును.

భరణి వారికి నెలచివరలో సోదరులు బంధువుల మూలకంగా ధనవ్యయం కలుగును. వివాహాది శుభకార్యములలో పాల్గొనుట, సంతానమునకు అభివృద్ధి కలుగును. ఉద్యోగులకు, విద్యార్థులకు మంచికాలం ధరల మాద్యంవల్ల వర్తకులకు ఆదిలో నిరుత్సాహం, నెలచివర ధరల పెరుగుదల విశేషలాభము కలుగును. ఈ నెల 2,3 వారాలు అనుకొనని దండుగ ఖర్చులు జరుగుతాయి.

కృత్తిక 1 పా. వారికి 3-11 తే.ల మధ్య శారీరక శ్రమ, ఖేదము కలిగి తొలగిపోవును. ధనవ్యయం జరుగును. ఈనెల 6వ తేది నుండి విశేషంగాధన లాభము కలుగును. ఆరోగ్యంకలుగును. బంధు మిత్రుల రాకపోకల వలన ధనవ్యయం కలుగును. రాజకీయ నాయకులకు, విద్యార్థులకు, ఉద్యోగ, కర్షక, కార్మిక వర్గానికి అతిశ్రమ మీద లాభించును.

వృషభము (కృత్తిక 2, 3, 4పా రోహిణి, మృగశిర 1,2పా)

కృత్తిక 2, 3, 4పా. వారికి ఈ నెలంతా చిక్కులువిడి, కార్యానుకూలతకు మార్గం ఏర్పడును. మనోవైకల్యం ఇంకాకొనసాగును. ధనవ్యయం కలుగును. సంతానమునకు గురించి వ్యథకలుగును. విద్యార్థులకు, ఉద్యోగులకు, వ్యాపారులకు, కార్మిక వర్గానికి కొంత సామాన్య ఫలం కలుగును. శ్రమహెచ్చు. ఫలితం తక్కువ. రాజకీయ నాయకులకు మిశ్రమఫలం.

రోహిణి వారికి 12తే నుండి శరీరంలో ఉష్ణాధిక్యము, నలత, కార్యవైఫల్యం. మనఃక్లేశం, ఆర్థిక చిక్కులు, అపనిందలు, ప్రతి విషయంలో అనుమానం కలుగును. శుభకార్యములకై ప్రయత్నించుట ధనవ్యయం జరుగుట మొదలగునవి కలిగినా, ఏదోవిధంగా సమయానికి డబ్బు సర్దుబాటయి పబ్బం గడచి పోవును. శనికి జపశాంతులు చేయించుట మంచిది.

మృగశిర 1, 2పా. వారికి ఈ నెలంతా ఆందోళన, అనుకొనని దండుగ ఖర్చులు జరుగుతాయి. ప్రతిపనిలోను తొందరపాటూ, జరిగిన దానికి విచారమూ కలుగును. ధనమునకు కొంత తొట్రుపాటుతప్పదు. మనోవైకల్యం, కొంతక్లేశం, ఖేదముతప్పదు. రాబడికి మించిన ఖర్చులు జరుగును. రాజకీయ వాదులకు కొంతమేలు కలిగినా, హెచ్చుగా ఆశాభంగము జరుగును.

మిధునము (మృగశిర 3, 4పా. ఆర్ద్ర, పునర్వసు 1, 2. 3పా)

మృగశిర 3, 4 పా వారికి. ఈ నెలంతా కుటుంబంలో అశాంతి నలతలు, భార్యకు అనారోగ్యం మొదలగునవి జరుగును. భార్యావర్గము వారితో మాట పట్టింపులు, విరోధములు కలుగును. చిరాకు ప్రథమ కోపము హెచ్చు. శ్రమహెచ్చు. ఫలితం తక్కువ. అయినా శుభకార్య ప్రయత్నాలు శ్రమమీద కొంత వరకు ఫలించును. విద్యార్థులకు సామాన్యవిజయం, ఉద్యోగులకు శ్రమ, వర్తకులకు సామాన్యలాభము, రాజకీయవాదులకు పెద్దయోగం ఉండదు. శ్రమ ఆర్భాటం, ధనవ్యయం హెచ్చుగా నుండును.

ఆర్ద్ర వారికి 3, 11 తే లమధ్య శ్రమా, నలత, ధనవ్యయం, స్థానభ్రంశము, త్రిప్పటకలుగును. భార్యకు అనారోగ్యం కలుగును. ఈ నక్షత్రము గలవారందరికి మొదట ఆటంకము, తర్వాత అతికష్టం మీద విజయం కల్గును, ఉద్యోగులు విద్యార్థులు, వర్తకులు, కర్షకులు అధికంగా జయాన్ని, లాభాన్ని పొందుతారు. అయితే రాజకీయ వాదులకు 12 తే వరకు చిక్కులు కలిగి తొలగును.

పునర్వసు 1, 2, 3పా వారికి 12-30 తే॥ల మధ్య శ్రమ, ఖేదం, త్రిప్పట. ధనవ్యయం కలుగును. శ్రమహెచ్చు ఫలితంతక్కువ. ఆర్థికంగా తొట్రుపాటు మనోవైకల్యం ఆందోళన కలుగును. శారీరక మానసికశ్రమా, కార్యవిఘ్నం, మనోవైకల్యం, శత్రుపీడా, బంధు విరోధం కలుగును. బంధుమిత్రాదుల రాకపోకలవలన శ్రమహెచ్చుగా నుండును. ఉద్యోగ కర్షక, కార్మిక వర్గాలకు అన్నివర్గాలకు బాగుగా

నుండును. రాజకీయవాదులకు ఇతరుల వలనకంటె ఆత్మీయులవలననే పదభ్రంశము కల్గును. 12తే తర్వాత చిక్కులు హెచ్చు.

కర్కాటకము (పునర్వసు 4పా పుష్యమి, ఆశ్లేష)

పునర్వసు 4పా వారికి. 12 తే నుండి నెలంతా మనః ఖేదం, వ్యాకులపాటు ఉన్నా అవసరానికి ధనం చేకూరి, అనుకొన్న పనులు నిర్విఘ్నంగా నెరవేరుతాయి. మొదటి పదిరోజులు చాల బాగుగానుండును కళత్ర, పుత్ర, బంధుసౌఖ్యము కలుగును సంఘంలో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించును. అన్ని వర్గాల వారికి బాగుగాలాభించును. ధనవ్యయం కలుగును. శ్రమహెచ్చు. రాజకీయవాదులకు శ్రమమీద కార్యసిద్ధి కలుగును.

పుష్యమి వారికి ఈనెలంతా బాగుగా నుండును. సంతానము నకు అన్నివిధాలఅభివృద్ధి, కుటుంబ సంసార సౌఖ్యం కలుగును. శుభ కార్యానుకూలత, పుణ్యతీర్థ యాత్రలు, సద్గోష్టి, ఉత్తమ బంధుమిత్ర లాభము కలుగును, విద్యార్థులకు, ఉద్యోగులకు అనుకూలమైన కాలం. పెద్దవారితో మైత్రి ఏర్పడి, అప్పటికప్పుడు కార్యవిజయం కలుగును.

ఆశ్లేషవారికి అన్నిపనులు సకాలంలో నెరవేరును. శుభకార్య ప్రయత్నాలు ఫలించును. రాజకీయ వాదులకు హెచ్చు పలుకుబడి, ధన పదవీలాభము, సంతానమునకు మంచి ప్రోత్సాహం, చక్కని క్రీడ శిక్షణ, విద్యలో బాగుగా రాణించుట జరుగును. నూతన నిర్మాణములు సువర్ణ వస్త్రాభరణప్రాప్తి కలుగును.

సింహము (మఘ, పుబ్బ, ఉత్తర 1పా)

మఘ వారికి ఈనెలంతా శ్రమహెచ్చు, ఫలితం తక్కువ. ఆరోగ్యభంగం, మనస్తాపం, అధికశ్రమ, కుటుంబంలో అకారణ కల హాలు, వాగ్వాదములు, అధిక ధనవ్యయంకలుగును. పడుట, దెబ్బలు తగులుట మొత్తంమీద ఈ నక్షత్రం గలవారికి శ్రమజరుగవచ్చును. అనుకొన్న పనులు ఆలస్యంగా నెరవేరుతాయి. అయితే మానసికంగా ప్రతివిషయంలోను దిగులుగా ఉంటుంది.

పుబ్బవారికి నెల 7వ తే వరకు మానసిక శ్రమకలిగినను కుటుంబంలో సుఖసంతోషములు కలుగును. సంసారభార్యా కుటుంబ సౌఖ్యం, ధనాదాయం బాగుండును. విద్యార్థులకు, ఉద్యోగులకు, కర్షక కార్మిక వర్గానికి, ఉపాధ్యాయులకు, రాజకీయవాదులకు, వర్తకులకు, సర్వవిధాల మేలు, లాభం, సుఖసంతోషాలు కలుగుతాయి. రాజకీయ వాదులకు లాభం, మంచిప్రోత్సాహం కలుగును.

ఉత్తర 1పా వారికి. 11 తే. వరకు శరీరంలో నలతా, ఉష్ణా ధిక్యము కలిగినను, ధనలాభము బాగుండును. కుటుంబంలో సుఖసంతో షాలు దర్జా, ఆడంబరము, ఔదార్యము ప్రదర్శించును. ఉద్యోగులకు, విద్యార్థులకు, కర్షక కార్మిక వర్గానికి, రాజకీయవాదులకు అన్ని వర్గాల వారికి సుఖ సంతోషాలు కలుగును. శుభకార్య ప్రయత్నములన్నీ నెరవేరును. ధనలాభం అన్నివిధాల కలసి వచ్చును.

కన్య (ఉత్తర 2, 3, 4పా. వారికి హస్త చిత్ర 1,2పా)

ఉత్తర 2, 3, 4పా. వారికి రెండవ వారంలో భార్యకు అనా రోగ్యము శ్రమా, ఖేదమూ కలుగును. అవసరములకు తగి ధనము చేకూరి, పనులు నెరవేరుచున్నను, శుభకార్యములకై శ్రమ, త్రిప్పట ధనవ్యయము కలుగును. విద్యార్థులకు, ఉద్యోగులకు, రాజకీయవాదు లకు, కర్షక, కార్మిక వర్గానికి కొంతమేలుగా నుండును. శ్రమకలిగినా ఫలితం అనుకూలంగా వుండును.

హస్తవారికి నెలంతా మానసిక శ్రమ, ఖేదము, ఆందోళన ధనవ్యయం కలుగును. ఏపని తలపెట్టినా సకాలంలో జరగవు. ఆర్థిక ము గాకూడ తొట్రుపాటుతప్పదు. మానసికంగా బాధపడుట తప్పదు. శుభకార్య ప్రయత్నాలు వాయిదాపడును. శనికి జపం చేయించుట మంచిది. మానసికంగా, శారీరకంగా చిక్కులు, ధనవ్యయం, ప్రయాస హెచ్చుగా నుండును.

చిత్ర 1,2 పా వారికి శరీర శ్రమ హెచ్చు. ధన వ్యయం, కుటుంబములో కలతనలతలు, భార్యకు అనారోగ్యం, అనవసర వాగ్వా దములు, కించిత్ శరీర నలత కలుగును, తర్వాత అనుకూలత ఏర్పడి శుభకార్య ప్రయత్నములు నెరవేరును. లేదా వాయిదాపడి, చివరకు ఫలించును. విద్యార్థులకు అతి కష్టంమీద ఉన్నత విద్యావకాశం కలుగును.

తుల (చిత్ర 3, 4పా. స్వాతి–విశాఖ 1,2,3పా)

చిత్ర3, 4, పా వారికి ఈ నెల 22తే వరకు కొంత సామాన్యం గాను, అటుపిమ్మట కుటుంబ చిక్కులతోను, ధనమునకు తొట్రుపాటు తోను గడుచును. ధనవ్యయము, ఇతరులతో మాటపట్టింపులు, మనః ఖేదము కలుగును. స్వల్పంగా ఆరోగ్య భంగము, భార్యకు అనారోగ్యం, కలుగును. శుభకార్య ప్రయత్నాలకు వ్యయం జరిగి, ఫలించునుకాని అధిక శ్రమపొందవలసి వచ్చును. ఏవిషయమందును ఉత్సాహముండదు.

స్వాతి వారికి మొదటి వారంలో శరీరశ్రమా, ఖేదము కలిగి తొలగును. ధనాదాయం పెరుగును. ఇప్పటివరకు ఉన్నచిక్కులు తొలగి అన్ని విధాల స్వస్థత కలుగును. విద్యార్థులకు, ఉద్యోగులకు అనుకూల ఫలం కలుగును. వర్తకులకు ప్రారంభంలో సామాన్యఫలం, ద్వితీ యార్థంలో మంచిలాభం, సువర్ణాభరణ ప్రాప్తికలుగును సంఘంలో మంచి పలుకుబడి, గౌరవం కలుగును.

విశాఖ 1, 2, 3పా వారికి 12-30 తే.లమధ్య ఉష్ణాధిక్యము, శరీరశ్రమ, ఖేదము కలుగును. విద్యార్థులకు, ఉద్యోగులకు, ఉద్యోగ, కర్షక, కార్మిక, వర్తక వర్గానికి అన్నివిధాల మేలుకలుగును. అన్ని

పనులు సకాలంలో నెరవేరును. శుభకార్య ప్రయత్నములు ఫలించును. రాజకీయవాదులకు పెద్దపలుకుబడి ధన పదవీ లాభం కలుగును.

వృశ్చికము (విశాఖ 4పా అనూరాధ, జ్యేష్ఠ)

విశాఖ 4పావారికి 1-6తేల మధ్య భార్యకు అనారోగ్యం చేసి నిమ్మళించును ఆర్థికంగా ఇబ్బంటుపాటు కలుగును సంతానమునకు అన్ని విధాల అభివృద్ధి కలుగును కానివారితో మాటపట్టింపులు వచ్చును. బంధు మిత్రులతో అభిప్రాయ భేదములు కలుగును. మొత్తం మీద శుభాశుభ మిశ్రమఫలం కలుగును. రాజకీయ వాదులకు ఉన్నతపదవి కలుగును.

అనూరాధ వారికి ఇంతవరకు కలిగిన శారీరక మానసిక వ్యథ లన్నీ ఇంతకుముందే తగ్గుదలలో ఉన్నను, ఈ నెలకుబాగా తగ్గిపోయి అనుకూలమైన శుభకాలం కలసివచ్చును. కానీ ఆరోగ్య విషయములలో నెల 22-30 తేదీలమధ్య బడలిక, అతివేడిమి, శ్రమ కుటుంబములోను, బయటివారితోను అనైక మత్యమును కలిగించును.

జ్యేష్ఠవారికి అన్నిరంగాలలోను విజయం, లాభం, మంచి ధనా దాయం, మాట పలుకుబడి, బంధుమిత్రుల సమాగము. శుభకార్యాను కూలత అన్ని వర్గాలకు శుభప్రదంగా నుండును. అనుకొనని విధంగా ధనలాభం చేకూరును గృహమందు శుభకార్యములు నెరవేరును. సంఘంలో మంచి పలుకుబడి, గౌరవము పెరుగును రాజకీయవాదులకు మేలుగానుండును

ధనుస్సు (మూల పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా)

మూల వారికి గతంలోని చిక్కులు ఈ నెలచివరిదాకా కొన సాగును. ఆరోగ్య భంగమగును శ్రమా, త్రిప్పటా, ఖేదం, మనో వైకల్యం, మానసికంగా ఆందోళన, ధనవ్యయము జరుగును. విద్యార్థు లకు, ఉద్యోగులకు, వర్తకులకు శ్రమకు తగినఫలం కలుగును అనుకొన్న పనులు సకాలంలో నెరవేరవు. శుభకార్య ప్రయత్నాలు వాయిదా పడును. బంధు విరోధం కలుగును. ఆర్థికంగా ధన లోపము నకు ఇబ్బంటుపాటు తప్పదు

పూర్వాషాఢ వారికి 7తే వరకు శారీరకశ్రమ కలిగించినా, మిగిలిన కాలమంతా బాగుగానే యుండును శుభకార్యములకై ధనవ్యయము తప్పదు. అయినను ఏదోరూపంలో లోపంరాకుండా ధనము వచ్చుచునే యుండును. కుటుంబంలో ఐకమత్యం, శుభములు, సువర్ణ, వస్త్రాభరణ ప్రాప్తి మొదలగునవి చేకూరును కాని మనస్సుమాత్రం ఏవోపనికి మాలిన ఆలోచనలతో గడచును. రాజకీయంగా లాభం కలుగును.

ఉత్తరాషాఢ 1పా వారికి 3-11తే ల మధ్య శరీరంలోనలతా, శ్రమా ఉన్నా, ధనవ్యయం కలిగినను, శుభకార్య ప్రయత్నములు నెరవేరును. అన్నివర్గముల వారికి ప్రతివిషయమూ సానుకూలముగా, లాభదాయకంగా ఉండి,సర్వులవలన సమ్మానము, ఆదర గౌరవములు, సుఖశాంతులు లభించును. సంతానమునకు అన్ని విధాల అభివృద్ధి, విద్యలో క్రమశిక్షణ, రాణింపు జరుగును. శుభఫలం హెచ్చుగా నుండును.

మకరం (ఉత్తరాషాఢ 2,3 4పా శ్రవణం ధనిష్ట 1,2)

ఉత్తరాషాఢ 2 3 4పావారికి 3-11తే.ల మధ్య శరీరశ్రమ, నలత, మనోవైకల్యం, అతివేడిమి ఉన్నను, నెలంతా సామాన్యంగాను ఉండును కాని చేతికి అందవలసిన ఫలితంకొన్నాళ్ళు వాయిదాపడును. ధనవ్యయం జరుగును పుత్ర పుత్రికా విషయికంగా ధనవ్యయం,విద్యా ర్థులకు సామాన్యశ్రేణి విజయం కలుగును, ఉద్యోగ, వ్యాపార, కర్షక, కార్మిక, శ్రామిక వర్గాలకు అన్నివిధాల మేలైన కాలము.

శ్రవణం వారికి 12వ తే. నుండి శరీరంలో నలతా, కార్య వైఫల్యం, మనఃక్లేశం, ఉష్ణాధిక్యము, కార్యభంగము, ఆర్థికపుచిక్కులు, అపనిందా అనుమానం కలుగును ఏదోవిధంగా సమయానికి, డబ్బు సర్దుబాటయి బ్బంగడిచి పోవును ధనవ్యయం హెచ్చుగా జరుగును. విద్యార్థులకు, ఉద్యోగులకు, వర్తకులకు శ్రమకు తగినఫలం కలుగును. తల్లికి స్వల్పంగా నలత, విశేషధనవ్యయం జరుగును.

ధనిష్ట 1 2పా వారికి ఫలితం బాగుగానున్నను, విపరీతంగా శ్రమ, మానసికంగా ఆందోళన, పిరికితనం సంతానముతో మాటపట్టిం పులు, అధికంగా ధనవ్యయం కలుగును. ఎంతటిగొప్ప ఉన్నత అవకా శాలువచ్చినా, వాటిని మూర్ఖత్వ అనుమానాలచే అందుకొనలేక, తర్వాత పశ్చాత్తాపము పడుటజరుగును. శుభకార్యములన్నీ నెరవేరను. అకారణ కోపం, చిరాకు మొండితనం హెచ్చును. రాజకీయంగా పలుకుబడి పెరుగును

కుంభం (ధనిష్ట 3, 4పా. శతభిషం పూర్వాభాద్ర 1, 2, 3పా)

ధనిష్ట 3, 4పా వారికి ప్రతిచిన్న విషయంలో ఆడంబరం అట్టహాసంహెచ్చు. బంధుమిత్రులకు, అధికధన వ్యయంహెచ్చు. ధనం బాగుగా కలసివచ్చినా, చేతిలోనికి వచ్చుటకు కొంతఖర్చు. అధికంగా ఆలస్యం జరుగును. సోదరీసోదర వర్గమూలకంగా సహాయం జరుగును, కుటుంబ సంసార సౌఖ్యంబాగుండును. విద్యార్థులకు. రాజకీయవాదులకు కొంత సామాన్యంగా నుండును. గురుజపం శ్రేయుట మంచిది.

శతభిషం వారికి 11తే వరకు శరీరంలో నలతా, శ్రమను కలిగిం చినా ధనవ్యయం కలిగినను, ఆరోగ్యం,సర్వకార్య విజయం,ధనలాభం, సుఖసంతోషాలు కలుగును. ఉద్యోగులకు పదవీగౌరవప్రాప్తి,విద్యార్థు

లకు ఉన్నతశ్రేణి, విజయం కలుగును. సుఖభోగ విలాసములకు, లేని పోనిదర్జాలకు, శుభకార్యములకుధనవ్యయం జరుగును.

పూర్వాభాద్ర 1 2 3పా వారికి 11తే.నుండి శారీరక, మానసిక శ్రమ, ఆందోళన,పనికిమాలిన ఆలోచనలు, ధనవ్యయం, ఇతరులతో, వాగ్వాదములు, కుటుంబంలో స్వల్పంగా అశాంతి, కలతలు మొదలగునవి కలుగును. అనవసరపు ఖర్చులు,డబ్బుతొ్రటుపాటుకి దారితీయును. శ్రమా, బడలికా, త్రిప్పటా తప్పదు.


మీనం (పూర్వాభాద్ర 4పా ఉత్తరాభాద్ర రేవతి)

పూర్వాభాద్ర 4పా వారికి 11తే. నుండి శ్రమా, బడలికా, త్రిప్పటా, మనఃక్లేశము, ఖేదము కలుగును. భార్యకు అనారోగ్యము, కుటుంబములో అశాంతి కలుగును. విద్యార్థులకు, వర్తకులకు, ఉద్యోగులకు మంచియోగ దాయకమైన కాలము. ఈరాశివారందరికి పుష్కలంగా ధనలాభము కలుగును. వ్యయము హెచ్చుగా నుండును. రాజకీయంగా పలుకుబడి పెరుగును. ధనముబాగా కలసివచ్చును.

ఉత్తరభాద్ర వారికి నెలచివరిలో అనారోగ్యం కలుగును. శ్రమ హెచ్చు ఫలితం తక్కువ. సంతానమునకు అన్నివిధాల విద్యాకృషి బాగుగా జరుగును. విశేషంగా ధనంకలిగి క్రొత్తపరిశ్రమలు, గృహ నిర్మాణము జరుగును. శుభకార్యములలో పాల్గొనుట జరుగును. పనులన్నియు సానుకూలమైయుండును. మంచి యోగప్రదమైన కాలము.

రేవతి వారికి ధనలాభం, కార్యవిజయం, ఉత్సాహం, ధైర్యం, చొరవ, సంతానమునకు అభివృద్ధి కలుగును. సువర్ణవస్త్రాభరణములు కలుగును. శుభకార్యములన్నీ నెరవేరును. ఉద్యోగులకు, విద్యార్థులకు, వర్తక, కర్షక, శ్రామిక వర్గాలకు, రాజకీయవాదులకు, మంచిపలుకుబడి, గౌరవము,సమ్మానము,ప్రమోషను, లాభము, విజయం, మొదలగునవి కలిగించెడి కాలము. మొత్తం మీద శుభప్రదమైన కాలము. భార్యకు నలత చేయును.

సిద్ధాంతి: నిష్ఠల వేంకట సత్యసుబ్రహ్మణ్యం



ఆరంజోతి

శ్రీ టి. రామలక్ష్మణాచార్యులు

సఖీ !
నీ కనీనికల్ పరచిన ప్రేక్షణ మాలికలు
నాంకరంబునం దవిలిన ప్రేమపాశములు
నీపలుకులు నాక ధునీచల దూర్మికాకణములు
మనోహరీ !
నిన్
స్పృశించరాదను వృద్ధుల పలుకులు
మన్
మనోవాక్కాయముల కస్పృశ్యములు
త్వత్
శిరీషకుసుమ పేశల తనూస్పృశిత
మరుత్
తరంగ మాలికలు
నా వక్షాన్ని హత్తుకొని
పెదవులను తాకి
చెంపలను ముద్దాడి
తనువెల్ల బంధించి
భవత్
నిశ్వసితానిల స్పృశిత ప్రత్యంగుడనై
అనంగ శర తాడిత పీడితుడనై
అభిలషిత భవత్ కరాగ్రచాలనుడనై
నీ
వెన్దగిలి
మిన్దాకిన
అస్మన్ మనోభావ వీచికలివి


....

కల్హార ముకుళ ప్రమోద వేళ
మల్లి కాలంకృత అభ్యంజిత కేశపాశవై
నీ పల్లవ పాదాంకిత కింకిణీరవళులు
వందిమాగధ ధ్వానమ్ములై
వనదేవతవోలె
సాగివచ్చు నీకై
నా కరాగ్రము సాగివచ్చు తరుణంలో
గర్జించినదో వృద్ధకంఠం
గహ్వార నివాన బధిరాంధ జీర్ణ కేసరి
కంటక కంఠం
లిప్తకాలం
స్తంభించింది వాయుచాలనం
చెలరేగింది ప్రతాపానిలం
గుహోన్ముఖమైంది వృద్ధ కంఠీరవం
ప్రసన్నమాయెను ఝంఝానిలం
పంచమ స్వరంలో కోకిల తూర్యనాదం
* పంచమ వర్ణంలో నీ తపనీయ తనూద్యుతి
నీ ఆర్ద్ర నయనాంచలాల
వెలిగిన ప్రణయజ్యోతి
నా జీవన మార్గాన్ని చూపిన అరంజోతి

---

* పంచమ వర్ణం = ఇంద్రధనుస్సులో ఐదవ వర్ణం, నారింజరంగు.

అమృతాంజన్ లిమిటెడ్‌వారి విశిష్ఠమైన ఆముదము



శుద్ధి చేసినది, వాసన లేనిది.

అమృతాంజన్ లిమిటెడ్ 42-45, లజ్ చర్చ్ రోడ్డు, మద్రాసు 600 004

Amrutanjan Limited

శ్రీ కొల్లూరు సూర్యనారాయణ

పంచారామాలు ప్రాచీన బౌద్ధ క్షేత్రాలేనా?

తెలుగునాటి మధ్యయుగాల చరిత్ర నిర్మాణంలో ప్రముఖాధారాలైన శాసనాలకి తోడుగా సాహిత్యంకూడ గణనీయమైన స్థానాన్ని నిర్వహిస్తోంది కొన్ని సందర్భాలలో ఏ యితరాధారాలు ప్రసరించి వెలుగు చూపని కోణాల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయటానికి సాహిత్యమే మూలాధారమై నిలుస్తోంది. అయితే ఒక గ్రంథంలోని అంశాన్నో, ఒక జనశ్రుతినో చారిత్రకాధారంగా పరిశీలించే ప్రయత్నానికి ముందు, ఆ అంశపు నిర్దుష్టమైన కాలన్ని, యితర ప్రామాణికతని విశ్లేషించి చూడగిలగాలి అది ఏ కాలానికి, ఏ ప్రాంతానికి, ఏ పరిస్థితులకు సంబంధించిన అంశమో చూచాయగానైనా తెలియగలగాలి. ఇవి తెలియని కారణంగానే చాలవరకు జానపద వీరగాథల్ని చారిత్రకాధారాలుగా గుర్తించలేకపోతున్నాము. ఒక సాహిత్యాధారంలో పేర్కొనబడిన ఒక అంశం నిర్దుష్టమైన మరో చారిత్రకాధారం వలన రూఢిపరచబడినప్పుడు దాని ప్రామాణికతని నిలదీయ వలసిన అవసరం ఆసలుండదు అలాగే సమకాలీన ఆధారాల వెలుగులో నిర్ధారితములైన చారిత్రకాంశాలకు విరుద్ధంగా ప్రస్తావనలున్న అర్వాచీన సాహిత్యాన్నికూడ మనం ఏ మాత్రం పట్టించుకోనక్కరలేదు ఇతరాధాల మూలంగా వెలుగుచూడని ఒక సమస్య ఒకే ఒక్క సాహితీ అంశంలో లేశమాత్రంగా చోటుచేసుకున్నపుడు దానిని మాత్రం చాల సూక్ష్మంగా పరిశీలించవలసివస్తుంది శ్రీనాథ మహాకవి కృతమైన శ్రీ భీమేశ్వర పురాణ ప్రబంధములోని పంచారామాలు ప్రస్తావన ఆ కోవకే చెందుతుంది

ద్రాక్షారామ, భీమారామ, సోమారామ, క్షీరారామ అమరారామాలనే ఆ రామాలు ఉమ్మడిగా 'పంచారామాలు'గా పిలువబడతాయి. (ప్రస్తుత ద్రాక్షారామము, సామర్లకోట, గునుపూడి, పాలకొల్లు, అమరావతులు). వేంగీ చాళుక్యవంశంలోని చాళుక్య భీముని కాలంలో యివి నిర్మింపబడినట్లు సాధారణంగా భావించబడుతోంది[1]. కాని యీ ఆలయ నిర్మాణాల అర్వాచీన కాలానికి చెందిన ఎదరుపల్లి పునర్దత్త శాసనంలో, క్షీరారామం నరేంద్రమృగరాజ విజయాదిత్యుని కాలంలోను, భీమారామం చాళుక్యభీముని కాలంలోను నిర్మితాలైనట్లు స్పష్టంగా పేర్కొనబడింది.[2] చాళుక్యవిశ్వేశ్వరుని పంచధారల శిలాశాసనంలో కూడ చాళుక్యభీముని కాలంలోనే భీమారామం నిర్మించబడినట్లు చెప్పబడింది[3] కనుక పంచరామములలోని ప్రముఖాలైన యీ రెండు ఆరామాలు వేంగీ చాళుక్యుల కట్టడాలేనని తెలుస్తోంది. వీరు శైవ మతాభిమానులగుటచేతను, వీరి ఆధిపత్యముననే తీరాంధ్రమున లెక్కకు మిక్కుటమైన శివాలయము లెత్తింపబడుటచేతను మిగిలిన దాక్షారామ, సోమారామ, అమరారామములుకూడ వీరిచేతనే నిర్మింపబడియుండునని ఊహింపబడుతోంది. ఈ క్షేత్రములైదింటిని ఏకనామమున 'పంచారామాలు'గా ఎందువలన, ఎప్పటినుండి పిలుపబడుట మొదలైనదో తెలుసుకొనుటకు స్పష్టమైన ఆధారాలులేవు.

ప్రముఖ శైవక్షేత్రాలైన యీ ఆరామములైదును ప్రాచీన బౌద్ధ విహారశిథిలములపై నిర్మింపబడియుండునని కొందరి బలమైన అభిప్రాయము[4] దీనికి విరుద్ధముగా మరికొందరి దృష్టిలో యీ ఆరామములకు బౌద్ధముతో నెట్టి సంబంధమునులేదు; మొదటినుండియు నివి శైవక్షేత్రములే పంచారామములందు తొలుత ప్రాచుర్యమందిన మతమును గూర్చిన వాదములు చరిత్ర పరిశోధకులకు క్రొత్త విషయముకాదు అవి వారల యిచ్చట అనవసరము జనశ్రుతులను బట్టి యివి బౌద్ధవిహారముల శిథిలాలపై నిర్మించబడిన శైవాలయములని కొందరి విశ్వాసమైనప్పటికీ, ఒక్క అమరారామమున తప్ప మరెందును పరిగణింపదగినంత బౌద్ధచిహ్నములు గోచరింపవు. అందువలన మరియొక వర్గపు పరిశీలకుల దృష్టిలోనివి తొలినుండియు శైవక్షేత్రములు మాత్రమే. స్పష్టమైన, బలమైన ఏ విధమైన ఆధారములు లేనందువలన యీ వాదములు రెండును నిర్ధారితములుకాని అభిప్రాయములుగనే నిలిచిపోయినవి. రెండింటి యందును గుణదోషములు కలవు. క్రొత్త ఆధారము లెట్టివైనను బయల్పడిననేతప్ప ఏ వాదము నిర్దుష్టమో తెలియునవకాశములేదు. పురావస్తుశాఖవారి ఉదాసీన వైఖరివలన క్రొత్త ఆధారములమాట యటుంచి ఉన్న

ఆధారములే దినదినక్షీణమై నశించుచున్నవి. ఈ ఆరామప్రాంతముల చుట్టుప్రక్కల స్థూలమైన పరిశీలన, ప్రత్యక్షములు జరిపిననేతప్ప క్రొత్త ఆధారముల యాశలేదు. కాలగతిలో గతులు మార్చి ఎన్నియోమార్లు పరవళ్ళు త్రొక్కిన ప్రళయగోదావరి అటువంటి ఆధారముల నెంతవరకు ఆ ఆలయముల పరిసరములనుంచియుండు నన్నదియు సందేహమే. ఇట్టి పరిస్థితులలో చరిత్రకాలమున యీ అంశమై చోటుచేసుకొన్న జనశ్రుతులు, సాహిత్యప్రస్తావనలు కొంత వరకు పంచారామ విషయ పరిశీలనకు తోడ్పడగలవేమో యోచింప వలసియున్నది. భీమేశ్వరపురాణ ప్రబంధమునందలి ఒక చిన్న అంశము యీ సందర్భమున కుపకరించును. ఇందలి యీ ప్రస్తావన పంచారామముల నిర్మాణకాలమునకు అర్వాచీనమైనదైనను నేటికి ఐదారు శతాబ్దులముందు యీ అంశమై ఆనాటి వారికున్న భావము లకు దర్పణము పట్టగలదు.

శ్రీ భీమేశ్వరదేవుని క్షేత్రమాహాత్మ్యము నుగ్గడించుటకు, పవిత్ర దాక్షారామప్రాంతములను తనివితీర వర్ణించుటకును కవి సార్వభౌముడీకృతిని చేసినట్లు తోచును. కథాచిత్రణమున భీమ ఖండవు భౌగోళిక వర్ణన కడు రమ్యముగా సాగి మన మనోనేత్ర ముల ముందొక చిత్రపటమును సాక్షాత్కరింపజేయును (గ్రంథమున దీనికి మహాస్కాందమునందలి గోదావరి ఖండము మాతృకయని చెప్పబడినను కొన్ని అంశములు కారణముగా యిందలి ప్రస్తావనలు చాలవరకు శ్రీనాధుని కృతములుగనే భావింపబడుచున్నవి. వివరణ లకు గతమున ఆంధ్రసాహిత్యపరిషత్పత్రికాదులందు పరిశోధక పండితులమధ్య జరిగిన చర్చలు పరిశీలింప ప్రార్థన . చాళుక్యభీముని కాలమున చాళుక్య భీమారామ నిర్మాణ విషయము, చాళుక్యచోళుల కాలమున సర్పపురమున నిర్మింపబడిన భావనారాయణుని ఆలయ విషయము, అట్టివే అయిన మరికొన్ని విషయములు యిందున్న కారణముగా యిందలి కధనంలోని కొన్ని అంశాలు మాతృకలోని వనుటకన్నా శ్రీనాధుని కాలమునాటికి ప్రాచుర్యములోనున్న అభి ప్రాయములేనని గ్రహించగలము.

పంచారామాలయొక్క (ముఖ్యంగా దాక్షారామపు) ఆవిర్భా వానికి సంబంధించిన ఒక ఆసక్తికరమైన అంశం భీమేశ్వర పురాణం లోని చతుర్థాశ్వాసంలో తెలుబడింది పురాణకథలో గాఢంగా అల్లుకు పోయిన యీ అంశాన్ని విశ్లేషించుకుంటే పంచారామాల చారిత్రకతను పరిశీలించటానికి వీలుకలుగుతుంది. ప్రథమతః దాక్షారామంలోని దైవం అసురులచే అర్పింపబడేదని యిందు వర్ణింపబడింది. వారి పూజలచే సంతుష్టి చెందిన ఆ దేవుడు వారికి అనశ్వరము, అత్యూ ర్జితము, అసాధారణమునైన నైశ్వర్యం బొసగగా వారు మదించి అసహ్య విక్రమోద్ధతితో సురులను, తదితరులను యిడుమల కుందిం పగా నపుడు సుర, మునులచే సంప్రార్థితుడైన మాహేశ్వరుడు వారిని సంరక్షింప నభయమొసగి, అసురుల నణచివేయ సంకల్పించెను. ఫలితముగా దేవాసుర సంగ్రామమేర్పడి సురులు, ఋషులు, వేదములు మున్నగునవి శివుని వెనుక నిలిచి దైత్యుల నెదిరించిరి. భయావహము, దారుణమునైన పాశుపతవహ్ని కీలలు దానవులనందర సమూలముగా దహించివైచెనట. అట్టి భీభత్సరంగమధ్యమున దైత్యుల "కుల దైవతంబై" నంతవరకు అర్చననందుచున్న మహాలింగ" మొకటి చెక్కుచెదరక దహింపబడక నిలిచియుండెనట.[6] అప్పుడు శివుడు "...యద్దివ్య లింగంబును బంచ బ్రహ్మ పంచాక్షరీ పంచతత్వభూత మయంబగుటంజేసి పంచ ఖండంబులుగా ఖండించి కృష్ణవేణీ మహానదీ తీరంబున ధరణాలకోటయను గ్రామంబున నమరేశ్వరుని చేతం బ్రతిష్ఠితంబగుటంజేసి యమరలింగంబు నా ప్రసిద్ధంబైన యమరా రామంబును, గౌతమీ తీరంబున దక్షిణకూలంబున గుణపూడి యను గ్రామంబున సోమునిచేతఁ బ్రతిష్ఠితంబు సేయంబడుటంజేసి సోమ లింగంబనఁ బ్రఖ్యాతంబైన సోమారామంబును, పాలకొటయను గ్రామంబున శ్రీరామచంద్రునిచేఁ బ్రతిష్ఠితంబగుటంజేసి రామలింగంబు నాఁ బ్రసిద్ధంబైన క్షీరారామంబును, చాళుక్యవంశ రాజధానియగు చాళుక్య భీమవర నామగ్రామంబునఁ గుమార రత్నంబైన కుమార స్వామిచేతం బ్రతిష్ఠితంబగుటం జేసి కుమార భీమలింగంబనఁ బ్రఖ్యా తంబు నొందిన భీమారామంబును, మొదలిపూమయగు దక్ష ప్రజాపతి యనికి పట్టయిన యారామంబగుట దక్షారామంబున శివసన్నిధానంబై దానుండునట్టుగా నీ ప్రకారంబున భోగమోక్షప్రదంబులైన పంచా రామంబులను బ్రతిష్ఠ నొందించి... " యనుగ్రహించెనట.[7]

పంచారామములను గూర్చి, వాటి ఆవిర్భావమును గూర్చి శ్రీనాధుని కాలమునాటికి ప్రాచుర్యముననున్న కధనమిది

ఈ గాథ నిస్సందేహముగా పురాణ కథతో సమ్మిళితమై యున్నను, వైదికావైదిక ధర్మముల మధ్య నేర్పడిన వైరమును గూర్చిన ఆసక్తిదాయకమగు అంశమిందు తెలుపబడుచున్నది ఒక "మహాలింగము" నర్చించెడి "అసురులు" వైదికమునకు వ్యతిరేక ముగా లోకమున అజేయశక్తితో విజృంభణ మొనర్చుచున్నపుడు, యీ గాథ ననుసరించి, వైదికమునకున్న ప్రధాన శక్తులన్నియు నొక్కుమ్మడి వారపైపడి వారిని సమూలముగా పెకలింప నుద్యమించి నట్లు గ్రహింపగలము. వైదికమతమున నెట్టి స్థానమునులేని గోగులమ్మ వంటి గ్రామదేవతలుకూడ యీ మహాయత్నమున చేయి కలిపి అవైదికమును పారద్రోలబూనుట ఆశ్చర్యదాయకమే![8]

అయినచో యిందు పేర్కొనబడిన, అవైదిక మతాను యాయులై చెలరేగిన వారెవ్వరనునది యీ పట్టున ఆసక్తికర మైన ప్రశ్న!?

వారిని ప్రస్తావించు అన్ని సందర్భములందును వారు అసురులుగనే పేర్కొనబడ్డారు. ఇది మనకు పురాణేతిహాసములందలి దైత్యులను స్మృతికి తెచ్చుట సహజమే అయినను యీ సందర్భముల మాత్రము వారిని అవైదికధర్మలైన బౌద్ధమతానుయాయులుగా గ్రహింపవచ్చునేమోయనునది పరిశీలింపదగినది. ప్రాచీనయుగమున వేదమతాచార పరాయణులు బౌద్ధులను 'రాక్షసులు'గా నిరసించి దూషించుట సాధారణమైనవిషయము బౌద్ధము నెడ వీరికిగల అసహనము, యేవగింపు మధ్యాంధ్ర యుగమునకూడ కొనసాగినట్లు చారిత్రకాధారములందు కొన్నిచోట్ల ఉదాహరణలున్నాయి. అవైదిక మతాచార పరాయణులైన బౌద్ధులను దైత్యులుగా చెప్పుట ఎట్లు సాగినదో కాకతి రుద్రుని మంత్రియైన గంగాధరుని కరీంనగర శాసనమందును,[9] బమ్మెర పోతనామాత్యుని ఆంధ్రమహాభాగవత ప్రథమస్కందమందును ద్యోతకము కాగలదు.[10]

ఇది ఆధారంగా పంచారామాలకు సంబంధించినంతవరకుకూడ యీ గాథలోని రాక్షస, దైత్య, అసురాది శబ్దాలన్నీ బౌద్ధులని అధిక్షేపించడానికి పేర్కొన్నవే అని గ్రహించటానికి అవకాశంవుంది. ఈ ఆరామములైదింటియందును ప్రతిష్ఠింపబడుటకు తరలింపబడిన లింగములు అంతదనుక అచ్చట బౌద్ధులర్చించెడి మహాస్తూపపు ఖండములేయని భావించుకోవచ్చు. ఈ ఉద్యమ రథసారథులుగా వేద ధర్మ ప్రతిష్ఠాపన కాధారభూతులైన అగస్త్య, వ్యాసులు; సప్తమర్షులు గణనీయమైన కృషి సలిపినట్లు పైగాథ పేర్కొంటోంది. కనుక నాటివరకు వైదిక వ్యతిరిక్తమైన ధర్మమే అచ్చట నెలకొనివున్నట్లు రూఢిగా తెలుస్తోంది; అది బౌద్ధమేతప్ప అన్యమగు అవకాశములేదు. అంతవరకు బౌద్ధు లర్చించుచున్న స్థూపమును ఖండించి దానిని దాక్షారామాది పంచారామములందును లింగప్రతిష్ఠాపన జరుపబడిన యనంతరముకూడ వారివారి మతవిశ్వాసముల యుద్ధరణకై బౌద్ధులకును, వైదికులకునుమధ్య యీప్రాంతమున తీవ్రమైన సంఘర్షణ జరిగినట్లున్నది.శైవమతాభినివేశము కలిగిన పాశుపత, కాలాముఖాది శైవశాఖలు యిచ్చటి బౌద్ధమును మొదలంట ఛేదింపబూనగా,స్వీయధర్మరక్షణకై బౌద్ధులును తమ శక్తులతో మోహరించియుందురు. పై ప్రబంధములోని అంశములనుబట్టి యీ ప్రాంతమున గోదావరి నీటికై జరిగిన కొన్ని కలహములకు కూడ యీ మత విద్వేషములు వేర్వేరుగ బలము కూర్చినవేమో యోచింపదగ్గది. శైవమతానుయాయులు కొందరు పావన గోదావరీ వాహినులను దాక్షారామము మీదుగా మళ్ళించి ప్రవహింపజేయుదుమని "ప్రతినపట్టి" అ కృషియందుండగ నా ప్రాంతములనున్న దైత్యములు వారితో తలపడి ప్రతిఘటించిరట, తరువాత తుల్యభాగుని మధ్యవర్తిత్వమున యిరు వర్గములును గోదావరి విషయమై యొక ఒడంబడిక చేసుకొనినట్లు తెలియుచున్నది.

శ్రీనాథ ప్రబంధములోని యీ పురాణగాథలోని పంచారామములకు సంబంధించిన అంశమును చరిత్ర కన్వయింప చేయుటకు ఆధారములు తక్కువే అయినను మహాస్తూప ఖండములను పంచారామములందు ప్రతిష్ఠించిరనుట, బౌద్ధ స్థావరములను శైవులాక్రమించిరనుట, శైవ బౌద్ధ వివాదమును యీ సందర్భమున కన్వయింప జూచుటలు కేవలము ఊహామాత్రమే అయినను; సమకాలీన సంప్రదాయమున బౌద్ధులను దైత్యులుగా నిరసించుట గ్రయున్నందున యివి యదార్థములగునేమో పరిశీలింపదగ్గది అవి వాస్తవములే అయినచో దాక్షారామాదులు మొదట ప్రముఖ బౌద్ధారామాలని, వారి ప్రాభవం సన్నగిల్లిన వేంగీ చాళుక్యయుగంలో వాటి శైథిల్యాలపై శైవం తలెత్తివుంటుందని భావించవచ్చు.

అధోజ్ఞాపికలు :

1 ఈస్టరన్ చాళుక్యన్ టెంపుల్స్ ఆఫ్ ఆంధ్రదేశ, పే. 2.
2. భారతి, 1968, జనవరి, పే 3.
3. యస్. ఐ. ఐ. సంపుటి 6, నెం. 665.
4. రెలిజియన్ యిన్ ఆంధ్ర, పే. 130.
5. శ్రీ భీమేశ్వర పురాణము, చతుర్థాశ్వాసం, ప. 112.
6. ,, ,, ప. 144.
7. ,, ,, ప. 151.
8. ,, ,, ప. 129.
9. ఇన్స్క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, కరీంనగరుజిల్లా, పే. 69.
10. ఆంధ్ర మహాభాగవతము, ప్రథమస్కందము, ప. 63.

డా॥ శివలెంక ప్రకాశరావు

విశ్వనాథవారి నవలలు - సాంఘిక దృక్పథం

వ్యక్తులజీవితాన్ని ఆధారంచేసుకొని సామాజిక జీవనవిధానాన్ని ప్రదర్శించే సాహిత్య ప్రక్రియలలో నవల ప్రముఖమైనది. కథావస్తువు పాత్రచిత్రణం, సన్నివేశపరికల్పనం, దేశకాలపరిస్థితులు అనే నాలుగు విషయాలనుబట్టి నవలా కారుడు మానవజీవితాన్ని పరితల మనోఫలకాలపై ముద్రిస్తాడు. ఈ సందర్భంలో రచయిత ప్రత్యక్ష పరోక్షపద్ధతులను ఆశ్రయిస్తాడు.

ప్రతిరచయితకూ కొన్నిదృఢమైన అభిప్రాయాలు ఉంటాయి. వాటిపై ఆనాటిసాంఘిక రాజకీయ మతపరిస్థితుల ప్రభావం పడుతుంది. పాత్ర సృష్టికి ఆ ప్రభావం చాలావరకు కారణమవుతుంది. విశ్వనాథ వారికి భారతీయ సంప్రదాయం ఒకరక్ష, వేదోపనిషత్తులు ప్రమాణాలు, సనాతనధర్మం అనుసరణీయమార్గం, వర్ణవ్యవస్థ రక్తగతం, కర్మ సిద్ధాంతం విధివ్రాత, మననాగరికత గౌరవప్రదం పాశ్చాత్యమైన ప్రతివిషయమూ ఎరువుసొమ్ము. యోగాది శాస్త్రవిషయాలు వరాలు హిందూమతం సర్వదేశాలకు శిరోధార్యం భక్తిజ్ఞాన వైరాగ్యాలతో కూడిన మనఆధ్యాత్మికత స్వర్గానికి నిచ్చెన. ఈ ప్రగాఢ విశ్వాసాలను ఆధారం చేసికొని సత్యనారాయణగారు ఎన్నోనవలలు రచించారు. వాటిలో తమ అభిప్రాయాలను స్పష్టంగా ప్రకటించారు తమసాంఘిక దృక్పథాన్ని ప్రదర్శించారు. ఆ విశేషాలను గమనిద్దాం.

ధర్మం

'సువ్యక్తమై యింద్రియాతీతమైన బుద్ధివిషయము ధర్మ' మని విశ్వనాథవారి నిర్వచనం. సనాతనధర్మ పరిరక్షణమే మనకర్తవ్యమని ఆయన ప్రబోధం

ధర్మానికి ఒకముఖ్య ప్రతీక 'వేయిపడగల'లోని ధర్మారావు పాత్ర. ఆతడు 'వర్ణాశ్రమ ధర్మములన్నిటికు ముద్దకట్టిన మూర్తి. భారతదేశముయొక్క ఆత్మ' ఆతడు ఉండే సుబ్బన్నపేట దేశానికంతటికీ ఒక చిహ్నం. భూమిని ఆదిశేషుడు వేయిపడగల మీద మోస్తున్నాడని పురాణం. సహస్రముఖంగాఉండే ధర్మంచేత భూమిపరిపాలింపబడడమే అది అని విశ్వనాథవారి అభిప్రాయం. సుబ్బన్నపేట గ్రామాధికారి పామునకు నాలుగు పడగలున్నట్లు కనుగొంటాడు. అది చాతుర్వర్ణ్య ధర్మం అరుంధతికి రెండుపడగలే కనిపిస్తాయి. అది దాంపత్యధర్మం. చివరకు ఒకేపడగ మిగులుతుంది. అంతా కలిసి ఏకరూపమైన ధర్మానికి అది ఒకసూచన.

ధర్మారావు తండ్రి రామేశ్వరశాస్త్రి నాలుగు వర్ణాలవారినీ పెళ్లి చేసుకుంటాడు. నాలుగు వేదాలకు నాలుగు వర్ణాలు సంకేతమని విశ్వనాథవారి అభిప్రాయం అన్ని వర్ణాలవారూ తమతమ వర్ణానుసారం తమతమ ఆచారాల ప్రకారం విధులను అనుసరించి వేదధర్మాన్ని పాలిస్తే సంఘం సువ్యవస్థితంగా ఉంటుందనీ, ధర్మం భద్రంగా వర్ధిల్లుతుందనీ ఆయన విశ్వాసం.

పైన భగవంతుడు క్రిందరాజూ, బ్రాహ్మణుడు ఈ రెంటికీమధ్య గణాచారి. ఇది నాల్గుస్తంభాలున్న ఒక ధర్మమంటపం. సుబ్రహ్మణ్య స్వామి, జమిందారు, బ్రాహ్మణుడు, గణాచారి- వీరు నలుగురూ ఆ మంటపానికి నాల్గుస్తంభాలు ఇది ఒక వ్యవస్థ. దీనినాధారం చేసుకొని ధర్మ పరిరక్షణ కర్తవ్యాన్ని ప్రబోధించారు విశ్వనాథవార.

'వేయిపడగల' నవలలో చిన్నాపెద్దా పాత్రలన్నీ ధర్మారావు చుట్టూ ప్రదక్షిణిస్తాయి. అంటే సర్వమానవకోటి ప్రవర్తనకూ 'న్యూక్లియస్' ధర్మం అనీ, అది నశిస్తే సర్వం శూన్యమవుతుందనీ ధ్వని.

కృష్ణమ నాయని కాలంలో నిర్వహింపబడిన ధర్మం తరువాతి రంగారావు హయాంలో వెనకబడింది. కలలోపాము రాజునుకాటువేయడం, ఒంటి తలతో కనబడడం ధర్మచ్యుతికి విశ్వనాథవారు చేసిన సూచనం. పాతకొత్తల సంధికాలంలో ఆంగ్లవిద్యాభ్యాసం, వ్యక్తిస్వాతంత్ర్యం, గౌరవం ప్రబలి పూర్వంనుంచి ఆచారంగా వస్తున్నధర్మం నశించి, జమీందారీ వ్యవస్థపోయినా పూర్వ ఆచారాలనూ, భేషజాలనూ వదులుకోలేక బ్రతికి చెడినవారు పడ్డతిప్పలకు అద్దంపట్టిన నవల 'వేయిపడగలు'.

కథాకథనంలో ఏదో ఒక సంఘర్షణద్వారా సదుపదేశం చేయడం ఒక శిల్పం. 'వేయిపడగల'లో ధర్మానికి అరిషడ్వర్గానికి మధ్య సంఘర్షణ కల్పించారు విశ్వనాథవారు. రుక్మిణమ్మారావు, సరో

ఊసిదేవి, రంగాజమ్మ పూర్వవ్యవస్థకు ఉదాహరణలు. హరప్ప, గోపన్న దేవదాసి పసిరిక, గణాచారి క్రొత్త వ్యవస్థలో బ్రతుకుతున్నా పాత వాసనలు చావనివారు. ఆధునికయుగంలో చివరిగా మిగిలినవారు ధర్మారావు, చిన్న అరుంధతి. ప్రకృతిచెడినా పురుషుడు చెడడని విశ్వనాథ వారి విశ్వాసం. ప్రకృతికి ప్రతీక అయిన అరుంధతి గతించినా ధర్మానికి మారుపేరైన పురుషుడు ధర్మారావు నిలిచినట్లు చిత్రీకరించడం అందుకే. కాల్పనికోద్యమ ప్రభావంకూడా పడిన 'వేయిపడగలు' లోని గుండేరు వరద కాలంమార్పును సూచించే ఒక ప్రతీక.

ఉపచేతనయొక్క నడవడిక, అసాధరణ నడవడికల విషయంలో దాని స్వరూపస్వభావాల్ని తెల్పడానికి మనోవిశ్లేషణ సిద్ధాంతం తోడ్పడుతుందని ఫ్రాయిడ్ వాదుల అభిప్రాయం. దీనిని ఆధారంచేసుకొని మన స్వసంఘర్షణకు లోనైన కొన్ని పాత్రలను సృష్టించారు విశ్వనాథవారు.

'ఏకవీర' నవల ధర్మాధర్మ సంఘర్షణలకు ఒక చిహ్నం. రాజవంశస్థుడైన కుట్టాన్ సాధారణ వనిత అయిన మీనాక్షినీ, సాధారణ కుటుంబీకుడైన వీరభూపతి ఐశ్వర్య వంతురాలైన ఏకవీరను ప్రేమించటం జరిగింది. కాని దైవవశాత్తు కుట్టాన్ ఏకవీరనూ, వీరభూపతి మీనాక్షిని వివాహమాడడంతో మానసిక సంఘర్షణ ఆరంభమౌతుంది. ఫలితంగా కుట్టాన్ మీనాక్షిని సోదరిగా భావిస్తాడు. వీరభూపతి సన్యాసి అవుతాడు. మీనాక్షి చనిపోతుంది. ఇది సాంఘిక ధర్మమైన వివాహానికీ మనోధర్మమైన ప్రేమకూ మధ్య జరిగిన సంఘర్షణకు ఒకచక్కని ఉదాహరణ.

అలాగే 'చెలియలికట్ట' నవల ధర్మాధర్మబద్ధ జీవితాలమధ్య ఏర్పడే సంఘర్షణకు నిదర్శనం. ఆ ధీర నాయకుడైన రంగారావు తన పదినగారైన రత్నాంగిని లేవదీసుకు పోతాడు. తనదోషానికి పశ్చాత్తపురాలై చివరకు రత్నాంగి ప్రాణాలు కోల్పోతుంది. ధర్మానికి ప్రతివ్యక్తీ కట్టుబడి ఉండాలి అనే విశ్వనాథవారి ధర్మసిద్ధాంతం రత్నాంగి మరణించేముందు తన సవతి రాజ్యలక్ష్మితో చెప్పిన మాటలలో ధ్వనిస్తుంది

అదేవిధంగా 'బద్దన్నసేనాని' నవలలో బద్దన్న చెలియలికట్ట లోని రంగారావులాంటివాడు బాదమ్మ రత్నాంగి వంటిది. అయితే బాదమ్మ తనముసలిభర్తతో పూర్తిగ తెగతెంపులు చేసుకొని బద్దన్నతో లేచిపోవడం కొంచెంగా ఇందులో రచయిత చేసినమార్పు చివరలో పశ్చాత్తప్తుడైన బద్దన్న అంబయ్యక్తికి బలి అవుతాడు, బాదమ్మ ఆత్మహత్య చేసుకుంటుంది. ఇక్కడ గూడా వ్యక్తులు ధర్మానికి తలవంచడమే కానవస్తుంది.

అలాగే 'మాబాబు'నవలలో యజమాని కుటుంబంకోసం సేవాధర్మం పాటించి తన సర్వస్వాన్నీ సుఖాన్నీ త్యాగంచేసిన స్వామి తనబడతాడు. ఇందులోగూడా స్వామి అధర్మ శృంగారానికి పాల్పడి ఇబ్బందులు పడతాడు, మాబాబు పాపమరది ఆస్తికోసం గడ్డిగాలిచి పాములవాడు చేసిన శాస్తితో పశ్చాత్తాపం చెందడం చివరకు లోక ధర్మానికి తలఒగ్గడం గోచరిస్తాయి.

అదేవిధంగా 'గంగూలీ ప్రేమకథ'లో గంగయ్య అధీరనాయకుడు. పెంచి పెద్దచేసి కూతురు 'బాల'నిచ్చి వివాహం జరిపించి ఆస్తి కంతకూ తనను వారసునిగా చేసిన నరహరికి ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేక పోయాడు. తనభార్యకు గురువైన భీమశంకరాన్ని శత్రువనుకొన్నాడు. రంగధామం వ్రాసిన ప్రేమలేఖ, పంపిన పుస్తకాలూ చూసి తనభార్యను రాచిరంపాన పెడతాడు. ప్రేమధర్మంగా, ధర్మం ప్రేమగా ఉన్నట్లు భ్రమగొల్పుతాయి. ఆ రెండింటి మధ్య ఊగిసలాడే వ్యక్తి సంఘర్షణకు ఉదాహరణ ప్రాయమైన గాధ 'గంగూలీ కథ'.

అలాగే 'జేబుదొంగ' నవలలో అవధాని ఒకవిచిత్రమైన జీవన ప్రవాహానికి ప్రతీక. జేబుదొంగగా మారి ఇంగ్లండులో ఐ. సి. యస్. చదివినా బుద్ధిమార్చుకోలేక పోయాడు అతడు. చివరకు జడ్జీగా అయినపుడు పశ్చాత్తాపపడతాడు. సీతతో ఉన్న అక్రమసంబంధం అతడిని మనస్సంక్షోభానికి గురిచేస్తుంది. ఇక్కడకూడా ధర్మాధర్మ సంఘర్షణమే కథను నడిపిస్తుంది.

అలాగే 'తెలుగిరాజు' నవలలో సారథిఅనే నటుడు వ్యక్తిగతమైన ధర్మానికి ప్రాముఖ్యంఇచ్చి మిత్రుడి కుమార్తెఅయిన వాసంతికి సంగీతనాట్యాలునేర్పి ఆమెపట్ల కామవాంఛాసక్తుడై ప్రవర్తించి ధర్మాధర్మాలకేర్పడిన మానసిక సంఘర్షణకు తట్టుకోలేక ఆమెను కిరీటికిచ్చి వివాహం చేస్తాడు కాని మళ్ళీ నాటకం ఆడే సమయంలో ఆమెకౌగిలిలో పూర్వానుభూతిని పొందుతాడు. చివరకు వారిద్దరూ ఆ మనోవ్యధకు తట్టుకోలేక కన్నుమూస్తారు.

ఈ విధంగా అధర్మానికి పాల్పడిన వ్యక్తులను విశ్వనాథవారు క్షమించరు. ఆ పాత్రలను ఏసోరకంగా తెరమరుగు చేస్తారు. ఎందుకంటే ధర్మపరిరక్షణమే అయన నవలలకు పరమావధి.

సంప్రదాయం

ధర్మానికి సంప్రదాయం ఒక కవచం లాంటిది వ్యక్తికీ,దేశానికీకూడా పరిస్థితులనుబట్టి సంప్రదాయం మారుతుందనడం సహజమైన విషయం. విశ్వనాథవారికి మన సంప్రదాయంమీద అంతులేని గౌరవం ఉంది

సంప్రదాయానికి వ్యతిరేకంగా ప్రవర్తించే వ్యక్తులకే ఇబ్బందులను స్పష్టంగా ప్రదర్శించే ఇతివృత్తమే 'చెలియలికట్ట' నవల. 'సముద్రానికి చెలియలికట్ట ఎట్టిదో జాతికి సంప్రదాయం అట్టిది దానికది హద్దు. దానిని అదిముట్టకోదు అందుకే 'చెలియలిని ముట్టుకొందురా' అనిప్రశ్న తల్లితో సమానమైన పదినను రంగారావు కౌగిలించుకోవడం జరిగింది. ఫలితంగా ఇద్దరూ నశించారు

'మనసు లోకపుహద్దులో విరుగున్ - కడలి చెలియలికట్టలో విరుగున్' ఇత్యాదిగాగల బైరాగిమాటలలో విశ్వనాథవారు జాతికిగల సంప్రదాయ ప్రాముఖ్యాన్ని ప్రకటించారు.

సంస్కారం కొత్తలో బాగా అనిపించినా, సంప్రదాయంలో ఉన్న భద్రతదానిలో లేదని ఆయన విశ్వాసం. రంగారావు స్నేహితులు రత్నాంగితో దురుసుగా ప్రవర్తించడం, సీతారామారావు భార్య ఆమె ఇచ్చిన పసుపు కుంకుమలను త్యజించడం ఇందుకు ఉదాహరణలు. (చెలియలికట్ట).

అలాగే 'వేయిపడగల'లో రాజుకువెయ్యితలలతో, భార్యాభర్తలకు రెండుతలలతో, సుబ్రహ్మణ్యస్వామి కనబడడం వారివారి సంప్రదాయాలను గుర్తుచేయడానికే. గణాచారి పూర్వాచారాలకూ, రత్నగిరి భరతశాస్త్రానికీ, పసరిక దేవమాతురలు ఆస్తిత్వబుద్ధి కలిగిస్తాయనగానికి, ఆరు-ధర పావిత్ర్యానికీ, రంగాజమ్మ పూర్వ సంప్రదాయాలకూ ప్రతినిధులు.

'స్వర్గానికి నిచ్చెనలు' అనే నవలలో ఆధ్యాత్మిక దృష్టికీ, ఆచారవ్యవహారాలచే నిబద్ధమైన సంప్రదాయానికీ మధ్య ఒక సంఘర్షణ చిత్రీకరించబడింది. వసుంధర తల్లి మేడమీద సంప్రదాయబద్ధురాలు. మేడదిగితే ఆమె సంఘంలో ఒక సాధారణ స్త్రీయే! కళాధరరావు సంప్రదాయానికి ద్వేషి అయినా మూఢనమ్మకాలను ఆధారం చేసుకొని జీవనోపాధిని కల్పించుకొన్నాడు. హరశాస్త్రికూడా సంప్రదాయపు గాదెకింద ఒక పందికొక్కే! ఈ నవలలో సంప్రదాయానికి చెందిన వ్యక్తుల భిన్నమనస్తత్వాలు గోచరిస్తాయి.

'జేబుదొంగ'లో అవధాని ఇంగ్లండు నుంచివచ్చి తనచెల్లెలు విమలను ఆమె భర్త ఎదుటే ముద్దుపెట్టుకోవడం, మరదళ్లు లలిత శారదలతో షికార్లుకొట్టి మోహపరచడం, మేనమామ కూతురు సీతతో అక్రమ సంబంధంపెట్టుకోవడం లాంటి విషయాలు మన సంప్రదాయ విరుద్ధాలు. అందుకే సాంప్రదాయానికి విఘాతం ఏర్పరచడం నచ్చని విశ్వనాథవారు ఆయాపాత్రలకు అధోగతేచూపించారు.

వర్ణ వ్యవస్థ

కృతయుగంలో అందరూ బ్రాహ్మణులేననీ, తరువాత రాను రాను ఈ సృష్టి మారుతూ వచ్చిందని విశ్వనాథవారి అభిప్రాయం. (పాతిపెట్టిన నాణెములు)

'వేయిపడగల'లో కామేశ్వరశాస్త్రికి నాలుగువర్ణాల వారినీ కట్టబెట్టడం, గిరికనొక ఆధ్యాత్మికశక్తిగా, కులట అయిన మంగమ్మను యోగశక్తిగా చిత్రీకరించడం, బ్రాహ్మణుల తీరుతెన్నులను విమర్శించడం, 'స్వర్గానికి నిచ్చెనల' లో వసుంధర మొదటిభర్త వైదీకిగా, రెండోసంబంధం నియోగిగా చెప్పి శాఖాభేదం పాటించక పోవడం, వసుంధర సేవకుడిగా ఒక పంచముని ఏర్పరచి, అతడి చెల్లెలు 'శశి'ని కుండలినీ శక్తికి మారుపేరుగా తీర్చిదిద్దడం, దారిలో దొరికిన కులం తెలియనివాడైన 'గంగూలీ'ని ధనవంతుడు నరహరికి అల్లుడిగా చేయడం, 'మాబాబు'లో ఏకులంవాడో తెలియని వ్యక్తి కాపువారింటి యజమాని అయినట్లు చెప్పడం, 'వీరవల్లడు' అనే నవలలో ఒక పంచముడు దొరఆస్తిని కాపాడినట్లు ప్రదర్శించడంమొదలైన విషయాలు విశ్వనాథవారికి సర్వవ్యవస్థపట్ల ఉన్నఅభ్యుదయ దృక్పథానికి ప్రబల నిదర్శనాలు.

ప్రేమ

ప్రేమ ఒక ఉద్వేగం, ఒకకోరిక, మానసికమైన ఒకవిషయం. ఇది ఎన్నోవిధాలు. మాతృప్రేమ, సోదర ప్రేమ, మిత్రప్రేమ, బంధు ప్రేమ, భార్య మీదప్రేమ, పిల్లలమీద ప్రేమ. అలాగే ప్రేమ (1) ధర్మప్రేమ (2) మధురప్రేమ అని రెండు రకాలు. మొదటిదానికి ధర్మారావు - అరుంధతి (వేయిపడగలు) మధ్యగలప్రేమ, రెండోదానికి రత్నావళి (చెలియలికట్ట) ప్రేమ ఉదాహరణలు.

విశ్వనాథవారి నవలలో ప్రేమఅధికంగా విజృంభించి కామంగా మారిన పాత్రలు కొన్నికానవస్తాయి. 'చెలియలి కట్ట'లో రత్నావళి, 'బద్దన్న సేనాని'లో బాదమ్మ, 'వేయిపడగల'లో మంగమ్మ ఈ విషయానికి ఉదాహరణలు.

వివాహం

కుటుంబ జీవనానికి వివాహవ్యవస్థ ప్రథమసోపానం. పరిపూర్ణ సౌఖ్యానికి అది ఒక ప్రాతిపదిక విశ్వనాథవారు తమ నవలల్లో వివాహ వ్యవస్థనే సమర్థించారు. వివాహవ్యవస్థలోవున్న స్వస్థత, నిశ్చలత మరి దేనిలో లేవనివారి దృఢవిశ్వాసం. జన్మజన్మాంతర వాసనలచే భార్యాభర్తల మనసులు కలుస్తాయన్నది వారిగట్టి నమ్మకం 'వేయిపడగల'లో అరుంధతి చనిపోతూ చిన్న అరుంధతిని వివాహమాడమని తనభర్తను ఒప్పించడం వివాహవ్యవస్థ అనంతంగా కొనసాగించాలన్నదే తన స్పష్ట అభిప్రాయాన్ని విశ్వనాథవారు ప్రకటించడానికే.

వయస్సు

విశ్వనాథవారు వారి నవలల్లో నాయికా నాయకుల మధ్యగల వయోభేదాన్ని అంతగా పాటించినట్లు కనబడదు. 'చెలియలికట్ట'లో రత్నావళి చాలాచిన్నది 'బద్దన్న సేనాని'లో బద్దన్న ఇరవైఏళ్ళవాడు. బాదమ్మముప్పయిఏళ్ళది. 'తెఱచిరాజు'లో సారధికన్నా శిష్యురాలైన వాసంతి చాలా చిన్నది.

అంతేకాదు. విశ్వనాథవారు బాల్యవివాహాలను సమర్థించినట్లు గోచరిస్తుంది. 'వేయిపడగల'లో అరుంధతికీ, 'స్వర్గానికినిచ్చెనల'లో వసుంధరకీ చిన్నతనంలోనే పెళ్ళిళ్ళు అయాయి. పురుషుడు ఎన్ని పెళ్ళిళ్ళయినా చేసుకోవచ్చు ననడానికి 'చెలియలికట్ట'లో సీతారావయ్యకు మూడోపెళ్ళిచేశారు విశ్వనాథవారు.

ఈవిధంగా విశ్వనాథవారు సాంఘికంగా తాను నమ్మిన సిద్ధాంతాలను తు. చ. తప్పక తన నవలల్లోని పాత్రలను తీర్చిదిద్దడంలో ప్రతిబింబించారు, అనితర సాధ్యమైన ప్రతిభను ప్రకటించుకున్నారు.

అంతరంగ తరంగ స్వనం

శ్రీ ఆర్. చంద్రశేఖరశాస్త్రి

ఈ భూమండలపు ఉపరితల క్షేత్రంనిండా
నన్నెగరేస్తూ - పడదోస్తూ
మానస కాసారంలో వంచరిస్తున్న హంసను
జీవిత గమనాన్ని ప్రశ్నిస్తున్నాను.
రక్తనాళాల స్పందనలో ప్రవహించే దేహాన్ని
కల్లోల కవితా సుడిగుండాల మధ్య ముంచెత్తి
పొట్టల కూర్పరిలా నిల్పమంటున్నాను.
ఎడతెగని ఆలోచనలు వర్షిస్తున్న -
జ్ఞాపకాల వెల్లువను మోస్తూ
మౌన మహాసముద్రాల్ని ఈదుతూ
పాటల పిపాసకున్నై -
పాడేస్వరాన్ని కొలుస్తున్నాను.
నా పిడికిలిలో ఒదుగక
ఏ ఋతువుల శోభకు అందకుండా
ఒక లాసికై - ఒక వేణువై - ఒక గీతికై
భ్రమిస్తున్న ఈ హంస
నా అంతరంగ తరంగ స్వనం.

మానవతా యుగంలో..

శ్రీ దుగ్గిరాల వెంకట్రావ్

దోసిళ్ళతో........
కొళాయి నీళ్ళు....తాగుతున్నప్పుడు
గురుతు కొచ్చేవన్నీ........
చిన్ననాటి........జ్ఞాపకాలే !
కాంక్షలతో........
హృదయం....పరవశిస్తున్నప్పుడు,
వికసించేవన్నీ....
తీరని....కోరికలే !
సంశయములో,....
అనుభవాలన్నీ....భారమై పోతున్నప్పుడు
ఏకాంతముగా దరిచేరేవి....
విడిపోని....చీకటులే.
స్వార్థంలో........
మనిషిని....చుట్టుకునే,
ఈ బంధాలన్నీ........
మానవత్వానికి....పూసే పూవులు.

శ్రీ ఎన్. వేణుగోపాల్

చారిత్రక అవసరంగా విప్లవోద్యమ కవిత

తెలుగు విప్లవ కవిత ప్రారంభ దినాలు – ఒక పరిశీలన

"చరిత్రనుంచి నేర్చుకోవడం ఎప్పుడూ మామూలు ఏకపక్ష క్రమం కాదు. గతం వెలుగులో వర్తమానం గురించి తెలుసుకోవడం అంటే వర్తమానం వెలుగులో గతాన్ని గురించి తెలుసుకోవడం కూడ అవుతుంది. గతానికీ వర్తమానానికీ మధ్య ఉన్న ఈ అంతస్సంబంధం ద్వారా గతం గురించీ, వర్తమానం గురించీ కూడ మరింత లోతయిన అవగాహనను కల్పించడమే చరిత్ర కర్తవ్యం." —ఇ. ఎచ్. కార్[1]

"ఈ మహోజ్వల వీర శ్రీకాకుళము పేర
లిఖియించు చరితకు నిర్మాత ఎవరన్న
నేటి విప్లవకవుల కావ్యాలు వినిపించి
సత్యమును పూర్తిగా తెలుసుకోనివ్వాలి"

—ఒక అజ్ఞాత కవి[2]

వర్తమాన తెలుగు కవిత్వం, తెలుగు సమాజం ఒక అవిచ్ఛిన్న చారిత్రక ధారలో ఒక క్రమ పరిణామంలో ప్రస్తుతదశకు చేరుకుని ఉన్నాయి. ఇవాళ్టి స్థితి యాదృచ్ఛికంగా, హఠాత్తుగా ఏర్పడినది కాదని, ఒక క్రమ పరిణామ ఫలితమని గుర్తించినప్పుడు, ఈ స్థితికి కారణాలను గతంలోనే వెతకవలసి ఉంటుంది ఇవాళ తెలుగు కవిత్వం ప్రధానంగా సామాజిక నేపథ్యం నుంచే వెలువడుతోంది. సామాజిక దౌష్ట్యాన్ని వివరించడంగాని, ఆ దురన్యాయాన్ని మార్చవలసిన అవసరాన్ని ప్రకటించడంగాని, ఆ సామాజిక మార్పుకోసం జరుగుతున్న కృషిని కీర్తించడంగాని, ఆ కృషిలో భాగం పంచుకునే సంసిద్ధతను కనబరచడంగాని ఇవాళ్టి తెలుగు కవితకు ప్రధాన స్వభావంగా ఉంది. వస్తువులోనూ, శిల్పంలోనూ కూడ ఈ స్వభావం ప్రస్ఫుటమవుతోంది సామాజిక సమస్యలతో సంబంధం లేకుండా ఊహాలోకాలలోనుంచి రాస్తున్న కవిత్వం ఇప్పుడు రాశిలో కూడ నిర్లక్ష్యం చేయదగినంత తక్కువ స్థాయిలోనే వస్తోంది. ఛాందసులుగా, వ్యక్తివాదులుగా, భోగలాలసత ప్రధానంగా కలవారుగా, అభివృద్ధి నిరోధకులుగా లోకానికి తెలిసిన కవులు కూడ ప్రస్తుతం సామాజిక చింతనతో కవిత్వం రాస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. రాజకీయ రంగంలో సోషలిజం యుగస్వభావంగా మారిన స్థితిలో సోషలిస్టు వ్యతిరేకులు కూడ మాటల్లో సోషలిజాన్ని వల్లిస్తున్నట్టు, తెలుగు కవిత్వసీమలో సమాజాన్ని పట్టించుకోని కవులు, సామాజిక విప్లవానికి వ్యతిరేకులయిన కవులు కూడ ఏదో ఒక స్థాయిలో విప్లవ కవిత్వం రాయడానికి సిద్ధపడుతున్నారు. విప్లవ పదజాలాన్ని, విప్లవ కవిత్వం ప్రచారంలోకి తెచ్చిన పదచిత్రాలను విరివిగా వాడుకుంటున్నారు. సామాజిక స్పృహ ఉన్నదనే ఆభాస కలిగించే వస్తువులను ఎంచుకుంటున్నారు తెలుగు కవిత్వంలో విప్లవం ఒక ప్రబలమైన, అవిభాజ్యమైన వస్తువుగా మారిందనడానికి ఇది బలమైన సూచిక.

ఈ విధంగా తెలుగు కవిత మొత్తాన్ని ప్రజాజీవనం దగ్గరికి, ప్రజా ఆకాంక్షలవైపుకి, ప్రజల దైనందిన జీవన్మరణ సంఘర్షణలలోకి, వాళ్ళ పోరాటాలలోకి నడిపించుకు వచ్చిన అసాధారణమైన శక్తి శ్రీకాకుళ విప్లవోద్యమం శ్రీకాకుళ విప్లవోద్యమం తెలుగు సమాజాన్ని మొత్తంగానే సమ్మోహనంచ మెలికల్ని కొత్త వెలుగులను ప్రజల ముందు పరిచింది. ఆ క్రమంలోనే అది తెలుగు సాహిత్యం మొత్తాన్ని ఒక కుదుపు కుదిపి గుణాత్మకంగా మార్చివేసింది. మిగిలిన ప్రక్రియలకంటె ఎక్కువ ఉద్వేగపూరితమైన ప్రక్రియగా కవిత్వం ఈ మార్పుకు ఎక్కువగా గురైంది. ఆ గుణాత్మక మార్పు జరిగి రెండు దశాబ్దాలు గడిచిన తర్వాత ఇవాళ ఆ మార్పు క్రమాన్ని, ఆ మార్పుకు మూలాన్ని, ఆ మార్పు ఫలితాలను అర్థం చేసుకోవడం అవసరమూ, ఉపయోగకరమూ కూడ.

తెలుగు విప్లవోద్యమ కవిత్వం ప్రారంభ దినాల్ని అవగాహన చేసుకోవాలంటే అది అనుభవించిన పురుటినొప్పుల్ని కూడ అవగాహన చేసుకోవాలి దానికి పునాదిగా ఉన్న సామాజిక నేపథ్యాన్ని అర్థం చేసుకోవాలి ఆ ప్రారంభదినాల కవిత్వాన్ని వివరంగా పరిశీలించాలి. ఇవాళ యవ్వనంలోకి ప్రవేశించిన తెలుగు విప్లవ కవిత్వానికి ఆ ప్రారంభదినాలు ఏ లక్షణాల్ని సంక్రమింపజేశాయో అర్థం చేసుకోవాలి.

అందువల్ల ఈ పరిశీలనా వ్యాసం మొట్టమొదట శ్రీకాకుళ విప్లవోద్యమానికి ముందు ఉన్న తెలుగు కవిత్వస్థితినీ, సమాజ స్థితినీ

సమీక్షిస్తుంది. ఈ స్థితిలోనుంచి శ్రీకాకుళ విప్లవోద్యమం దాన్ని వెన్నంటి కవిత్వం ఎంత సహజంగా, ఎంత అనివార్యంగా ప్రజ్వరిల్ల వలసి వచ్చిందో వివరిస్తుంది.

శ్రీకాకుళ విప్లవోద్యమ చరిత్రను, దానికి ఒక ప్రతీకగా, ఒక ప్రేరణగా బలోపేతం కాగల శక్తి వచ్చిన రెండో భాగం వివరిస్తుంది. సమాజ సాహిత్య సంబంధాలను స్పష్టపరచేందుకుగాను శ్రీకాకుళ విప్లవోద్యమాన్ని వివరంగా చర్చించి దానినుంచి ఎటువంటి కవిత్వం వెలువడడానికి భూమిక ఉన్నదో చూపుతుంది.

శ్రీకాకుళ విప్లవోద్యమం అనే సామాజిక ప్రేరణ కేవలం ఆ భౌగోళిక ప్రాంతంలోని సాహిత్యానికీ, సంస్కృతికీ మాత్రమేగాక రాష్ట్రవ్యాప్తంగానే ఒక బలమైన సంఘటితే సాహిత్య, కళా, సంస్కృతుల కృషికి ఎట్లా కారణమయిందో, ప్రత్యేకంగా కవిత్వానికి ఆ సామాజిక ప్రేరణ ఏ కానుకలను అందించిందో మూడో భాగం వివరిస్తుంది.

శ్రీకాకుళ విప్లవోద్యమపు తక్షణ ప్రభావం, కవిత్వంలో దాని ఫలితాలు ఏ దీర్ఘకాలికమైన ప్రబలమైన పరిణామాలకు కారణ మయ్యాయో నాలుగో భాగం చర్చిస్తుంది. ఇవాళ్టి విప్లవకవిత్వం సంత రించుకున్న లక్షణాలకు ఆ ప్రారంభ దినాల కవిత్వం చేసిన దోహదాన్ని ఈ భాగం అంచనా కడుతుంది.

నాలుగు భాగాలుగా సాగే ఈ పరిశీలనా వ్యాసపు పరిధి ఇది.

శ్రీకాకుళ విప్లవోద్యమాన్ని, విప్లవోద్యమ కవిత్వాన్ని నిరంతర పరిణామశీలమైన, ఇవాళ్టికీ సృజనాత్మకంగా అభివృద్ధి చెందుచున్న క్రమంగా గుర్తిస్తూనే, పరిశీలనా సౌలభ్యందృష్ట్యా ఈ అధ్యయనాన్ని 1972 తో ముగించడం జరిగింది. 1972 ఆ విప్లవోద్యమానికి గాని, విప్లవ కవిత్వానికి గాని ఎంతమాత్రమూ ముగింపు కాదు. ఇది ఈ పరిశీలనకు పెట్టుకున్న కాలపరిమితి.

* * *

శ్రీకాకుళ విప్లవోద్యమం ప్రజ్వరిల్లడానికి ముందు తెలుగు సీమలో నెలకొని ఉన్న సామాజిక స్థితి ఏమిటి? ఏ సామాజిక పూర్వ రంగం శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాటాన్ని అనివార్యం చేసింది?

శ్రీకాకుళ పోరాటం కంటె ముందు తెలుగునేలమీద సాగిన మహోజ్వల పోరాటం తెలంగాణ విమోచనోద్యమం, 1946 లో ప్రారంభమైన ఆ ప్రజాపోరాటం 1951 నాటికి మూడువేల గ్రామా లను భూస్వామ్య దోపిడీ పీడనలనుంచి విముక్తం చేసింది పదిలక్షల ఎకరాల భూమిని ప్రజలకు పంచిపెట్టింది. అంతిమ సారాంశంలో నిజమైన భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంగా తెలంగాణ విమోచనోద్యమం అంచెలు అంచెలుగా ఎదుగుతూ వచ్చింది. ప్రజలు తమ ప్రాణాలు బలిపెట్టి ఈ విజయాలు సాధించారు. నాలుగు వేలమంది కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, రైతాంగ కార్యకర్తలు ఆ పోరాటంలో ప్రాణత్యాగం చేశారు. లక్షలాదిమంది ప్రజలు రాజ్యాంగయంత్రం చేతుల్లో చిత్రహింస అనుభవించారు. ప్రజలకు చెందిన కోట్లాది రూపాయల ఆస్తిని భూస్వామ్యశక్తులు, పోలీసులు కొల్లగొట్టారు, ధ్వంసం చేశారు. ఇంత కంటకావృత మార్గంలోనయినా ముందుకే సాగుతున్న ప్రజల్ని అప్పటి కమ్యూనిస్టుపార్టీ నాయకత్వం తన భ్రమలకు ఎరజేసింది. కనీసం సాధించిన విజయాల పరిరక్షణ అయినా జరగకుండా 1951 అక్టోబర్ 21 న పోరాటాన్ని విరమిస్తు న్నట్లు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం ప్రకటించింది. ఆ రకంగా తెలుగునేల మీద ప్రజా ఆకాంక్షలు ద్రోహానికి గురయి నిరాశలోనికో, అజ్ఞాతంలోనికో వెళ్ళిపోగా, కమ్యూనిస్టుపార్టీ పార్లమెంటరీ రాజకీయాల లోకి ప్రవేశించింది. ఆంధ్ర రాష్ట్రంలో 1955లో జరిగిన మధ్యంతర ఎన్నికలలో పరాజయంతో కమ్యూనిస్టు పార్టీ పూర్తిగా జీవచ్ఛవమై పోయింది. లక్ష్యాన్నీ, మార్గాన్నీ కూడ మరచిపోయి, సామాజిక పరిణామానికి నాయకత్వం వహించగల శక్తిని కోల్పోయింది. మరో వైపు ఇదే సమయంలో జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు సామాజిక చైతన్యంమీద, ప్రగతిశీల శక్తులమీద చీకటితెరను కప్పు తున్నాయి.

జవహర్‌లాల్ నెహ్రూ ప్రవచించిన సోషలిజం, ప్రవేశపెట్టిన ప్రణాళికాబద్ధ ఆర్థికాభివృద్ధి వ్యూహం ఎందరో ప్రగతికాముకుల్ని భ్రమల్లో ముంచెత్తాయి. సోవియట్ రష్యా అధినేత, ప్రపంచ విప్లవోద్యమ నాయకుడు స్టాలిన్ మరణం తర్వాత ఆ ప్రపంచ విప్లవ కేంద్రం మళ్ళీ సామాజిక తిరోగామి శక్తుల చేతుల్లో పడింది. 1956 లో జరిగిన సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ ఇర వయ్యవ మహాసభ ఈ తిరోగామి శక్తుల విజయాన్ని స్థిరీకరించింది. ప్రపంచవ్యాప్తంగా ప్రగతిశీల దృక్పథాన్ని చీకటి కాటుకు బలి చేయ డానికి ప్రయత్నించింది.

సామాజిక పరిణామానికి నాయకత్వం వహించవలసిన శక్తులు, సాధించవలసిన ఉద్యమాలు ఈ విధంగా వెనుకడుగు పట్టగా, అసలు సమాజంలోనే సంక్షోభం తీవ్రతరం కావడం మొదలయింది. రెండో ప్రపంచయుద్ధ ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో అవాంఛనీయ, ప్రజావ్యతిరేక పరిణామాలు తలెత్తాయి భారతదేశం వంటి సుభిక్షాలమైన, అత్యధిక జనాభా కలిగిన, అనేక వనరులు కలిగిన దేశానికి ఏ ఆర్థిక, రాజకీయ విధానాలు ఉపయోగకరమైనవో అన్వేషించే కృషి జరగలేదు. ప్రణాళికల రచనలో దీర్ఘకాలికమైన, సమగ్రమైన ప్రయోజన లక్ష్యం కనబడలేదు.

ఈ కారణాలన్నీ కలగలిసి 1950 ల మధ్యనుంచి దాదాపు ఒక దశాబ్దంపాటు ప్రపంచవ్యాప్తంగానూ, దేశంలోనూ, రాష్ట్రం లోనూ సకల సామాజిక రంగాలలో స్తబ్ధత వ్యాపించింది. కళా సాహిత్యరంగాలు ఈ స్తబ్ధతను చాల ఎక్కువగా అనుభవించాయి.

ఈ స్తబ్ధత గర్భంలోనుంచే స్తబ్ధతను బద్దలు గొట్టవలసిన అవసరం రూపుదాల్చింది. ఆంధ్రదేశం పరిస్థితిని పరిశీలిస్తే 1947 తర్వాతి పరిణామాలలో మొత్తంమీద అక్షరాస్యతాశాతం గణనీయంగా పెరగకపోయినా 1950 ల చివరినుంచి ఒక కొత్త విద్యావంతుల వర్గం ఉనికిలోకి రావడం మొదలయింది. స్వాతంత్ర్యం, భాషా రాష్ట్రం ఏర్పాటు, సోషలిస్టు తరహా అభివృద్ధివంటి ఆలోచనలవల్ల తెలుగుభాషా సంస్కృతులపట్ల, ప్రగతిశీల భావాలపట్ల గౌరవం ఇనుమడించింది. మౌలికంగా కొత్త ఆలోచనలు గల చిన్న చిన్న బృందాలు అంతకంతకూ ఎక్కువగా విశ్వవిద్యాలయాలనుంచి బైటపడి నిరుద్యోగ సైన్యంలోనో, అసంతృప్తికరమైన ఉద్యోగాలలోనో చేరడం మొదలయింది.

నిజానికి ఇట్లా వెలువడుతున్న ప్రగతిశీలమైన, చైతన్యవంతమైన నవయువరక్తాన్ని సామాజిక ఉద్యమం తనలో సంలీనం చేసుకొని ఉండవలసింది. తద్వారా ఈ నూతన ఆలోచనలు ఉద్యమ వ్యక్తీకరణలుగా సామాజిక చైతన్యరూపాలను పొంది సామాజిక పురోగమనానికి తోడ్పడగలిగే అవకాశం వచ్చేది. కాని సామాజిక ఉద్యమమేదీ లేని స్థితిలో, ఉద్యమానికి నాయకత్వం వహించవలసిన శక్తులు, శాస్త్రీయ దృక్పథాన్ని అందించవలసిన శక్తులు ప్రజా బాహుళ్యంనుంచి దూరమై పార్లమెంటరీ రాజకీయాలలో కూరుకుపోయి ఉన్న స్థితిలో ఈ యువశక్తి చిన్నాభిన్నమైపోయింది. సామాజిక సంస్థలన్నీ దిగజారుతున్నప్పుడు, సమాజ చలనమే స్తబ్ధతకు గురయి ఉన్నప్పుడు సామాజిక చైతన్యరూపాలను నిలబెట్టడమే, మార్చడమే వాటికవిగా ఉద్యమాలు కాగలవనే తప్పుడు అవగాహన ప్రబలింది. పునాది పోరాటమే అదృశ్యమయిన సమయాన, అతి స్వల్ప స్థాయిలో సాగుతున్న సమయాన, ఉపరితలంలో స్వతంత్రంగా పోరాటం చేయవచ్చునేమోననే భ్రమలు తలెత్తాయి. నిరాశ చిత్రవిచిత్ర రూపాలలో వ్యక్తమయింది. రచనను దాని సామాజిక పునాదినుంచి విడదీసి దానికదిగా ఉద్యమంగా చూడడం మొదలయింది. చివరికి ఒక ప్రక్రియగా వచనకవిత కూడ ఉద్యమరూపం ధరించేంతవరకు ఈ ధోరణి సాగింది.

ఇట్లా సమాజం గుణాత్మక మార్పుకు సిద్ధమై ఉండగా. ఆ మార్పుకు నాయకత్వం వహించవలసిన శక్తులు స్తబ్ధతలో మునిగిఉన్న స్థితి కవిత్వంలో చిత్రణ పొందింది. ఈ స్తబ్ధతను, దానినుంచి బైటపడడానికి జరిగిన పెనుగులాటను కవిత్వం ప్రతిఫలించింది.

"అందరూ నిద్రపోతున్నారు
అలసి నిత్య జీవితంలో సొలసి సుషుప్తి బంధాల
అలవాటునీ, అస్వతంత్రతనీ కావలించుకున్నారు
అధైర్యంతో తమలో తాము ముడుచుకుపోయి పడుకున్నారు
అనంత చైతన్యోత్సాహాహ్వానాన్ని వినిపించుకోలేకపోయారు"[3] అనీ,

"రైలింగ్ అవతల టిక్కెట్టు దొరక్క ప్రజలు దిగాలుపడి
నుంచున్నారు
రేపటి ఉదయానికి వేసిన పట్టాల్ని ఎవరో తొలగించివేశారు"[4] అనీ,

"మనస్సెప్పుడో మొద్దుబారి మనుగడ పడికట్ల మరమేకుల్లో దిగబడి
మూల్గి మూల్గి మూల్గునే సంగీతం అని మురిసిపోతోంది
ఎవరూ చూడడంలేదు క్షితిజరేఖ వెనుక నిలచి పిలిచే రత్నకంకణ
హస్తాన్ని
ఎవరూ వినడంలేదు నిద్రకి మెలకువకి మధ్య ఒక క్షణం మ్రోగిన
జంత్రసంగీతాన్ని[5]"

అనీ దేవరకొండ బాలగంగాధర తిలక్ ఆ కాలపు సామాజిక స్థితిని బహుళా అసంకల్పితంగానే ప్రతిఫలించాడు.

"ఇది నల్లని తెల్లని రాత్రి
ఇది తెల్లని నల్లని రాత్రి
ఇక లేదు ఉషఃప్రసక్తి ఇది అనంత చరమరాత్రి
ఇది స్మశానశాంతి ఆవహించిన రహస్యరాత్రి"[6] అనేంత

గాఢమైన నిరాశను కలిగించిందీ స్తబ్దతాకాలం.

"పద నేస్తం తలవొంచుకు వెళిపోదాం
ఏవేవో ఊహిస్తాం అంతా మన చాదస్తం
లోకపు కీకారణ్యంలో నడుస్తున్న
చీకటి బాటసారులం మనం
... ...
పద నేస్తం తలవొంచుకు వెళిపోదాం
మన గమ్యం మన తీరం మృత్యువు
ఈ లోకం మన పాలిటి శత్రువు"[7] అనే విషాదభరిత

పలాయనతత్వాన్ని ఆ కాలపు కవిత చిత్రించింది ఇది సామాజిక విలువలన్నిటి నిరాకరణగా, కసిగా, ఉక్రోషంగా కూడ వ్యక్తమయింది. ఒంటరితనాన్ని కీర్తించడం ప్రారంభమైంది.

"జీవితాన్ని నిర్వచించకు
దోసిట్నిండా నింపబడిన ఈ జీవితాన్ని గటగటా తాగెయ్యనియ్యి
బ్రతుకు గురించి పాడకు
రక్తంతో కన్నీళ్ళతో ఈ హృదయం ఎప్పుడో గడ్డకట్టుకుపోయింది"[8]

"ఎవడి కన్నీళ్ళు
వాడి సొంత ఆస్తి"[9]

"ఈ ధోరణులన్నిటికీ సమకాలీన సామాజిక దుస్థితే పునాది అన్న మాట నిజమేగాని, దాన్ని తొలగించే సంఘటితకృషికి, కనీసం చైతన్యజ్వాలను కొడిగట్టిపోకుండా నిలుపుకునే స్ఫూర్తికి పిలుపిచ్చే బదులు, నాయకత్వం వహించగల శక్తి ఉన్నవాళ్ళందరూ మౌనానికో, ప్రయోగవాదానికో, రూపవాదానికో, అనిర్దిష్ట మానవతా వాదానికో, ఇజాల వ్యతిరేకత పేరుమీద కమ్యూనిస్టు వ్యతిరేకతకో బలయిపోయారు. ఈ పతనానికి పరాకాష్టగానే ఆరుద్ర "అభ్యుదయ కవుల ధర్మమా అని వర్గచైతన్యం గురించి పాడితేనే తప్ప మిగతాది కవిత్వం కాదేమోనన్న అపోహ ఆంధ్రదేశంలో అనవసరంగా ఊపిరి పీలుస్తోంది"[10] అన్నాడు.

ఐతే ఆ కాలంలోనైనా భవిష్యదాశ పూర్తిగా నశించిపోయిందని, ఉదయాన్ని దర్శించే ప్రయత్నాలు ఏంతమాత్రమూ జరగలేదని చెప్పడానికి వీల్లేదు.

"ఆ నిశిలో
కవి గదిలో
దీపం వెలుగుతోంది
కవి కలం ఏం చేస్తూందో
ఎవరికి తెలుసు! నాకు తప్ప
అది - రాసిన గీతంలో
తప్పులు దిద్దుతోంది
భవిష్యత్తు కోసం
సుందర స్వప్నాన్ని రచించాలని
నానా యాతన పడుతోంది
కవి కళ్ళు - చిక్కని చీకట్లో
ఆశకోస మన్వేషిస్తున్నాయి,
అవును మళ్ళీ అంటున్నాను
ఆశ కోసం అన్వేషిస్తున్నాయి"[11] ఔను. ఆ దశాబ్దం

పూర్తిగా చిక్కని చీకటి నిండిన దశాబ్దం మాత్రమే కాదు. ఆశ కోసం అన్వేషించిన దశాబ్దం కూడ ఈ శతాబ్దంలోని గొప్ప సృజనాత్మక దశాబ్దాలలో అది ఒకటి. ఆ దశాబ్దంలోనే ప్రపంచవ్యాప్తంగా జన చైతన్య విస్ఫోటనం ప్రారంభమైంది. చైనాలో మహత్తర శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవం, ఆగ్నేయాసియాలో విప్లవోద్యమాల విజృంభణ, ఆఫ్రికాలో ఉధృతమైన జాతీయ విముక్తి, వలస వ్యతిరేక ఉద్యమాల వెల్లువ, అమెరికాలో బ్లాక్ పాంథర్స్, మధ్య అమెరికాలో, లాటిన్ అమెరికాలో విముక్తి ఉద్యమాలు, వియత్నాం యుద్ధ వ్యతిరేక ఉద్యమం, యూరప్‌లోను, అమెరికాలోను యుద్ధ వ్యతిరేక, వాతావరణ పరిరక్షణ, మహిళా విమోచన ఉద్యమాలు చెలరేగింది ఆ దశాబ్దంలోనే. మన దేశంలో నక్సల్బరీ నిప్పురవ్వ రగులుకొన్నదీ, శ్రీకాకుళం దావానలమై చెలరేగిందీ ఆ దశాబ్దంలోనే.

1966 నాటికి ప్రపంచ సామాజిక చలనంలో మొదలయిన, మొదలవుతున్న ఈ పెనుమార్పులు ప్రత్యక్షంగా తెలుగు కవితకు తెలియకపోయినా, తిరుగుబాటు యుగస్వభావమయినవేళ తెలుగుకవిత కూడ స్తబ్దతను చీల్చే ప్రయత్నం చేసింది. చీకటిపట్ల, నిర్వ్యాపారం పట్ల, స్తబ్దతపట్ల, తక్షణం వెలువడే ప్రతిచర్యలు రెండు రకాలుగా ఉంటాయి అవి విషాదంగాను, నిరాశగాను, నిస్సహాయంగాను బయట పడవచ్చు లేదా అసహనంగా, నిరసనగా, కసిగా, అసహాయ ఉద్రేకంగా వెలువడవచ్చు. ఈ రెండురకాల తక్షణ ప్రతిస్పందనలలో మొదటిది అంతిమంగా పలాయన వాదంలోకి, అభివృద్ధి నిరోధకతలోకి, నిష్క్రియాపరత్వాన్ని ఆరాధించడంలోకి దిగజారుతుంది రెండోది ఎవరిమీద, ఎందుకు, ఏ పద్ధతిలో నిరసనను, కసిని వ్యక్తం చేయాలో గుర్తిస్తే సామాజిక పరిణామం గురించి శాస్త్రీయ అవగాహనగా ఎదుగుతుంది.

'రాత్రి' సంకలనంలో ఒకరిద్దరు, 'విషాద భారతం' కావ్యంలో, 'కారు చీకటిలో కాంతిరేఖ' కవితా సంపుటంలో సి. విజయలక్ష్మి, ఆ కాలంలోనే తమ జీవధాతువుల్ని కాపాడుకోవడానికి తీవ్ర ప్రయత్నం చేసిన మరి ఒకరిద్దరు కవులు ప్రకటించిన అసహనాన్నే మరింత పెద్ద ఎత్తున, ఒక షాక్ ట్రీట్‌మెంట్‌లాగ దిగంబర కవులు ప్రకటించారు. దిగంబర కవులు రంగప్రవేశం ఒక చారిత్రక అవసరాన్ని అసమగ్రంగానే తీర్చగలిగింది. సామాజిక పరిణామం ఒక కూడలికి చేరి, మార్గాన్వేషణ ఒక అనివార్య చారిత్రక కర్తవ్యమయినవేళ దిగంబర కవులు మార్గాలన్నిటినీ ధ్వంసం చేస్తూ ముందుకు వచ్చారు. వాళ్ళు సామాజిక బాధ్యతలోని విమర్శ భాగాన్ని చాల సమర్థంగా నిర్వహించి, విప్లవ భాగాన్ని విస్మరించారు. విధ్వంసాన్ని సరిగా గుర్తించి, ఆచరించి, పునర్నిర్మాణాన్ని అలక్ష్యం చేశారు.

"ఎప్పటికీ మనం తిరగబడలేం కాబట్టి
ఎప్పటికీ మనకి తిరగబడడం చేతకాదు కాబట్టి
మన రక్తంనిండా కులాల మతాల మూత్రం ప్రవహిస్తున్నది కాబట్టి
మనం పిరికి కుక్కలం పందులం కాబట్టి
మన జీవితాల్ని శాశ్వతంగా కొనేసి పరిపాలిస్తున్న
రకరకాల కుష్టు దేవుళ్ళని కొలవడానికి అంకితమవుదాం"[12] వంటి

నిస్సహాయ ఉద్రేకాన్ని ప్రదర్శించడం దిగంబర కవితలో ప్రధాన లక్షణం. ఆనాటి సామాజిక స్థితిలో ఇది న్యాయమైన ఆగ్రహమే కావచ్చు కాని కోపాన్ని ఎవరిమీదికి ఎక్కుపెట్టవలసి ఉన్నదో సక్రమంగా తెలియనప్పుడు, ఎవరిమీద ఎవరిలో కోపం రగిలించాలో తెలియనప్పుడు ఈ విధంగా పెల్లుబకడం సహజమే.

అయితే దిగంబర కవులలో గుర్తించవలసిన అంశం ఇలాంటి సహజమైన మేధో స్పందనను వ్యక్తీకరించడం మాత్రమే కాదు. వాళ్ళు ఈ వ్యక్తీకరణను చాల శక్తివంతంగా, విద్యుద్ఘాత సమానమైన సంచలనంతో ముందుకు తెచ్చారు తెలుగు కవిత్వ చరిత్రలో వాళ్ళను, అన్నిటికన్న ముఖ్యంగా, వాళ్ళు ప్రారంభించిన, లేదా వాళ్ళు ప్రతిభావంతంగా వాడుకున్న సాంప్రదాయం కోసం గుర్తించాలి. వాళ్ళు ప్రధానంగా ప్రశ్నా సాంప్రదాయాన్ని, ధిక్కార స్వరాన్ని ఎత్తిపట్టారు. తద్వారా వాళ్ళు సృష్టించి పెట్టిన భూమిక తెలుగు కవితలో రానున్న మార్పుకు సమర్థమైన క్షేత్రంగా నిలిచింది. విప్లవోద్యమ కవిత్వ ప్రారంభానికి రంగం సిద్ధం చేసినవాళ్ళు దిగంబర కవులు అయితే అట్లని విప్లవకవిత దిగంబర కవితకు సరాసరి కొనసాగింపు కాదు. రెండిటి సామాజిక ప్రమేయాలు, తాత్విక దృక్పథాలు, ఉద్దేశించిన శ్రోతలు, చూపిన ప్రభావం పూర్తిగా భిన్నమైనవి. విప్లవకవిత కాలంలోనేగాక స్పష్టత, ప్రయోజనం, లక్ష్య శుద్ధి, ప్రమాణాలు వంటి అనేక అంశాలలో దిగంబర కవితను అధిగమించి వచ్చింది. తెలుగు కవిత మొత్తంగా పొందిన గుణాత్మక మార్పు ఫలితంగా విప్లవకవిత్వం వచ్చింది. ఈ సాహిత్య పరిణామానికి ఆధారం సామాజిక పరిణామంలో ఉంది. ఆ సామాజిక పరిణామమే శ్రీకాకుళ విప్లవోద్యమం.

* * *

శ్రీకాకుళ విప్లవోద్యమం తనకంటె ముందు తెలుగునేల మీద సాగిన ప్రజా ఉద్యమాలన్నిటికన్న గుణాత్మకంగా భిన్నమైనది. సామాజిక, రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక రంగాలలో అది తీసుకొచ్చిన మార్పులు దాని విశిష్టతకు నిదర్శనాలు.

శ్రీకాకుళ గిరిజన పోరాటంలో ప్రధానంగా రెండు దశలున్నాయి. 1958 నుంచి 1968 దాకా సాగిన గిరిజనోద్యమ దశ మొదటిది కాగా, 1968 నుంచి 1971 దాకా సాగిన విప్లవోద్యమ దశ రెండవది. గిరిజనోద్యమం అనివార్యంగా, సహజంగా విప్లవోద్యమంలోకి ఎదిగినందువల్ల ఈ రెండుదశల మధ్య విభజన అంత స్పష్టంగా కనబడదు. తెలుగు సామాజిక, సాహిత్య రంగాలమీద గాఢమైన ప్రభావాన్ని వేసినది శ్రీకాకుళ ప్రజాపోరాటంలోని విప్లవోద్యమ దశ. కాని ఆ విప్లవోద్యమం దానికంటె ముందు జరిగిన ఒక దశాబ్ది చరిత్ర గర్భంనుంచి ఉదయించింది గనుక శ్రీకాకుళ విప్లవోద్యమాన్ని వివరించేప్పుడు 1958 నుంచి ప్రారంభించవలసి ఉంటుంది.

శ్రీకాకుళం జిల్లా కొండ ప్రాంతాలలో ప్రధానంగా మూడు తెగల గిరిజనులు నివసిస్తారు. కొండదొరలు, జాతాపులు, సవరలు అనే ఈ తెగల్లో సవరలు చాల వెనుకబడినవారు. వ్యాపారం చేస్తూ ఈ అడవి ప్రాంతంలోకి ప్రవేశించిన మైదాన ప్రాంతాల షావుకార్లు ఇక్కడి ప్రజలను విపరీతంగా దోపిడీ చేస్తూ పంటలు పశువులు, భూములు, సమస్త ఆస్తులు చేజిక్కించుకున్నారు గిరిజన ప్రజానీకాన్ని బానిసలుగా వినియోగించుకుంటూ, తమ దగ్గర కూలీలుగా, పాలేర్లుగా, తమ దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి బతకవలసినవారుగా మార్చేశారు. ఒకప్పుడు ఆ అడవి చిన్నబిడ్డలుగా అమాయకంగా, అడవే జీవనాధారంగా బతికిన గిరిజనులు బానిసలయి పోగా, మైదాన ప్రాంతాలనుంచి వెళ్ళిన గిరిజనేతర భూస్వాములు, వ్యాపారస్తులు, వడ్డీ వ్యాపారులు ఏజెన్సీకి కొత్త జమీందార్లయ్యారు. గిరిజనులమీద వ్యాపారస్తులు సాగిస్తున్న దోపిడీ దౌర్జన్యాలను అరికట్టడానికనే పేరుతో ప్రభుత్వం చేపట్టిన చర్యలు అంతిమంగా గిరిజనుల మీదికి మరొక దోపిడీ దౌర్జన్య శక్తిని రుద్దడానికే పనికొచ్చాయి ఇట్లా అటవీశాఖ, గిరిజన కార్పొరేషన్‌ల అధికారులు గిరిజనులమీద సరికొత్త జమీందార్లయ్యారు.

గిరిజనులు ఈ దోపిడీ పీడనలను అనుభవిస్తున్న సమయంలో పాలకొండ ఏజెన్సీలోని మండ గ్రామంలో పల్లెరాములు అనే ఒక

ఉపాధ్యాయుడు ప్రజల్ని సమీకరించి వారిలో ఈ దోపిడీని ఎదిరించే చైతన్యాన్ని కలిగించాడు. ఈ తిరుగుబాటు భావాల ప్రచారంవల్ల కక్షతో భూస్వామ్య వ్యాపారవర్గాలు ఆయనను అక్కడినుంచి మొండెంఖల్ గ్రామానికి బదిలీ చేయించాయి. మొండెంఖల్ సమీపంలోని కొండబారిడి గ్రామంలో ఉపాధ్యాయుడుగా ఉన్న వెంపటాపు సత్యనారాయణతో ఆయనకు సంబంధాలు ఏర్పడ్డాయి. తర్వాతనుంచి ఈ ఇద్దరూ కలిసి గిరిజన ప్రజలను సమైక్యపరిచే కృషిలో, గిరిజన సంఘాలను నిర్మించే కృషిలో నిమగ్నమయ్యారు.

ఇలా గిరిజనులను సంఘటిత పరుస్తున్న మొదటి దశలో "ప్రజలకు ప్రధాన శత్రువులైన వడ్డీ వ్యాపారస్తులను, ఫారెస్టు ఉద్యోగులను ప్రతిఘటించాలని నిర్ణయం చేసుకొని ప్రజలకు పిలుపు ఇవ్వడం జరిగింది."[13] ఈ పిలుపుకు చాల విస్తృతమైన ప్రతిస్పందన వచ్చింది. వెంపటాపు సత్యం రాసినట్టు ప్రజలు తమ "జీవితంలో ఒక నూతన మార్పు వస్తుందని భావించారు. సంఘం మీద విశ్వాసం ఎక్కువైంది." ఇలా ప్రజలలో సంఘ నిర్మాణం విస్తృతమవుతున్న కొద్దీ ఉద్యమం ఈ స్థాయినుంచి పై స్థాయికి ఎదగక తప్పని స్థితి వచ్చింది. అందువల్లనే "...వడ్డీ వ్యాపారస్తులను, ఫారెస్టు వాళ్ళనే కాక దోపిడీదారులందరినీ గ్రామాలకు వచ్చిన నిర్బంధించి తగినబుద్ధి చెప్పాలని నిర్ణయించడం జరిగింది." ఇక అక్కడినుంచి ఉద్యమం మౌలిక సమస్య అయిన భూమి సమస్యవైపు మళ్ళింది.

1960 నవంబర్‌లో "వంద గ్రామాలలో వేలాది ఎకరాల" పంట పొలాలు కోసుకొని పంచుకున్నారు. భూమి సమస్య చేపట్టడంతో ఉద్యమపు క్రియాశీలత పెరిగింది. ప్రజా భాగస్వామ్యం కూడ విస్తరించింది. అవిభక్త కమ్యూనిస్టు పార్టీ జిల్లా నాయకత్వానికి ఈ ఉద్యమంతో ఎంతో కొంత సంబంధం ఉంది. పార్టీ 1960లో సత్యంకు సభ్యత్వం ఇచ్చి జిల్లా కమిటీ సభ్యునిగా తీసుకుంది. కాని ఉద్యమం క్రియాశీలంగా మారుతున్నకొద్దీ ఆ నాయకత్వం ఉద్యమానికి హద్దులు విధించడానికి ప్రయత్నించింది. "పంటల స్వాధీన కార్యక్రమం ఆపు చేయించి కూలీరేట్ల పెంపుదల కార్యక్రమం చేపట్టించి, భూసమస్యపై లేచిన ప్రజానీకాన్ని కూలీరేట్ల ఉద్యమంగా మరల్చారు" అని వెంపటాపు సత్యనారాయణ రాశాడు

ఐతే ఒకసారి మేల్కొన్న ప్రజానీకాన్ని జోకొట్టడం, వాళ్ళ క్రియాశీల సంచలనాన్ని అరికట్టడం అంత సులభం కాదు పార్టీ ఆదేశాలతో సంబంధం లేకుండా గిరిజన ప్రజానీకం పంటల స్వాధీనాన్ని కొనసాగిస్తూనే వచ్చారు. ఈ ప్రజానీకాన్ని బెదిరించడానికై వెంపటాపు సత్యనారాయణను, ఆదిభట్ల కైలాసంను, పెదఖర్జ, మొండెంఖల్, నీలకంఠాపురం గ్రామాల సంఘముఖ్యులను భూస్వాములు అరెస్టు చేయించారు. ఒకప్రక్క కూలీరేట్లు పెంచినట్టు నటిస్తూనే వందలాదిమంది గిరిజనులను అరెస్టు చేయించారు.

ఈ నిర్బంధకాండనుంచి ఉద్యమం పటిష్ఠ సంఘటిత నిర్మాణ రూపాన్ని ధరించవలసిన అవసరం ముందుకొచ్చింది. 1960 జూన్‌లో మొండెంఖల్‌లో పదివేలమంది గిరిజన ప్రజానీకంతో గిరిజన మహాసభ జరిగింది. సత్యం అధ్యక్షుడుగా, కైలాసం కార్యదర్శిగా ఏర్పడిన గిరిజన కమిటీ 1961 నుంచి 1966 వరకు ప్రతి సంవత్సరం ఆర్థిక పోరాటాలను నడిపింది 1962లో 25 రూపాయలుగా ఉన్న కూలి రేటు 1966 నాటికి 70 రూపాయలకు పెంచుకున్నారు. "ఈ ఆర్థిక పోరాటకాలంలో రైతాంగం సాధించుకున్న అద్భుత విజయాలు అత్యున్నతమైనవి. ప్రజాసైన్యంలేని రాజ్యాంగ యంత్రాన్ని ఏర్పాటు చేశారు" అని సత్యం రాశాడు ఈ అద్భుత విజయాలలో "కూలీ రేట్లు, పాలేర్ల జీతాల అభివృద్ధి", "అధిక వడ్డీలు రద్దుపూపుట" నుంచి "గిరిజనుల సంస్కృతిని అభివృద్ధి చేయుట", "మూఢ నమ్మకాలను తొలగించుట" వరకూ ఉన్నాయి.

ఆ కాలంలో పార్వతీపురం, పాలకొండ ప్రాంతాలలో సుమారు 300 గ్రామాలలో గ్రామకమిటీలు ఏర్పడ్డాయి. తాలూకా కమిటీలు, జిల్లా కమిటీతో నిర్మాణం పటిష్ఠమైంది. ఈ నిర్మాణం, క్రియాశీల చైతన్యం నక్సల్బరీ వసంతమేఘ గర్జన నేపథ్యంలో చాల సహజంగా సాయుధ పోరాటంగా ఎదిగాయి. 1967 అక్టోబర్ 31న మొండెంఖల్ గ్రామంలో ఐదవ గిరిజన మహాసభ జరిగింది. అప్పటికే వెంపటాపు సత్యం రహస్య జీవితంలో ఉన్నాడు. ఈ సభకు వస్తున్న గిరిజనుల మీద లెవిడి గ్రామం దగ్గర భూస్వాములు కాల్పులు జరిపారు. ఆరికె కోరన్న, బిడ్డిక మంగన్న అనే ఇద్దరు గిరిజనులు చనిపోయారు.

దాదాపు ఈ దశలోనే ఉద్యమం మొదటిస్థాయినుంచి రెండో స్థాయికి ఎదిగింది గిరిజన ప్రాంతమంతటా దళాల్ని నిర్మించడం ప్రారంభించారు పంటల స్వాధీనం, భూస్వాముల ఆస్తుల జప్తు మొదలయ్యాయి 1968 జనవరి నుంచి పోలీసులు ఈ ప్రాంతాలన్నిటిమీద పెద్దఎత్తున విరుచుకుపడ్డారు ఈ నిర్బంధంలో కూడ భూస్వాములను ప్రతిఘటించడం పెద్దఎత్తున క్రియాశీలంగా సాగింది. ప్రజలు రెండున్నర లక్షల రూపాయల అక్రమ అప్పుల్ని చెల్లించడానికి నిరాకరించారు భూస్వాములు అన్యాయంగా ఆక్రమించుకుని ఉన్న రెండువేల ఎకరాల సాగుభూమిని, ఐదువందల ఎకరాల బంజరుభూమిని జనం స్వాధీనం చేసుకున్నారు.

పోలీసు నిర్బంధకాండ ఇంకా పెరిగిపోయి 1968 మార్చి 4న పెదఖర్జ గ్రామం దగ్గర పోలీసులు గిరిజన ప్రజానీకంమీద దాడిచేసి కేదరి అనే జాలాపును, సింగన్న అనే సవరను చంపేశారు

ఇక ఇందుకు ప్రతిగా సాయుధ పోరాటం ప్రారంభించవలసిందేనని, అది రైతాంగ విముక్తి పోరాటంగా ఉండక తప్పదని సత్యం ఆగస్టు నాటికి స్థిరమైన నిర్ణయానికొచ్చాడు. గుంటూరులో డాక్టర్ చాగంటి భాస్కరరావు ఏర్పరచిన నక్సల్బరీ సంఘీభావ కమిటీతో సంబంధాలు, నక్సల్బరీ పోరాట నాయకులతో సంబంధాలు ఆయన అవగాహనలను బలపరిచాయి. 1968 నవంబర్ 25 న శ్రీకాకుళ రైతాంగ సాయుధ పోరాటదినంగా సత్యం ప్రకటించాడు. శ్రీకాకుళ విప్లవోద్యమం అతి భయంకరమైన అణచివేతను ఎదుర్కొంటూ ముందుకు సాగింది. 1969_70 రెండు సంవత్సరాలపాటు పన్నెండువేలమంది సాయుధ పోలీసులు మూడు నాలుగు వందల చదరపు మైళ్ళకు మించని ఈ ప్రాంతంలో దారుణ దమనకాండను సాగించారు. మొత్తంమీద కేవలం శ్రీకాకుళం జిల్లాలోనే 146 మంది ఉద్యమ నాయకులను, కార్యకర్తలను ప్రభుత్వం హత్య చేసింది. కనీసం రెండువేలమంది గిరిజనులు పోలీసుల చేతుల్లో చిత్రహింసలను అనుభవించారు. 1971 నాటికి శ్రీకాకుళ విప్లవోద్యమం తాత్కాలికంగా అపజయానికి గురయి, పాలక వర్గాల దుర్మార్గానికి మరొక నిదర్శనంగా మిగిలిపోయింది తాత్కాలికంగా దెబ్బతిన్నా, శ్రీకాకుళ విప్లవోద్యమం ఒక ప్రజా ఉద్యమపు క్రమ, సహజ పరిణామానికి ఉదాహరణగా నిలిచిపోయింది.

పుట్టుక, పరిణామం, అపజయాల వివాదాలు ఎట్లా ఉన్నా, శ్రీకాకుళ విప్లవోద్యమం తెలుగునాట రాజకీయరంగంలో, సాహిత్య రంగంలో తనవైన కొన్ని కొత్త సాంప్రదాయాల్ని ప్రవేశపెట్టింది. శ్రీకాకుళ విప్లవోద్యమం, శ్రీకాకుళం అనే భౌగోళిక ప్రాంతానికి మాత్రమే పరిమితమైనదిగా ఎంతమాత్రమూ లేదు. 1967 తర్వాత దేశవ్యాప్తంగా ఎక్కడెక్కడ నూతన మానవులు ఆవిష్కరించబడ్డారో అక్కడక్కడ నక్సల్బరీ ఉన్నట్టుగా, శ్రీకాకుళం కూడ ఉన్నది. ఒక్క శ్రీకాకుళం వెయ్యి శ్రీకాకుళాలుగా పరిసించింది, విస్తరించింది. శ్రీకాకుళం అనే భౌగోళిక ప్రాంతంలో ఉద్యమం ఒడిదుడుకులకు గురయి ఉండవచ్చు. కాని రాష్ట్రంలో మరొకచోట, మరొకచోట శ్రీకాకుళ ఉద్యమం పునర్విస్తూనే ఉన్నది. భౌతికశక్తిగా మారగల భావంగా, స్మృతిగా, ప్రతీకగా బలవత్తరమైన శ్రీకాకుళ సాహిత్యం వంటి సామాజిక చైతన్యరూపాన్ని, అందులోనూ కవిత్వం వంటి ఉద్వేగభరిత ప్రక్రియను ఆలంబనం చేసుకోవడం సహజం.

(ఇంకా ఉంది)

ఆశా, నిరాశా

నేనెందుకు బతకాలి ?
అని రాశా డో. నిరాశా జీవి, కవి
నే నెందుకు చావాలి ?
అని రాశా డింకో ఆశాజీవి, కవి

నే నెందుకు బతకాలి
అన్న కవి చావలేదు
అతనికి ఆశలు మొలకెత్తాయి !

నే నెందుకు చావాలి
అన్న కవి బతకాలేదు
అతనికి నిరాశలు చిగురించాయి

కవుల ఆదర్శాలు కవితలకే పరిమితం
చదవలేదు వాళ్ళు నిత్య సత్య జీవితం !

__బులుసు - జీ - ప్రకాష్

కలగూరగంప

జె. ఏ. యేట్సు - గిడుగు రామమూర్తి

20వ శతాబ్దం తొలి దశాబ్దంలో గంజాం ప్రాంతానికి స్కూల్ ఇన్‌స్పెక్టర్‌గా యేట్సు నియమితుడయ్యాడు. తెలుగు ప్రాంతంలో ఉద్యోగం కాబట్టి తెలుగు నేర్చుకున్నాడు. తాను నేర్చింది గ్రాంథిక శైలిలో ఉండడం - సామాన్యుల వ్యవహారం భిన్నంగా ఉండడం బడిలో పిల్లలకు గ్రాంథికాన్ని వ్యావహారికంలో బోధించి గ్రాంథికంలోనే రాయాలని వాళ్ళను నిర్బంధించడం యేట్సుకు అప్పటికి అర్థం కాని సమస్యలు. అప్పుడు విశాఖపట్నంలోని కళాశాల ప్రిన్సిపాల్ పి టి శ్రీనివాసయ్యంగార్ సలహా ననుసరించి ఈ భాషా సంబంధ సమస్యపై వివరణ కోసం గురజాడ అప్పారావును కలుసుకున్నారు యేట్సు తనకంటె భాషా విషయాలు బాగా తెలిసినవాడు రామమూర్తి అని అతనిని సంప్రదించమనడంతో యేట్సు రామమూర్తుల పరిచయం ప్రారంభమయింది

క్రీ॥శ॥ 1906 లో పర్లాకిమిడి రాజావారి స్కూల్ తనిఖీ సందర్భంలో యేట్సు రామమూర్తిగార్ని కలుసుకుని తన భాషా సమస్యను వారిముందుంచాడు. రామమూర్తిగారి వివరణ అతనికి నచ్చింది "సైన్సు మొదలయిన విషయాల్లో పారిభాషిక శబ్దాల చిక్కు ఉంటుంది. కాని చరిత్ర విషయంలో ఆ చిక్కు ఉండదు కదా! హైస్కూళ్ళలో చరిత్రను దేశభాషలో ఎందుకు చెప్పరాదు?" అని యేట్సు ప్రశ్నిస్తే "నాకు చాలా సమ్మతమే కాని గ్రాంథిక భాషలో అర్ధానుస్వారాలు శకటరేఫలూ పాటిస్తూ చరిత్ర గ్రంథాలు వ్రాస్తారు ఆ భాషలోనే విద్యార్థులు పరీక్షలోని ప్రశ్నలకు సమాధానాలు వ్రాయమంటారు అంతకంటె ఎక్కువ సులువుగా ఆంగ్ల భాషలోనే విద్యార్థులు వ్రాయగలరనుకొంటాను అదీ చిక్కు" అన్నారు రామమూర్తిగారు.[1] 'నేడు రచించవలసిన గ్రంథాలు నేటి భాషలో రచిస్తే మంచిదని పండితులకు నచ్చచెప్పి నలుగురికీ తెలియజేయడం ప్రయోజనకరం' అని యేట్సు తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు నాటినుండి భాషాతత్వ విషయంలోను, ఇతర విద్యాబోధన సంబంధిత విషయాల్లోను రామమూర్తిగారి సలహాకోసం వారిని సంప్రదిస్తూండేవాడు.

విద్యావిధాన సంబంధమైన, బోధనా సంబంధమైన సాధక బాధకాలు ఉపాధ్యాయులందరికీ తెలిసేటట్టు ప్రతి సంవత్సరం మే నెలలో ఉపాధ్యాయుల మహాసభను ఏర్పాటు చేయాలని యేట్సు నిశ్చయించాడు. మొదటి సభ 1906 లో జరగాల్సి ఉండింది. ఉపాధ్యాయులా సమావేశ స్థలాలకు రాకపోకలకయ్యే ఖర్చులు విద్యాశాఖవారు భరించే ఏర్పాట్లు కూడా చేసాడు. రామమూర్తిగారి ద్వారా తాము చర్చించుకున్న భాషా విషయాలను సభాముఖంగా ప్రకటించాలని ఉబలాటపడ్డాడు యేట్సు. కాని కారణాంతరాలవల్ల ఉపాధ్యాయుల మహాసభ 1906 లో గాక 1907 లో ప్రారంభం అయింది. తన మండలంలోని హైస్కూళ్ళలో ప్రతి విద్యాలయం నుండి ఇద్దరు ముగ్గురు ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యే ఏర్పాట్లు చేయించాడు. రామమూర్తిగార్ని ఈ సభకు ప్రత్యేకంగా ఆహ్వానించాడు యేట్సు అక్కడికి గురజాడ అప్పారావుగారు కూడా వస్తారని, పి టి. శ్రీనివాసయ్యంగార్, అప్పారావు - తాను - రామమూర్తి పంతులుగారు కలిసి భాషా సమస్యను చర్చించవచ్చని యేట్సు అభిప్రాయపడ్డాడు.

విశాఖపట్నం కళాశాలలో ఉపాధ్యాయుల మహాసభ ఏర్పాటయింది. అనుకున్నట్టుగానే వీళ్ళు నలుగురూ పి టి. శ్రీనివాసయ్యంగార్ ఆఫీసు గదిలో సమావేశమయ్యారు అది అనధికారమూ-రహస్యమూ కావడంవల్ల తాను బయటనే ఉండిపోయినట్టు సీతాపతిగారు రాసినారు[2]

అప్పటివరకూ వేళ్ళు పాతుకున్న గ్రాంథిక భాషాభిమానాన్ని పండితుల్లోనుండి ఒక్కసారిగా తొలగించడం సాధ్యంకాని పని అని గ్రహించి నెమ్మదిగా తన అభిప్రాయాలను బయటపెట్టదలచినారు రామమూర్తిగారు. అందుకనే యేట్సు మొదటిసభలో మాట్లాడమన్నా తాను రెండవసభలో మాట్లాడుతానని రామమూర్తిగారన్నారు[3]

క్రీ॥శ॥ 1908, మేలో జరిగిన రెండవ ఉపాధ్యాయుల మహాసభలో రామమూర్తిగారు 'భాష'పై ఉపన్యసించారు ఈ సభలను యేట్సు ఎంతో ఉత్సాహంతో నిర్వహించడం ఇక్కడ గమనించదగ్గ అంశం

ఈ ఉపాధ్యాయుల సభలో ఆయా వక్తలు చదివిన ఉపన్యాసాలకు పారితోషికం కూడా ఇచ్చే ఏర్పాట్లు ఉన్నట్టు 10. 1-11 నాడు వంశధారనుండి యేట్సు రామమూర్తిగార్కి రాసిన ఉత్తరంవల్ల

తెలుస్తుంది.[4] ఆ ఉపన్యాసాలను మరికొన్ని వ్యాసాలను యేట్సు ఒక పత్రికను (ది టీచర్) స్థాపించి ముద్రించదలచినాడు. రామమూర్తి గార్కి యేట్సు రాసిన ఉత్తరాల్లో ఈ ప్రసక్తి ఎక్కువగా కనిపిస్తుంది. ఆ పత్రిక ముద్రణ గురించి ప్రూఫ్ రీడింగ్ గురించి ప్రస్తావించినాడు. ఈ పత్రిక చివరి ప్రూఫ్‌ను రామమూర్తిగారికి పంపించదలచినట్టు కూడా అందులో పేర్కొన్నాడు. రామమూర్తిగారు ఈ పత్రిక సంబంధమై కొన్ని వ్యాసాలను సేకరించి వాటిని కూడ ముద్రణకోసం పరిశీలించేవారని ఈ ఉత్తరంవల్లనే తెలుస్తుంది.[5] ఈ పత్రికలో ప్రకటించదలచిన విషయాలను వర్గీకరించి వాటిపై రామమూర్తిగారి అభిప్రాయాన్ని కోరాడు. (1) ప్రధానోపాధ్యాయుల నుండి ఉపాధ్యాయుల మహాసభ సమావేశాల నివేదికను కోరడం (2) బి.సూర్యనారాయణను గాని లేక వేరెవరినైనాగాని "కరస్పాండెంట్ కాలొమ్"కు రాయమనడం. (3) తాను రామమూర్తిగారు కలిసి చర్చించిన చరిత్ర బోధన గురించిన అభిప్రాయాలను ప్రకటించడం (4)అప్పటికే పి. టి. శ్రీనివాసయ్యంగార్ ప్రకటించిన లైఫ్ అర్ డెత్ ఎ ప్లీ ఫార్ వెర్నాకులర్స్ అన్నదాన్ని గూర్చిన చర్చ (5) కుర్‌ర్హాడ్ రాసిన ప్రాక్టికల్ జియోగ్రఫీ గూర్చి రాయడం అన్న అంశాలను యేట్సు ఉత్తరంలో పేర్కొని రామమూర్తిగారి సలహాను కోరినాడు.[6] ఫోనెటిక్ టైపును గూర్చిన ప్రస్తావన కూడా ఈ ఉత్తరంలో ఉంది. టైప్ బోర్డ్ తయారీని గురించి ట్రబ్బర్-కుదర్‌ను సంప్రదించినారని వీరిద్దరూ కలిసి కోర్లోన్ ఆర్డరుకి టైపు తెప్పించదలచినారని అది సెప్టెంబరు నెలాఖరులోగా వస్తుందని వాటి ఖరీదు గురించి ప్రస్తావించాడు.

అప్పటికే రామమూర్తిగారు "చిన్న ఇంగ్లీషు వ్యాకరణాన్ని" తెలుగులోకి అనువదించ నారంభించినారు ఇది డానిష్‌లో వున్నట్టిది ఒట్టో జెస్పెర్సన్ ఇంగ్లీషులోకి అనువదించగా దాన్ని రామమూర్తిగారు తెలుగులోకి అనువదించారు. ఈ వ్యాకరణ సంబంధమైన ఇంగ్లీషువారి ఉచ్చారణను గూర్చి రామమూర్తిగారు యేట్సును సంప్రదించినట్టు తెలుస్తుంది.

చిన్న ఇంగ్లీషు వ్యాకరణము అనువాదం రాతప్రతిగా ఉన్నప్పుడే పి టి. శ్రీనివాసయ్యంగారికి చూపించి రామమూర్తిగారు కొన్ని విషయాల్ని చర్చించేవారని తెలుస్తుంది ఆ ప్రసక్తి కూడా 10-1-11 నాటి ఉత్తరంలో ఉంది. ఆ గ్రంథంలో రామమూర్తిగారు చూపిన సవరణలు పి. టి. శ్రీ. అయ్యంగార్ యేట్సుకు చెప్పినాడట. పి. టి. రాసిన అరిత్‌మెటిక్ శైలిలోనే రామమూర్తిగారు ఈ వ్యాకరణానువాదం చేసారని పి. టి. అన్నారని యేట్సు ఇందులో పేర్కొన్నాడు. దాంట్లో కొన్ని సవరణలు కావలసివస్తే తాను చేయించుతానని కూడా యేట్సు రాశాడు. రామమూర్తిగారి ఈ వ్యాకరణ ఉపోద్ఘాతం చాలా విలువైందిగా తాను భావించాడు. తాను ఆ వ్యాకరణానికి తొలిపలుకులు రాయడానికి ఉవ్విళ్ళూరుతున్నట్టు మరి 16 రోజులకు రాసిన 26-1-11 నాటి ఉత్తరంలో పేర్కొన్నాడు. చిన్న ఇంగ్లీషు వ్యాకరణాన్ని యేట్సు తానొకసారి పరిశీలించి ఆర్. జేలగ్ ఎస్క్, మెసర్స్, లాంగ్‌మన్ పర్మ్ ఎండ్ కో 8, హారన్‌బీ రోడ్, బొంబాయికి పంపదలచినట్టు యేట్సు పేర్కొన్నాడు[7]. తరువాత ఈ ప్రెస్సులోనే రామమూర్తిగారి వ్యాకరణం 1919లో అచ్చయింది.[8]

తాను ముందుగా కోరుకున్నట్టుగానే యేట్సు చిన్న ఇంగ్లీషు వ్యాకరణానికి తొలి పలుకులు రాశాడు. రామమూర్తిగారిది స్వతంత్రానువాదం అని, ఇంగ్లీషు తెలుగు భాషాతత్వ భేదాల్ని గూర్చి కూడా స్పష్టీకరించారని యేట్సు రాశాడు.[9] "హి హాస్ నాట్ మియర్లీ ట్రాన్స్‌లేటెడ్ ది ఒరిజినల్ బట్ హాస్ యడాప్టెడ్ ఇట్ టు ది యూస్ ఆఫ్ ది తెలుగు స్కూల్ బాయ్ విత్ ప్రొఫ్యూజ్ ఇలస్ట్రేషన్స్ ఫ్రమ్ ది కామన్ స్పీచ్ ఆఫ్ ది కంట్రీ టు షో పాయింట్స్ ఆఫ్ లయిక్‌నెస్ ఎండ్ డిఫరెన్స్ ఇన్ ఇంగ్లీష్" మూలం డేనిష్ భాషలో ఉందని తెలుగులో అనువదించడానికోసం ఇంగ్లీషు భాషలోకి ఒట్టో జెస్పర్సన్‌గారి సమక్షంలోనే అనువదించారని యేట్సు పేర్కొన్నాడు. ఇందులో ఆయా ఉచ్చారణలకు అంతర్జాతీయ ధ్వనిలేఖన చిహ్నాలను గుర్తించినట్టు యేట్సు తెలిపినాడు.

పాఠ్య ప్రణాళికను పి. టి. శ్రీ. అయ్యంగార్ తయారు చేసినట్టు, అది సమగ్రంగా ఉన్నట్టు తాను భావిస్తున్నానని-పునఃపరిశీలించి పంపమని యేట్సు రామమూర్తిగార్ని కోరాడు.

పి టి. శ్రీనివాసయ్యంగారు సెట్టి లక్ష్మీనరసింహంగారిచేత వ్యావహారికభాషలో ఒక గ్రంథం రాయిస్తున్నట్టు యేట్సు పేర్కొన్నాడు [10]

పాఠ్య ప్రణాళికతోపాటు భాషా సంబంధమైన - బోధనా సామగ్రికి సంబంధించిన విషయాలపై కూడా నాడు చర్చలు జరుగుతుండేవని-ఆ విధంగా సుదర్శనరావును ఎస్.ఎ బి ను తాను కలుసుకున్నాడని-వారు ఉపాధ్యాయుల సాధక బాధకాలను బహిర్గతం చేస్తూ ఉపాధ్యాయులకు మేలు చేకూర్చుతున్నారని రాశాడు.[11]

రామమూర్తిగారి స్వరభాషాసేవ నిరుపమానమైంది. స్వరభాష మాతృభాషగా ఉన్న చిన్నపిల్లలకు తెలుగులో విద్యాబోధన వారికి సబబుగా అనిపించలేదు. రామమూర్తిగారు వీటిపైన ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. ఈ విషయానికి సంబంధించిన ప్రస్తావన యేట్సు శృంగవరపు కోటనుండి రాసిన ఉత్తరంలో ఉంది. అప్పటికి స్వరభాషను నేర్చుకున్న విద్యావంతుడు రామమూర్తిగారే కాబట్టి ప్రభుత్వం రామమూర్తిగారిచేత 'రీడర్స్' స్వర వాచకాలను రాయించా

ల్సిందని యేట్సు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం అధికారికంగా రామమూర్తిగారి గ్రంథాలను ప్రకటించవలసి ఉంటుందని అందులో పేర్కొన్నారు.[12]

ధ్వనిశాస్త్ర సంబంధమైన అంశాలపైన కూడా రామమూర్తి గారిని యేట్సు సంప్రదించేవాడు. అంతేకాక కొన్ని అంశాలపైన రామమూర్తిగారి అభిప్రాయాలను ప్రమాణంగా గ్రహించేవాడు. ఈ ఉత్తరంలో యేట్సు ధ్వనుల పట్టికలో శ-స-ష ల ఉచ్చారణల తేడాని గూర్చి ప్రశ్నించాడు. అట్లే లే చు చదివి-చేను-చీచీ అన్న వాటిలో స ఉచ్చారణలో భేదం ఉంటుందని ఎ,వి,ఓ లకు ముందు వచ్చే సకారం దంత సంఘర్ష శబ్దం (డెంటల్ ఫ్రికేటివ్), ఇంగ్లీషులో కాట్స్ (పిల్లులు) మొదలయినవాటిల్లో (టి ఎస్) ఎస్ అల్వోలార్ ఫ్రికేటివ్ లేదా పరుష్య సంఘర్ష శబ్దం అని రామమూర్తిగారు తయారుచేసిన పట్టికలో 'స'-'ఎస్'లను సూచించారని - దంత్యోచ్చా రణతో కూడిన అక్షరాన్ని సూచించేందుకు రామమూర్తిగారు 'టిఎస్'ను సూచించినప్పుడు దాన్ని టి + ఎస్(మీద చిన్న సున్నాలతో) సూచించ వచ్చు కదా! ఎందుకంటె రామమూర్తిగారు దంత్యోచ్చారణ గూర్చిన గుర్తుగా చిన్న సున్నా వాడినారు కాబట్టి అది సూచిస్తే మంచిది కదా! అని రాశాడు.

తెలుగులో-ఇంగ్లీషులోను ధ్వని ఉచ్చారణకు టి, డి ల మీద సున్నాలతో సూచించినా మామూలుగా తకారపు 'టి' లకు చాలా భేదం ఉంటుందని యేట్సు అభిప్రాయం. ఈ విషయమై రామమూర్తిగారి అభిప్రాయాన్ని కోరాడు యేట్సు.

రామమూర్తిగారికి, యేట్సు తనకు వచ్చిన కొన్ని భాషా సంబంధిత గ్రంథాలను పరిశీలనకు పంపించేవాడు. మళయాళ గ్రంథ మొకదాన్ని పరిశీలించమని రామమూర్తిగార్కి పంపిస్తూ అందులోని రచనా విధానాన్ని తెలుపమని కోరినాడు.[13]

అలహాబాదులో ఒక (పుస్తక) ప్రదర్శన జరుగబోతున్నట్టు దానికి తమ డైరెక్టర్ జనరల్ ప్రధానాధికారి అని యేట్సు రాశాడు.[14] దానికి తాము (రామమూర్తి, తాను) ఏదైనా చక్కని ప్రదర్శనను ఏర్పాటు చేయాలని-ఒక పెద్ద అట్టమీద ఆధునిక ధ్వనిశాస్త్రం- వ్యాసరచన వ్యాకరణం-కథ చెప్పడంలాంటివి ఆకర్షణీయంగా రాసి వాటినిగూర్చి క్లుప్తంగా స్పష్టంగా రచయితల పేర్లతోసహా ప్రదర్శించా లని అనుకుంటున్నట్టు యేట్సు రాశాడు.[15]

రామమూర్తిగారి భాషాసంబంధమైన పరిశీలనాల్ని తెలుసుకున్న వాడవడంచేత రామమూర్తిగారిపై యేట్సుకు గురుభావం ఏర్పడింది. ఈ విషయాన్నే రెమినిసెన్సెస్ అన్న వ్యాసంలో యేట్సు పేర్కొన్నాడు.[16]

రామమూర్తిగారు కూడా యేట్సుకు ఉత్తరాలు రాసేవారని ఆ ఉత్తరాల్లో తమ అభిప్రాయాల కనుగుణంగా ప్రమాణాలను ఐత చేసేవారని యేట్సు తెలిపాడు.

రామమూర్తిగారితో తన పరిచయం కొన్ని సంవత్సరాలే అయినా రామమూర్తిగారి ప్రభావం తనపైన చాలా ఉండేదని యేట్సు చెప్పుతున్నాడు. రామమూర్తిగార్ని గూర్చిన యేట్సు మాటలు పరిశీలిస్తే వారిద్దరూ హృదయమెఱిగిన స్నేహితులన్నమాట అర్థం అవుతుంది.

లెట్ హిమ్ బిలీవ్ ఎ కాస్ టు బి జస్ట్ ఎండ్ ట్రూ, ఎండ్ హి వుడ్ గివ్ హిమ్ సెల్ఫ్ బాడీ ఎండ్ సోల్ టు ఇట్, నెవర్ స్పేరింగ్ హిమ్ సెల్ఫ్ ఎండ్ కేర్‌లెస్ ఆఫ్ పర్సనల్ గెయిన్' రాదర్ వెల్కమింగ్ లాస్ ఫార్ ఇట్స్ ఓన్ సేక్. సో హి బిగాన్ హిస్ సోరా పర్క్ ఎండ్ సో హి హాస్ ట్రాట్ ఇట్ టు ఎ కన్‌క్లూషన్. సో టూ ది రిఫార్మ్ ఆఫ్ తెలుగు లిటరేచర్ విల్ బి ఐడిన్‌టిఫయిడ్ విత్ హిమ్."

రామమూర్తిగార్ని గూర్చి ఎరుగనివారు విద్వల్లోకంలో నేడు లేరు. కాని వారినిగూర్చి క్షుణ్ణంగా చెప్పగలిగినంతటి స్నేహం-ఆత్మీయత గలిగినవాడు యేట్సు. వారి ప్రతిభను ఆనాడే గుర్తించిన ఆంగ్లేయుల్లో యేట్సు మొదటివాడు.

అధోజ్ఞాపికలు

1. గతకాలపు స్మృతులు. కృష్ణా పత్రిక. జి. వి. సీతాపతి. 1960 జులై 2, 9.
2. కృష్ణా పత్రిక. గతకాలపు స్మృతులు, గి. వె. సీతాపతి. 1960-జులై 2.
3, 4. లెటర్ ఆఫ్ జె. ఎ. యేట్స్ టు రామ్మూర్తి "ది బిల్ ఫర్ ఎ లెక్చర్ హాస్ జస్ట్ గాన్"
5. లెటర్ ఫ్రమ్ రాజమండ్రి 24-9-09. మిస్టర్ సూర్యనారాయణ సేస్ మోర్ మేటర్ హాస్ గాన్ టు యు. విల్ యూ సెండ్ ఇట్ ఎలాంగ్? ఇఫ్ యు ఎప్రువ్ ఆఫ్ ఇట్.
6. లెటర్ ఫ్రమ్ రాజమండ్రి 24-9-09.
7. లెటర్ 10-1-11
8 చిన్న ఇంగ్లీషు వ్యాకరణము ఇంట్రడక్షన్ పేజి 10
9. ,, ,, ,,
10. లెటర్ డేటెడ్ 1-9-09 ఫ్రమ్ యేట్స్ టు జి వి అర్.
11. వాట్ గుడ్‌నెస్ ఎట్ ఆల్? గ్లోరియస్‌లీ స్పోర్టీ. వెదర్ ఎప్పారెంట్లీ హి వాస్ వాయిసింగ్ ది క్రయ్ ఆఫ్ ది టీచర్స్!

12. లెటర్ డేటెడ్ 31-1-09 – కాంప్ శృంగవరపు కోట.
13. లెటర్ ఫ్రమ్ వాల్తేర్ 16-10-09
14. లెటర్ డేటెడ్ 28-10-09
15. లెటర్ ఫ్రమ్ జె. ఎ. యేట్స్ టు జి.వి.ఆర్, కాంప్ ధనగాం
16. 'రెమినిసెన్సెస్' వ్యాససంగ్రహం, "హి వాస్ మై గురూ"

శ్రీమతి వి. జానకి

చీనా యాత్రికుల పేర్లు

డా॥ ఇంగువ కార్తికేయ శర్మగారి పుస్తకాన్ని సమీక్షిస్తూ శ్రీ గండి రామలింగం రాసిన వ్యాసంలో కొన్ని అచ్చుతప్పులు దొర్లాయి.

భారతీయులకు సుపరిచితులయిన బౌద్ధ యాత్రికుల పేర్లని రోమన్ లిపిలో వేరు వేరు విధాలుగా రాస్తూ ఉంటారు. వేడ్-గయిల్స్ పద్ధతి ప్రకారమే తేడాలు కనబడుతూ ఉంటాయి!

"గయిల్స్ బయాగ్రఫికల్ డిక్షనరీ"లో "శువాన్ ట్సాంగ్"అని ప్రధానంగా రాసి ఉంది. [డా కింద జ వత్తు వద్దనుకుంటే ట కింద అవత్తుని వాడి రాసుకోవచ్చు!]

ఇతని (శు ట్జాంగ్) అసలు పేరు "చెన్ ఈ". దీని అర్థం ఏమిటో సరిగ్గా చెప్పటం కష్టమే కాని "పాత - విలువకల" అని అనువాదం చెయ్యవచ్చు నేమో!

అప్పటి చక్రవర్తి టాయి ట్సుంగ్ ఇతనికి "సాన్ ట్జాంగ్" అనే బిరుదు ఇచ్చారుట. దీనికి "మూడు నిల్వలు" అని అర్థం అని పిస్తుంది! బౌద్ధుల పరిభాషలో ఇంకా ఏదో అర్థం ఉండి ఉండవచ్చు.

రెండవ యాత్రికుడు "ఈ జింగ్" అసలు ఇంటి పేరు "జాంగ్"ట. తెలుగువారి లాగే చీనావారు కూడా ఇంటిపేరుని ముందు రాస్తారు. (మావ్ట్జ దుంగ్ లో మొదటి రెండు అక్షరాలూ చీనా కమ్యూనిస్టు నాయకుడి వంశం పేరు అన్నమాట) చీనా వారు చాలా మంది సాహిత్యపు పేరు లేదా కలంపేరు ఒకటి పెట్టుకుంటూ ఉంటారు. ఈ జింగ్ యొక్క ఈ రకం పేరు "వెన్ మింగ్" అని తెలుస్తోంది దీనికి "సంస్కృతి" అని అర్థం చెప్పుకోవచ్చు నేమో!

ఈ జింగ్‌లోని మొదటి అక్షరానికి "ధర్మప్రవర్తన" అని అర్థం చెబితే తర్వాతి అక్షరాలకి "ఏరు" అనే అర్థం ఉన్నదా? ఈ అర్థమే కనుక ఉంటే "జింగ్" బదులు "జిన్" కావాలి! ఎవరయినా ఈ సందేహాన్ని పోగొడితే బాగా ఉండును...

చీనాభాష నిఘంటువులు చూడటమే కష్టం. చూసినా స్పష్టంగా తోచే వ్యాఖ్యలే కొన్ని తేలికగా కనపడవు. రోమన్ లిపిలో రాసే విధానాలు ఎన్నో ఉండటంచేత, అసలు చీనాభాషలోనే ఉచ్చారణలో వేరేరూపాలు ఉండటంచేత ఇబ్బందులు ఇంకా పెరుగుతాయి.

—ఒక లేఖకుడు

నివాళి

కవితామనిలో....మధురంగా
కూసిందొక కోయిల అరశతాబ్దికితం.
ఓహో! ఎంత మధురంగా కూసిందన్నారు
వసంతానికే వింత అందాన్నిచ్చిందన్నారు
నువ్వు మధుర కవి వన్నారు.
ఆ ఉత్సాహంలో....
నరాల్ని సాగదీసి - ఊపిరి నింపి
మరింత మధురంగా
మధుర మధురంగా కూయసాగిందా కోయిల.
కూసే కోయిలకు మేసే ధ్యాసే లేదు
ఈ కాలపు ఊసే లేదు
తన గొంతున మరింత మాధుర్యం నింపుదామనే ధ్యాసతప్ప
ఎప్పటికోగాని తెలియలేదు
తన మధురత ఎందుకో వీరికి నచ్చడం లేదని...
దాంతో......
ఆరాటం మొదలయింది తన కడుపున
గ్రహించలేక పోయింది దది
ఆకలితో మనసు చేస్తున్న పోరాటమని.
ఆకలి, దాహం కమ్మేను కొన్నాయి కవితామనిని....
అప్పటినుండి అక్కడ వసంతాగమనమే లేదు.
అప్పుడు చూసింది... తనవారంతా ఏంచేస్తున్నారని
ఆశ్చర్యం ..
భోంచేస్తున్నారు బాగా...
"దాహం" వ్యాపారంలో రాబడి బాగా రాగా...
అప్పటికే....
తానారాధించిన సీతను
పట్టి బజారున పడేశారు - అపర రావణులు.

సావిత్రి, అనసూయలు
వేశ్యావాటికల ఊడిగం చేయిస్తున్నారు.

వరూధిను లెందరో - అపర ప్రవరాఖ్యుల కాహుతయ్యారు.
ఊర్వశి ఊరుపులిరిచారు
ఎంకిని ఏలం వేశారు.
ఎవరికీ తన మధుర గానం అవసరంలేదు....
వినాల్సను కొనే వారు కవితామని లేరు

అప్పుడనుకొన్నాడు..
"ఈ వేగానికి నే నాగలేను
వారి వేగాన్నందుకోలేను
నా గమనం మద్చుకోనూ లేను
అంతవు ఏం..... లిలగి వెళ్ళనూ లేను

ఉషాగమనంతో మనసు స్పందిస్తే
చిందించాను కవితను . అది కూసింది "జాము కోడిగా"
నా పూరికొంపను జేరే ఉషా గమనానికి
ఆకాశ హర్మ్యానడ్డుగా వేశారు..
నా జాము కోడిపాట ఆపివేశారు.

ఆకలి నిండిన కడుపుతో
మనస్సు పిండిన కవిత్వంతో
రంగరంగ వైభవంగా రాశాను... "రెడ్డిరాజ్య మహోదయం"
అంకితం చేసేందుకు వారులేరు.... వీరే ఉన్నారు.

నా పాటకు స్పందించని అరసికులకై కూయలేక
నే నార్జించిన స్పందన, ఆర్ద్రత, అమృతం
మధురిమల వేదాన్ని పుస్తకగతం చేసి
వదిలేస్తున్నా...
రాబోయే కాలం మీది ఆశతో...

అలసిపో పోయి నొలసిపోయి
ఆర్జించినది దాచుకొనే వైనం తెలియకపోయి
ముక్తికోసం తాపత్రయంలో...
ఆర్జనకు ముక్తాయింపు మరొక్కసారి పాడాను "

మబ్బుల మబ్బులచాటు నుండి ఉషోదయాహ్వానం
లేచిగిళ్ళ మాటునుండి విన్పించింది మరో కోకిల గానం
ఆ మనస్సున జనించింది ప్రళయాంతపు "ఓం"కార నాదం .

అందుకే...
మనసు ముక్తికై చేసే ప్రయత్నాన్నాపలేక....
మరో వసంతాహ్వాన మందుకొనే మనసు లేక....
ఏక, శుకరావాలు ఆ దారికి అడ్డురాకముందే
ముక్తికై ... దాటించే నావనెక్కేశాడు
శిశిరంలోనే తల వాల్చేశాడు.

అందుకే నేమో కవీ....
నీగా వైభవ వసంతాని గ్రహణం..
ఇది కవితామనికే గ్రహణం
మాకీ ఉగాది లేదు
సీగుర్తు మాలో మాసిపోదు

మధురకవి బెళ్ళారి శ్రీనివాసమూర్తి గారు 6-2-88 న స్వర్గస్థులైనారు.

వారు భారతి ద్వారా చాలమందికి పరిచితులు వారి ఆత్మ శాంతికై ఈ "నివాళి."

ఒంటి ఎంరంత్మశాంతి చేయ్యుగాక

—బెళ్ళారి సుధీంద్ర తీర్థ
హైదరాబాదు

పులకించకుందురే...

"భారతి" దర్శనంబు, రసభావన పూచిన యట్లుతోచె, సంధ్యారుణ కాంతిమాలికలు యల్లినతీరు స్ఫురించె, తేనియల్ పారిన రీతి తేటపడె, పైడి లభించిన చందమయ్యె, విస్తారపత్రికస్త దేశమున సారమతుల్ పులకించకుందురే ?

ముంగర జాషువ
హిల్‌కాలనీ

అనువాదం కాదు

మార్చి 1988 సంచికలో గ్రంథవిమర్శల శీర్షిక (పుట. 60) "రమణ సన్నిధిలో" పై బ్రహ్మశ్రీ యామిజాల పద్మనాభస్వామి వారు వ్రాసినది చూచాను వారిని గూర్చినేనేమీ అనదలచుకోను. కాని వారూహించినట్లు "రమణ సన్నిధిలో" శ్రీ మునగాల యస్. వేంకట రామయ్య ఆంగ్ల గ్రంథానికి ఇది అనువాదం కాదు తెనుగు అనువాదశైలి భావల ఇంపుసొంపుల మాటకేంగాని, ఆ అనువాదం వేరొకరొనర్చినది. అందలి ఘట్టాలలో కొన్నిటి. ఉటంకించి శ్రీ మద్దాళి సుబ్బారావుగారు వివరించారు,వ్యాఖ్యానించారు. ఆ అనువాదం తనదని శ్రీ సుబ్బారావుగారుగూడ అనలేదు, అనరు.

శ్రీ యామిజాలవారు తమ విమర్శించెడి గ్రంథాన్ని ఒక మారు తిలకింతురని ఆశిస్తున్నాను.

ఓరుగంటి రామచంద్రయ్య
తిరువణ్ణామలై

గ్రంథ విమర్శలు

అమృత వర్షిణి

[చింతలపూడి వేంకటేశ్వర్లు, వెల రు 4-00 లు, ప్రతులకు: మిత్ర సాహితి; ప్రక్కిలంక; (వయా) తాళ్ళపూడి, కొవ్వూరు తా॥ ప. గో జిల్లా.]

చింతలపూడి వేంకటేశ్వర్లు గారి జాతీయ కవిత్వమిది. జాతీయ కవిత్వమని ఎందు కంటున్నానంటే - ఈ సంకలనానికి పీఠిక రాసిన కల్లూరి భాస్కర్ గారు వారి అమూల్యమైన అభిప్రాయాలను ప్రకటిస్తూ కవిత్వంలో ఇది జాతీయ భావ యుగమని దానికి ఉదాహరణ ఈ కావ్యమని చెప్పారు "ఇటీవల శ్రీశ్రీ ఒక సభలో మాట్లాడుతూ మరో వంద సంవత్సరాల పాటు తన ప్రభావాన్ని తెలుగు సాహిత్యానికి దఖలు పరిచాడు ఇది చరిత్రగతిని కానక పోవడమే మన సంస్కృతిలోని విలువను పారవేసుకొని పరాధీనత వలన దాసాను జడులవలె జీవిస్తున్న దేశ ప్రజలకు మెరుపు సైతం ఉజ్జ్వల దీపంగా తోచడంలో వింతలేదు. మహాప్రస్థాన కవికి గుర్తింపు ఆ విధంగా వచ్చినదే" అన్నారు కల్లూరి భాస్కర్, వారి మాటల్లోనే వారు చరిత్ర గమనాన్ని, స్వేచ్ఛకోసం, భూమికోసం, భుక్తి కొసం పీడిత మానవజాతి సాగిస్తున్న వీరోచిత పోరాటాల్ని గమనించినట్టు లేదని తెలుస్తోంది. ఇది కవిత్వంలో శ్రీశ్రీ యుగమైనా-కాకపోయినా ప్రజల యుగం అని చెప్పడానికి సందేహించ నవసరంలేదు. ప్రజల అభిప్రాయాలను, ఆశలను, ఆశయాలను సాహిత్యంలో వాటి నైన విలువలతో అనితర సాధ్యంగా ప్రతిధ్వనించిన కవికి ప్రజలలో గుర్తింపు ఉంటుంది సూర్యుడు మీద ఉమ్మి వేస్తే ఫలితం తెలియంది కాదు. ఇరవయ్యో శతాబ్దపు జన జీవితంలో వచ్చిన, వస్తున్న పెనుమార్పులకు, శ్రీశ్రీ సాహిత్యానికి ఉన్న బాంధవ్యం శిలా శాశ్వతమైంది. ఒకడు చెరిపేస్తే చెరిగేది కాదు.

ఈ సంకలనంలో 'రండి! రండి' అనే ఖండిక, 'కాక్!' అనే ఖండిక వేంకటేశ్వర్లు గారి సాహిత్య సంస్కారానికి మచ్చుతునకలు. మరొకళ్ళు ఎద్దేవా చేసినంత మాత్రంలో కీర్తి లభించదు కీర్తికి దాని దైన అర్హత ఉండాలి. అసమర్థుడు మాత్రమే మరొకడి మీద బురద చల్లుతూ తన ఇమేజిని పెంచుకోవడానికి ప్రయత్నం చేస్తాడు. వేంకటేశ్వర్లు గారిలో ఉన్న కవిత్వ రచనా శక్తిని రచన వైపు మళ్ళిస్తే మంచిదిగదా!.

స్వేచ్ఛా విపణి లేదు, పండించే స్వేచ్ఛ లేదు.
విత్తు చల్లింది మొదలు ఇల్లు చేర్చేవరకూ
పదిమంది కైనా ఇవ్వాలి మామూళ్ళు
సేకరణకూ... .. పంపిణీకి మధ్య
వంద మందైనా ఉంటారు మేతగాళ్ళు.
మేప కూడదనే నియమాన్ని
అధికార దుర్వినియోగం కాటేసింది.
కటోది న్యాయస్థానాల మీద
రాజకీయాలు స్వారీ చేస్తున్నాయి.

అనే పాదాల్లో గొప్ప కవిత్వం (కల్లూరి భాస్కర్ గారి పరిభాషలో) ఉన్నా లేకపోయినా సమాజ గమనం కనబడుతోంది. ఆ గమనాన్ని మళ్ళించటానికి, ప్రజాజీవితాన్ని సుఖమయం చెయ్యటానికి, దోపిడీలు, దౌర్జన్యాలు, మానభంగాలు, హింసలు లేని సమతా సమాజాన్ని స్థాపించటానికి ప్రయత్నించే వాళ్ళను 'విదేశీ భావన' అనే ముద్రతో కొంచెం చెయ్యటం సంకుచిత జాతీయవాదులకే చెల్లుతుంది. ఒక సిద్ధాంతం జాతీయమైనా, విజాతీయమైనా అది అంతమంది మనుషులకి క్షేమాన్ని కలిగించేటప్పుడు ఆచరించటంలో, అభిమానించటంలో, ఆదరించటంలో దోషం ఉంది అనుకుంటే అది జాతీయవాదం కాదు మరొకటి ఏదైనా కావచ్చు. 'లక్ష్యాన్ని చేర్చేదే దారైతేనేం? లక్షణంగా సాగిపోక' - అంటున్నారు కవి. మరి ఆ కవే—

పొరుగింటి పుల్లకూర రుచుల్ని
పొగుడుకునే అలసత్వమా
పోలేదు... ...ఆ పొరుగిళ్ళకే . ...
ఇది కాదు నీ దేశం

అని అంటున్నారు.

వేంకటేశ్వర్లుగారికి కవిత్వం రాసేశక్తి ఉందని ఈ సంకలనం చెబుతోంది ఆ శక్తి ఒక నిశ్చల భావంతో, ఒక స్థిర దృక్పథంతో (అదేదైనా సరే) రాబోయే కావ్యాల్లో వ్యక్తమవుతుందని ఆశిస్తాను

రావి శాస్త్రీయం

[రా. వి శాస్త్రీయం, రాచకొండ విశ్వనాథశాస్త్రి, కూర్పు, చలసాని ప్రసాద్, వెల: రు. 12-04లు, ప్రతులకు· 1) సృజన· వరంగల్ - 506001, 2) సి యస్. ఆర్. ప్రసాద్; సి-108 శ్రీనివాసకాలనీ; గుంటూరు-522006.]

సుమారుగా ఒక రెండు దశాబ్దాలనుంచీ రా వి శాస్త్రిగారు **రాసిన వ్యాసాలు,** ముందుమాటలు, వెనుకమాటలు, చేసిన ప్రసంగాలు, ఇచ్చిన అభిప్రాయాలు ఈ సంకలనంలో చోటుచేసుకున్నై. కవిత్వంలో శ్రీశ్రీలాగా నవలా రచనలో, కథారచనలో రా. వి శాస్త్రి గారు పాఠకలోకంలో తనదైన చెరగని ముద్రను వేసుకున్నారు. మహా రచయితలు, గొప్ప రచయితలు రెండు రకాలుగా ఉంటారు కొంతమంది సంఘాన్ని వెనక్కి నడిపేవాళ్ళు ఇదె ఒక రకం మరి కొంతమంది సంఘాన్ని ముందుకు నడిపించేవాళ్ళు వీళ్ళు రెండోరకం రా. వి. శాస్త్రిగారు రెండోరకం రచయితల్లో మొదటి వరసవాడు

తన రచనలపట్ల స్పష్టమైన అవగాహనఉన్న రా. వి శాస్త్రిగారు యావత్ సమాజంయొక్క మంచికోసమే రాశారు. "రచయిత ప్రతివాడూ తాను రాస్తున్నది ఏ మంచికి హాని కల్గిస్తుందో, ఏ చెడుకు ఉపకారం చేస్తుందో అని ఆలోచించవలసిన అవసరం ఉందని నేను తలుస్తాను. మంచికి హాని చెడ్డకు సహాయమూ చెయ్యకూడదని నేను భావిస్తాను" అని 'నేనెందుకు రాశాను' అనే వ్యాసంలో తన రచనా దృక్పథాన్ని విశదం చేసారు

'ఎందుకు రాశాను?' అనే వ్యాసంలో శాస్త్రిగారు తనను ఇన్‌ఫ్లూయన్సు చేసిన పరిస్థితులు వ్యక్తులు, ఆ ప్రభావంతో తను రాసిన కథలు మొదలైన విషయాలను సవిస్తరంగా ప్రస్తావించారు. రచయిత నిజాన్ని పరిశోధించటం, మంచి చెడులను విశ్లేషించటం, మంచిని ప్రచారం చెయ్యటం చెయ్యాలని, ఆ మంచికోసమే తన రచనలని శాస్త్రిగారు ఈ వ్యాసాల్లో వివరిస్తూ ఏది మంచోకూడా తేల్చి చెప్పారు.

ఈ చట్టాలు, న్యాయస్థానాలు, ప్రభుత్వ యంత్రాంగం మొత్తంగా ఉన్నవాడికే మద్దతు నిస్తున్నాయని, పేదవాడికి న్యాయం జరగటంలేదని, పేదవాడ్ని నిలువునా దోచేస్తున్నారని రచయితలు తమ రచనలద్వారా ఈ అన్యాయాలమీద తిరగబడాలని స్పష్టం చేశారు శాస్త్రిగారు.

సాహిత్యసంఘాలు, నేనెలా రాసేను? నేనెందుకు రాసేను? ముందుచూపు, దృక్పథం, అభిప్రాయాలు, నిరసన, అత్యవసర పరిస్థితి, సాహిత్య ప్రయోజనం, ఉపన్యాసాలు, డాల్ఫిన్‌డైరీ, విషాదగీతాలు అనే ప్రకరణాలుగా విభజించబడిన ఈ పుస్తకంలో రావి శాస్త్రిగారి ఆలోచనా విధానమంతా తేటతెల్లమవుతుంది.

వి. ర సం ఏర్పడిం తరువాత రా. వి. శాస్త్రిగారు వి. ర. సం ఉపాధ్యక్షులు కావచ్చు, ఆ పిమ్మట వి. ర. సం నియమ నిబంధనల చట్రంలో తన వ్యక్తిత్వం ఇమడక, ఆయన రాజీనామా చేసిఉండవచ్చు. వి ర. సం ఏర్పడక మునుపే రా. వి. శాస్త్రిగారు గొప్ప కథలు రాశారుగదా! ఏ రచయితకైనా, కవికైనా తన దృష్టి, సృష్టి గొప్పవి కాకపోతే ఆ రచయితను, ఆ కవిని ఎంత గొప్ప సంస్థ భుజాన వేసుకొన్నా ప్రయోజనం శూన్యమవుతుంది దృష్టిని రచయితల సంఘాలు, సృష్టిని రచయితల పాఠశాలలు ప్రసాదించ లేవు. ఇదంతా ఎందుకు రాస్తున్నానంటే- శ్రీశ్రీ రా వి శాస్త్రి ప్రభృతులు వి ర సానికి ముందు పుట్టినవాళ్ళు, వి ర. సం కంటే ముందే ముందుచూపు కలిగినవాళ్ళు అని చెప్పటానికి.

ఈ సమాజానికి ఇవ్వాళ కావలసింది సంస్కరణవాదం కాదని, సంస్కరణవాదం సమాజంలో జరుగుతున్న అన్యాయాలను అరికట్ట లేదని, అన్యాయాలకు గురి అవుతున్నవారు తిరగబడితేతప్ప నిజమైన న్యాయం ఎస్టాబ్లిష్ అవదని, అదే విప్లవవాదమని శాస్త్రిగారు చెబుతున్నారు

ఆయన రాసిన ముందు మాటలు, చేసిన ప్రసంగాలు సమాజమూ; సాహిత్యమూ - ఈ రెంటిపై ఆయనకుగల అవగాహనకు తార్కాణాలు. మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానం అని రా వి. శాస్త్రిగారి ఈ పుస్తకాన్ని అడ్డంపెట్టుకొని ఎన్నైనా రాయవచ్చు. "లోకంలో చాలా అన్యాయాలు జరుగుతున్నాయి. చాలా అన్యాయాలకి మానవులే కారణం ఈ అన్యాయానికి కారణం ఇదీ అని తెలిసినవాళ్ళు చాలామందున్నారు అన్యాయాలవల్ల లాభాలు పొందుతున్న వాళ్ళు అసలు కారణాలు చెప్పరు అన్యాయాలకి భయపడ్డవాళ్ళు (అసలు కారణాలు తెలుసుకున్నవాళ్ళయినప్పటికి) అసలు కారణాలు చెప్పరు ఈ అన్యాయాలవల్ల దెబ్బతినేవాళ్ళకి అసలు కారణాలు సరిగ్గా తెలియవు. తెలిసికొని అన్యాయాన్ని ఎదిరించబోతే లాభాలు పొందేవాళ్ళు వాళ్ళని అణిచిపారెయ్యటానికి ప్రయత్నం చేస్తారు. అన్యాయాన్ని ఎదిరించే వాళ్ళు చిట్టచివరకి, అన్యాయాలవల్ల బాధపడేవాళ్ళే అవుతారుకాని వేరొకరు అవరు" అంటారు శాస్త్రిగారు అన్యాయానికి గురిఅవుతున్నవాళ్ళు అన్యాయంమీద తిరగబడటానికే రా. వి శాస్త్రిగారి రచనలని వేరే చెప్పవలసిన పనిలేదు.

—టి. యల్. కాంతారావు

కథాపుష్కరిణి

[కథా పుష్కరిణి (ద్వితీయ సంపుటము) రచన: కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి: ప్రచురణ: తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, వెల ఆరు రూపాయలు.

ఈ 'కథా పుష్కరిణి' ఎన్నో పురాణాలనుండి ఏరికూర్చబడ్డ కథల సముదాయం. ఈ రచనకు ఆధారం శ్రీ సాయణాచార్యుల వారి 'పురుషార్థ సుధానిధి'

విజయనగర సామ్రాజ్యం హరిహరరాయలచే స్థాపింపజేసిన మహనీయులు శ్రీ మాధవ విద్యారణ్యస్వామి వారి సహోదరులే శ్రీ సాయణాచార్యులవారు మాధవ-సాయణు లిద్దరూ తండ్రిగారివద్ద వేదములేకాక, సర్వశాస్త్రములు అధ్యయనంచేసారు. కాంచీపురస్థులు, విద్యాతీర్థ బిరుద ప్రసిద్ధులు అయిన శంకరానందయతి చంద్రులవద్ద వేదాంతవిద్యను అధ్యయనంచేసారు

అగ్రజులైన మాధవవిద్యారణుల సాయంతో సాయణ పండితులు చతుర్వేద భాష్య రచనచేసారు. సాయణాచార్యులు శ్రీమద్రాజాధిరాజరాజపరమేశ్వర హరిహర మహారాజ సామ్రాజ్య దురంధరులు, వైదిక మార్గస్థాపనాచార్యులు ఇవి ఈ పుస్తకం మొదటి పేజీల్లో సాయణాచార్యుల గురించి తెలిసిన విషయాలు.

ఈ పుస్తకంలో ఇరవైమూడు పురాణకథలున్నాయి. ఒక్కొక్కటీ ఎన్నో విషయాలను తెలిపి, మనోవికాసాన్ని కలిగిస్తాయి.

మత్స్య పురాణంలో చెప్పిన కొన్ని విషయాలు ఇవి రాజు అనేవాడు ఎలా వుండాలి, మంత్రి ఎట్లాంటివాడయివుండాలి, సైన్యానికి నాయకుడుగా ఎవర్ని నియమించాలి, అంగరక్షకులుగా ఎట్లాంటి వారిని ఎంచుకోవాలి, రాయబారిగా ఎట్లాటివారిని నియమించాలి మొదలైనవి.

ప్రజాపాలకులకు సంబంధించిన వారి గురించి ఎవరు ఎట్లాంటి వారుగా వుండాలన్న విషయాలు నిర్దేశించబడ్డాయి ఇవన్నీ ఇప్పటి ప్రతి ఒకరూ చదివి ఇటువంటి లక్షణాలుగలవారినే ఎంచుకోగలిగితే, ఎవరికీ కష్టాలుండవు నేటి ఓటరుకి, అంత తెలివితేటలు లేకపోవటం వల్ల, ఎక్కువమంది అనామకులు ఎన్నికయి అరాచకానికి దారితీస్తోంది

"కాలానికి రాజే కారణం. అంటే, రాజునిబట్టే కాలం. రాజు ధర్మం ఆచరిస్తే దేవత్వం, అధర్మం ఆచరిస్తే నరకం తప్పదు"

"మంత్రి దేశకాల విశారదుడై వుండాలి... సేనాధిపతికి ధనుర్వేదం తెలియాలి. శీలసంపద వుండాలి...."

ఇప్పటివాళ్లు కొందరు ఇలా లేకపోవటంవల్ల కొన్ని అనర్థాలకు దారితీస్తున్నాయా అనిపిస్తుంది.

ఇట్లా మత్స్యపురాణంనుంచి చెప్పిన అనేక విషయాలు నిజజీవితానికి ఎన్నో విధాలుగా ఉపకరిస్తాయి.

స్త్రీ వ్యసనం, జూదం, వేట, సురాపానం, వాగ్దూషణం, పరుషదండనం, అర్థదూషణం వలన కలిగే అనర్థాలు కథలరూపంలో చెప్పబడ్డాయి.

అట్లాగే, సజ్జనులకు చేసే సహాయంవల్ల కలిగే ఫలం, తెలివి గలవాడు, తగినవాడితో చెలిమివలన లాభంగురించి కథలు వున్నాయి

మస్తసేవరునివల్ల కలిగే కార్యసాఫల్యం, నమ్మించి మోసగించే [illegible] తొందరపాటుతో చేయటం, శరణాగతులను రక్షించటం, పరోపకారం, అబద్ధపు సాక్ష్యం చెప్పటం, క్రూరస్వభావం కలవాడికి పెద్ద పదవులు వస్తే కలిగే అనర్థాలు, కృతజ్ఞతాభావం కలిగివుండటం, [illegible] పెట్టుకోవటం, ఆలోచించకుండా పనులు చేపట్టటం. ఇట్లాంటి మంచి చెడుల గురించి పురాణకథలు ఈ పుస్తకంలో వున్నాయి

ఈ పుస్తకంలోని విషయాలు కేవలం పురాణకాలానికే పనికి కావు. ప్రతి మనిషికి తమ జీవితాలను తిన్నగా నడుపుకోటానికి పనికివచ్చే సాధనాలు.

ఇట్లాంటివి విద్యార్థులకు పాఠ్యగ్రంథాలుగా ఎందుకు పెట్టకూడదూ?

బాబు

ప్రసన్న కథావిపంచి

(నన్నయ ఉపాఖ్యానాలకు సరళవ్యాఖ్యానం, ప్రచురణ: ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ, కళాభవన్, సైఫాబాద్, హైదరాబాద్-4 వెల: రు 13.)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1986వ సంవత్సరాన్ని 'నన్నయ సంవత్సరం'గా ప్రకటించింది. ఆ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ నన్నయ భారతంలోని 8 ఉపాఖ్యానాలకు "సహృదయ విద్వాంసుల సరళవ్యాఖ్యానాలు సమకూర్చి యీ పుస్తకాన్ని ప్రకటించింది.

దీనిలో ఉదంకోపాఖ్యానానికి శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, గరుడోపాఖ్యానికి డా. దివాకర్ల వేంకటావధాని, యయాతి చరిత్రకు శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం, శకుంతలోపాఖ్యానానికి శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి, నలోపాఖ్యానానికి డా॥ ధూళిపాళ రామమూర్తి, రురూపాఖ్యాన, ఆస్తీకోపాఖ్యాన, అజగరోపాఖ్యానాలకు గుత్తగా కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి వ్యాఖ్యానాలు రచించారు.

ఉదంకోపాఖ్యానానికి వ్యాఖ్య రచించిన శ్రీ ఇంద్రగంటి యిలా అన్నారు "ఉపాఖ్యాన సారాంశం తెలియడం, అందులోని భట్టారకుని చాతురి, పద్యరచనలోని నేర్పు, రసాభిముఖమైన పలుకుపొందిక సాధ్యమైనంతలో వివరించడమే దీనిపరమార్థం", ఆ దృష్ట్యావారి వ్యాఖ్య వారు పేర్కొనినట్లు 'సారమతి' ప్రతిపద్యానికి ప్రతిపదార్థ, తాత్పర్యములనూ, విశేషాలను వివరించారు శ్రీహనుమచ్ఛాస్త్రి "భట్టారకుని కందపద్యం వింతపోకడలు పోతుంది. ఒకప్పుడు చదరంగంలో గుఱ్ఱంవలె దూకుతుంది. - -బిందుపూర్వక కకారప్రాస వల్లనూ, ఒక పాదంనుంచి వేరొక పాదంలోకి ప్రాకిన సమాసంవల్లనూ, - - ఎత్తుగడతోదూకి పరుగెత్తుతుంది నన్నయగారి రచనలో ప్రాయశః కంద పద్యాలెక్కువ అవి భావాన్నిబట్టి విరుగుతూ పరుగు పెడుతూ వింత గమనం చూపుతాయి ఈ పద్యవిద్య తిక్కనార్యునకు కూడా త్రోవ చూపింది" అని శ్రీ శాస్త్రిగారు అన్నారు. ప్రత్యక్షర సత్యస్ఫూర్తితో భట్టారకుని ఆంధ్రీకరణం గురించివారు వివరించారు "--భట్టారకుడు భారతాన్ని అనువదించలేదు. తెనిగించాడు. అనువదించడం వేరు; ఆంధ్రీకరించడం వేరు" అని ఆయన వివరించారు.

గరుడోపాఖ్యానానికి వ్యాఖ్యకూర్చిన డా. దివాకర్ల వెంకటావధాని ప్రాథమిక సాహిత్య విద్యార్థులకు అవసరమైన 'నోట్సు'యిచ్చారు మొదట.

'యయాతిచరిత్ర'కు వ్యాఖ్యానము వ్రాసిన శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం తన వ్యాఖ్యను 'ప్రజావ్యాఖ్య'గా పేర్కొన్నారు ఈ భాగములో పద్యముల మొదలు తుదళ్లు యిచ్చినారు. ప్రతిపదార్థతాత్పర్యములు కూర్చినారు.

మహాభారత రచనా కాలమునాటి వచన లక్షణమును వివరిస్తూ శ్రీ ఖండవల్లివారు "భారతాది పూర్వగ్రంథాల్లో వచనము మన కాలపు భాషల్లోవలె చిన్నచిన్న వాక్యములుగా ఉండదు... అసమాపక క్రియలతో వాక్యమును పెంచి వ్రాయుట ఆ కాలపు రచనా పద్ధతి" అని తెలిపారు.

"వాడి మయూఖముల్ కలుగువాడు" అనే ప్రసిద్ధి పద్యానికి వ్యాఖ్య వ్రాస్తూ" ఇదిచాలా సుందరమైన పద్యము ఆశ్రమంలో సూర్యాస్తమయ సమయదృశ్యాలు కంటికి కట్టినట్లు వర్ణిస్తుంది అని వ్రాశారు వ్యాఖ్యాత "వాడి మయూఖముల్ గలుగువాడు" సమాసంపై రేగిన చర్చను వివరించారు ఇతర కావ్యాలలోని స్వభావోక్తి ప్రధానములైన సంధ్యాకాల వర్ణనలు తెలిపారు.

ఈ పద్యం సుందర సంధ్యాసమయాన్ని ఎంత కమనీయంగా దృశ్యీకరిస్తుందో, అంతగా నన్నయ భట్టారకుని మానవస్వభావ పరిశీలనానుభవాన్ని ప్రదర్శిస్తుంది. యువతియైన దేవయాని కచునిపట్ల లగ్న మనస్క. అతని రాకకోసం అనునిత్యమూ ఎదురు తెన్నులు చూచునది సంధ్యాకాలమై, అగ్నిహోత్రములు వ్రేల్వబడుచు, గోవులు మరలి వచ్చిననూ కచునిజాడ తెలియలేదు. ఆమె మనస్సు ఆందోళన చెందినది తన ఆవేదనను ఎవరికి చెప్పకోగలదు? తండ్రికి తప్ప! అందులకే తండ్రియైన శుక్రుని వద్దకు వచ్చినది. కచుని రాకపోవుటను గూర్చి తెలుపుట ఆమె ఉద్దేశ్యము. రాక్షసులతనికి కీడుచేసి రేమోనని యనుమానము ఈ విషయములు శుక్రునకు తెలుపవలెను తనమనస్సు బయట పడరాదు. అందులకే ఆమె యిట్లు ప్రారంభించినది." సూర్యాస్తమయమైనది. ఆవులు ఒంటరిగా వచ్చాయి. హోమకార్యములు జరిగినవి. ప్రొద్దుపోయింది" ఇవి రోజూజరిగేవే! అప్పుడు చెప్పింది అసలుసంగతి "కచుండు నేటియున్ రాడు వనంబులో మృగరాక్షస పన్నగ బాధనొందెనో" అని దీనిలోకూడా శుక్రుడు కోపగించకుండా ఆయన శిష్యులైన రాక్షసులకు, మృగములకు పన్నగములకు నడుమ యథాలాపంగా అన్నట్లు యిరికించింది దేవయాని

ఒక యువతి తండ్రివద్ద తనకు యిష్టుడైన వ్యక్తిని గూర్చిన ఆరాటమును యిట్లుగాక మరెట్లుతెలుప గలదు? అసంబంధితములైన విషయములతో మొదలుపెట్టి, వాటి సంబంధముతో ప్రియుని క్షేమమును గూర్చి విచారించుట యువతులకు సహజము. ఇది నన్నయగారి లోకజ్ఞతకు నిదర్శనము. మనస్తత్వ పరిశీలనానుభవమునకు దర్పణము.

తరువాత శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి 'శకుంతలోపాఖ్యానము'పై వ్యాఖ్య రచించినారు. "ఏ రసభావములకు ఏ వృత్తము ఉచితమో తెలిసి వాడుట నన్నయ పద్యవిద్యా రసజ్ఞతలోని యొక అంశము"ని వారు వివరించారు. ఎడనెడవ్యాస, కాళిదాసకవుల శకుంతల కథలోని శ్లోకములతో సమన్వయించుచూ వీరు హృదయంగమమైన వ్యాఖ్య కూర్చినారు. "నలోపాఖ్యానమందలి శృంగారమును నన్నయ ప్రధానకథలోని శాంతరసమునకు ఎట్లనుకూలముగా రచించినాడో డా ధూళిపాళ శ్రీరామమూర్తి తమ వ్యాఖ్యపీఠికలో వివరించినారు. ఈ పీఠిక విలువైనది, యీ ప్రసన్న కథావిపంచిలోని పీఠికలో అత్యుత్తమమైనది. "ఒక కావ్యముకాని, కథగాని తపస్వులైన వారివల్ల ప్రవర్తించినప్పుడది లోకకళ్యాణము చేయుటకు ఈనలచరిత్ర మట్టిది. అని ఆయన అన్నారు. తమవ్యాఖ్యలో ఈ కథలోని హంసస్వరూపమును ఆయన విచారించారు వీరు వివరించిన విశేషములు సహృదయ రంజకములు పాఠకునికి నన్నయ పద్యవిద్యయందలి రహస్యములను కరతలామలకమొనరించు చున్నవి.

ఇక రురు,ఆస్తీక, అజగరోపాఖ్యానములకు కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు వాఖ్యలుసమకూర్చినారు. కరుణశ్రీ రచనావైఖరి పాఠకులెరిగినదే వారు కూడా కొన్ని పద్యాలలోని విశేషాలను సరళంగా వివరించారు.

నన్నయ భారతంలోని ఉపాఖ్యానాలను పరిచయంచేయటం లక్ష్యంగా సాగినయీప్రచురణ వలన సాహిత్యాభిమానములలో ఆయన రచనపట్ల ఉత్సాహం,ఆసక్తికలిగిస్తాయనడంలో సందేహంలేదు. కొన్ని 'అచ్చుతప్పులు' కంటిలో నినలుసులుగా మెరమెరలాడిస్తాయి ముఖ్యంగా పదాలలో వున్న అచ్చుతప్పులనైనా నివారించే శ్రద్ధ తీసుకోవలసినది మొత్తంమీదయీ "ప్రసన్న కథావిపంచి" ఆంధ్రసాహిత్యలోకమునకు నన్నయను ప్రసన్నముచేయగలదు. ప్రచురణకర్తలకు అభినందనలు.

—భార్గవదేవ

విశ్వనాథవారి భ్రమరవాసిని

(ఒక పరిశీలనము)

[శ్రీమతి కాశీనాధుని సువర్చలాదేవి, ప్రతులకు: 1) రచయిత్రి పేర 77 / 2 ఆర్ టి. మ్యునిసిపల్ కాలనీ, మలక్‌పేట, హైదరాబాదు-36, 2) దేశీ బుక్ హౌస్-నారాయణగూడ - హైదరాబాద్, 3) విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్-4-1-435 బ్యాంక్ స్ట్రీట్ హైదరాబాద్-1 వెల : రు. 40/-]

చరిత్రకారుడుగా ప్రసిద్ధుడైన కల్హణుడువ్రాసిన 'రాజతరంగిణి' కథల్లో ఒకదానిని గ్రహించి దానికి భ్రామరీశక్తినికవచముగా సంతరించి శ్రీ విశ్వనాథ సత్యనారాయణ వ్రాసిన నవల ఇది. దీనిని శాక్తేయ ముద్రతో పరిశీలించిన ఉపాసకురాలు శ్రీమతి సువర్చల.

రణాదిత్యుని స్వప్నజగత్తు భ్రమరనాద ప్రదర్శనం. తొలి జన్మరీతిని ఆత్మీయ విభూతిగా దర్శిస్తాడు. రణారంభ ప్రకృతి అలాటిది (రణరంభ అని కవిసమ్రాట్టు అనడం కన్న 'రణారంభ' అని అనడమే సముచితం అని భావించాను.)

పరమేశ్వరి లీలలు పలురీతులుగ ఉంటాయి. తన తొలినాటి అనుభూతిని యీ నవలారూపాన ప్రత్యక్ష పరోక్షపద్ధతిని ప్రదర్శించిన విశ్వనాథ శాక్త తత్వమును యీ గ్రంథకర్త్రి ప్రపంచించిన తీరు అనితర సాధ్యమూ సర్వోపాదేయమూ అని నేనను కున్నాను.

'కల్హణుని రాజతరంగిణి ఒక తంత్రవారాన్నిధి. తద్రత్నములను వెలికితీయుట యన్న పనిని యీ ఆరు నవలలలోను విశ్వనాథ మహా ప్రౌఢముగ జేసెను' యీ వాక్యం శ్రీమతి తన పరిశీలనలో ప్రత్యక్షసాక్షిగా ప్రత్యక్షరంలో ప్రదర్శించింది ఈమెకూడా ఉపాసకురాలే గనుక యీపని చేయగలిగింది.

ఈ పరిశీలన గ్రంధానికి నలుగురైదుగురు పెద్దలు అభిప్రాయాలు ఇచ్చారు. వాటిలో ఆచార్య సాళ్వ కృష్ణమూర్తి, జనస్వామి సుబ్రహ్మణ్యశాస్త్రిగార్ల రచనలు నిదానించి చదివితే రచయిత్రి పరిశీలనా శక్తిని ఇట్టే గ్రహించవచ్చు.

విశిష్ట పద్ధతిని వెలువడిన గ్రంథాలకు పరిశీలన ఇలా ఉండాలి అనేట్టుగా విషయ పరామర్శ చేసిన సువర్చలను అభినందిస్తూ శ్రీవిద్యా హృదయ పరిజ్ఞానమును మరింతగా పొందవలెనని జనస్వామి వారి మాటగా సలహా ఇస్తున్నాను. విశ్వనాథుని హృదయమునూ సువర్చలాదేవి రచన శక్తినీ తెలుసుకోడానికి యీ కృతిని జిజ్ఞాసువులు ఆదరించగలరని ఆశిస్తాను.

శ్రీవైఖనస చరిత్రము

[రచన . శ్రీ గుండు విఘ్నేశ్వరశాస్త్రి, ప్రతులకు : భక్తి ప్రబోధమండలి, నల్లూరు (వయా) అంగర. తూ॥ గో॥ జిల్లా, వెల : రు 3/- లు.]

బ్రహ్మాండ పురాణాంతర్గతమగు అర్థపంచకమును, మరీచి ప్రోక్తమగు ఆనంద సంహితను ఆధారముచేసి 'కాశీదీశి' రచించారు.

చతుర్ముఖుడు భగవానుని ఆదేశానుసారము శ్రీహరిని అర్చించుటకు ఎట్టివానిని సృష్టించవలెనో యని మనసున ఖననము (తీవ్రాలోచనము) చేసెను, దానిచే రూపొందినవాడు 'విఖనసుడు' విశేష ఖననము వలన పుట్టినవాడు) (ఇది బ్రహ్మాండ పురాణ కథే)

శ్రీహరి స్వయముగా వేదాంత తత్వ మీమాంసలకు ఖననము (మననము) చేసెను. భగవదంశచే భగవంతుని ఆరాధించుటయందు తత్పరుడగు ముని జనించెను. విశేష ఖననమువలన పుట్టినవాడగుటచే విఖనసుడు అని నామకరణము చేసెను.

'నారాయణస్యాత్మా విఖనా ఇతి వర్తతే' - ఆనంద సంహిత. నారాయణుని ఆత్మకు విఖనమని పేరు. ఆ విధముగా పుట్టిన యీ మునికి 'విఖనసుడు' అనిపేరు వచ్చెను.

నైమిశారణ్యమందు యజ్ఞము చేస్తున్న శౌనకాదులు కోరకు సూతుడు ఈ చరిత్ర చెప్తాడు.

విచిత్రమైన వైఖానస వైష్ణవ చరిత్ర ముఖ్యంగా వైష్ణవులు పఠించదగినది విష్ణుభక్తిగల వారునూ చదవవచ్చు కలియుగంలో జనులు సులభంగా ముక్తిపొందే సూత్రం శ్రీహరి స్వయంగా చెప్పినది ఈ కృతిమూలాన తెలుస్తుంది

శ్రీ లలితా స్తోత్రమంజరి

[సంకలన కర్త, ప్రకాశకుడు శ్రీ పురాణపండ రాధాకృష్ణమూర్తి జయశ్రీ టాకీస్ రోడ్డు, రాజమండ్రి-4 వెల రు 2/-]

మంత్ర మాతృకా పుష్పమాలాస్తోత్ర సహితం. శ్రీ లలితా సహస్రనామ స్తోత్రం, త్రిశతీ స్తోత్రం, శ్రీదేవీ ఖడ్గమాలా స్తోత్రం, కాళిదాస కృతి దశశ్లోకి, శ్రీ మహిషాసుర మర్దినీ స్తోత్రం, దేవ్యపరాధ స్తోత్రం, శ్రీ కనకధారా స్తవం, శ్రీ శివకవచస్తోత్రం,-మంత్రమాతృకా పుష్పమాలా స్తోత్రానికీ, శ్రీవిద్యా గద్యకు తెలుగు తాత్పర్యాలూ ఉన్నాయి.

శ్రీమాత మంత్రానికి సంబంధించిన అక్షరాలు ఒక్కొక్కటి ఒక్కొక్క-శ్లోకానికి ఆద్యక్షరంగా రూపొందినది మంత్ర మాతృకా పుష్పమాలా స్తోత్రం 'చేటీ భవన్నిఖిల ఖేటీ' - ఆదిగా గల స్తోత్రం కాళిదాసకృతిగా ప్రసిద్ధం కనకధారా స్తవం ఆదిశంకర భగవత్పాదులు చెప్పినది దేవీ ఖడ్గమాలాస్తోత్రం అభీష్టసిద్ధికరం అని ప్రఖ్యాతమయినది. లలితా సహస్రనామ స్తోత్రం గురించి చెప్పేదేముంది, పురాణపండ వారి సనాతన గ్రంధ ప్రకాశన పరిశ్రమ సర్వథా ప్రశంసనీయం ఆస్తికులకు ఆదరణీయం ముఖపత్రచిత్రం పూజ్యభావానికి ప్రతికృతిగా ఉన్నది

ధర్మక్షేత్రే...

[రచన శ్రీ డి. రంగారావు, ప్రతులకు సౌజన్య గాంధీ నగర్, విజయవాడ-3. వెల: 6/- రూ]

భగవద్గీత - చిన్న నాటికగా సంతరించుకున్నా కృతి ఈ, ధర్మక్షేత్రే .. ధర్మక్షేత్రమైన కురుక్షేత్రమందు సమర సంసిద్ధులై కురుపాండవులు సేనలతో ఎదురెదురుగా వున్నప్పుడు యుద్ధానికి వచ్చిన అర్జునుడు రెండుసేనల నడుమ రథస్థుడై ఉండినా వారిని చంపడమా- నావల్లకాదు - అని విల్లములు జారవిడిచి ఏడుపు మొగముతో కూర్చుంటాడు. ఆ అవస్థలో సారథిగా ఉన్న కృష్ణుడు తత్వబోధచేస్తాడు అది సమగ్రంగా విన్నతరవాత అర్జునుడు స్థాయికి వచ్చి విల్లమ్ములు చేబూని యుద్ధోన్ముఖుడవుతాడు - ఆ కృష్ణుడు చెప్పిన తత్వశాస్త్రమే 'భగవద్గీత'గా విశ్వవ్యాప్తమయింది యుద్ధాన్ని చూడడానికి వచ్చిన సంజయుడు ఇది విని వెళ్ళి ధృతరాష్ట్రుడికి చెప్తాడు. ఆ ఇరువురి సంబంధంకల గీతోపనిషత్తుకి మత ప్రవక్తలుగా ప్రఖ్యాతులైన మువ్వురు భాష్యాలు వ్రాసారు. దేశంలో పేరుగల అన్నిభాషల్లోనూ దీనికి అనువాదాలు వచ్చాయి ఇది క్రొత్తపుంతలో వచ్చిన గీత

దీనిలో సంజయ ధృతరాష్ట్రుల్లు లేరు కృష్ణార్జునులే రెండు పాత్రలుగా వచన నాటికగా మూర్తీభవించింది అర్జునుడు అడుగుతూ ఉంటాడు. కృష్ణుడు చెప్తూ ఉంటాడు.

'ఇది వినదగు మాట.'

ఇది 'భగవద్గీత' - అర్జునునితో కృష్ణుడన్నమాట మనసు కలచినపుడు మన్నించి యోచించి తరచిచూడ తమకై దారి దొరకు - అన్నారు రంగారావుగారు.

అందరికీ ఇట్టే అర్థమయే వాడుక భాషలో రూపొందించారు. తెలిసిన వారికీ తెలియనివారికీ తెలిసీ తెలియని వారికీ హస్తభూషణముగా ఉండదగిన గ్రంథం.

శ్రీ గిరిజా కళ్యాణము

(మంజరీ ద్విపద గీతములు)

[కూర్పు శ్రీ పి. దుర్గారావు, ప్రతులకు కూర్పరి పేర, చెరుకుపల్లి పోస్టు. కేతేపల్లి మండలము-నల్లగొండజిల్లా, మూల్యము . రు. 10-00]

కాళిదాస త్రయంలో కుమారసంభవం అగ్రగణ్యముగా గీర్వాణ శ్రవ్య కావ్య ప్రపంచంలో పేరు పొందింది. రఘువంశం స్థాయి వేరు ఇందలి ఇతివృత్తం శివపురాణం నుంచి ఆ మహాకవి గ్రహించినట్టు నా భావన దీనిని ఇంతకు ముందు కొందరు పెద్దలు తెలుగు చేశారు ప్రస్తుతం దుర్గారావు గారు పార్వతీ పరిణయంతో ముగిసే ఏడు సర్గలకు మంజరీద్విపద రూపాన రూపు దిద్దారు.

'తాం హంసమాలా శ్శరదీవ గంగాం
ప్రపేదిరే ప్రాక్తన జన్మ విద్యాః'

అనే శ్లోక భాగానికి 'కమనీయమగు శరత్కాలంబు నందు । నలరి గంగను జేరె హంస మాలగను । దివ్యౌషధిస తనదీధితుల్ చెలగి రాత్రివేళకు వచ్చి రాజిల్లినట్లు । గతజన్మ నేర్చిన ఘనవిద్యలన్ని । యుపదేశమాత్రము నొప్పుగా వచ్చె' - అని కమనీయంగా తెనుగు చేశారు. అలాగే పార్వతిని వర్ణించిన తీరు ముచ్చటగా ఉంది. పార్వతి తపోవర్ణన చిన్నచిన్న కల్పనలతో సొంపుగా వర్ణించారు

'చంద్రజ్యోత్స్నల హాయి నందుకోదాయె' - ఇలాటి పాదాలలో గణభంగాలూ యతిస్థలనాలూ సవరించుకోవలసి ఉంటుంది అందరికీ అందుబాటుగా ఉన్న తెనుగుసేత - అందరూ సాదరంగా సంగ్రహించుకోవలసే కృతి ముఖచిత్రం ముచ్చటగా ఉంది

—యామిజాల పద్మనాభస్వామి

Printed & Published for Nageswara Rao Estates (Private) Ltd , by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3 Editor S. Radhakrishna, Vijayawada Phones 75667 & 61247.